
ఆంధ్ర సచిత్ర వారపత్రిక

13-10-78
75 పైసలు



మీరు కేవలం ఓ బల్బ్ కొనాలనుకుంటే, ధారాళంగా దేనినైనా కొనండి
కానీ మీరు చౌకగా కొనాలనుకుంటే,
హెచ్‌ఎమ్‌టిని కొనండి



చాలా బల్బులు, ఒక ధరలో ఉంటాయి. అన్నీ ఒకే కాలం మన్నుతాయి. హెచ్‌ఎమ్‌టి బల్బులు కూడా అంతే ధరలో వుంటాయి. కాని చిరకాలం మన్నుతాయి. అందుచేతనే అవి చౌక అయ్యాయి.

హెచ్‌ఎమ్‌టి బల్బులు ఎందుచేత చిరకాలం మన్నుతాయి?


ఇతర ఉత్పాదకులకన్నా హెచ్‌ఎమ్‌టి కొన్ని ఉత్కృష్టమైన లాభాలను కలిగివుంది. హెచ్‌ఎమ్‌టి మాత్రమే, తమంతట తామే, బల్బు యొక్క అన్ని భాగాలను తయారు చేసే ఏకైక సంస్థ. అందుచేత ప్రతి దశలోనూ నాణ్యతను అదుపులో ఉంచేందుకు హెచ్‌ఎమ్‌టికి వీలౌతుందన్న మాట.

ఇంకా, హెచ్‌ఎమ్‌టి వారు బల్బులు తయారుచేయడం ప్రారంభించక ముందే వారు బల్బులను తయారుచేసే యంత్రాలను ఉత్పాదనచేస్తూ వస్తున్నారు. ఇందువలన కేవలం సాధారణ బల్బులు కాక విశిష్టమైన, ఉత్తమమైన బల్బులు తయారుచేసే సాంకేతిక పరిజ్ఞానపు అధిక్యతను హెచ్‌ఎమ్‌టి కలిగివుంది.

అంతేకాదు, హెచ్‌ఎమ్‌టి వారు అగ్రగణ్య వారి— అంటే ప్రపంచంలో ల్యాంపులు తయారుచేయడంలో అత్యంత అనుభవం కలిగిన ఒకానొక విశిష్ట సంస్థ— అనుభవం, విజ్ఞానం కలిగివున్నారు. ఇది హెచ్‌ఎమ్‌టి బల్బులకు అంతర్జాతీయ నాణ్యతనిస్తుంది.

ఇంకా, హెచ్‌ఎమ్‌టి వారికి, వాచీ గడియారాలు, యంత్ర పరికరాలు మరియు ట్రాక్టర్లు తయారుచేయడంలో 25 ఏళ్ళగా సంపాదించిన ఖ్యాతి వుంది. మరి ఆ ఖ్యాతినంతా వారు, ఓ గాజు ముక్కపై పణంగా ఒడ్డుతున్నారంటే ఏదో వుందన్న మాటే మరి.

ఔను, వుంది మరి. మరింత ప్రకాశవంతమైన కాంతి. చిరకాలపు మన్నిక. ఇంకా ఉత్తమమైన నాణ్యత. ఇంకా చౌకకూడాను.



హెచ్‌ఎమ్‌టి బల్బులు - మీ జీవితంలో వెలుగులు

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938-1972]
శుక్రవారం : 13-10-'78
కాళయుక్తినామ సం. ఆశ్వయుజ శు. ద్వాదశి
సంపుటము 72 : సంచిక 5
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
*
పోస్టులో ఏడాది చందా రు. 41-60
ఆరు మాసాల చందా రు. 20-80
విడి ప్రతి వెల 75 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ఉత్తరాలు

అట్టమీద బొమ్మ

"సంగీత" ముఖచిత్రంతో వెలువడిన "ఆంధ్రసచిత్రవారపత్రిక" చాలా బ్యూటీఫుల్‌గా



వుంది. కార్టూన్స్, సినిమా గురించి నేను వేరే వ్రాయనవసరం లేదు. ఇక కథలలో "జారుడు మెట్లు" నాకు బాగా నచ్చింది.

వీరపనేని కే. వర్ధనరావు, —శివాపూర్ (కర్ణాటక)

*　　*　　*

29-9-78వ తేదీతో వెలువడిన సంచికపై ముఖచిత్రం, సాంఘిక, పౌరాణిక "సీత", సంగీత (ముఖచిత్రం) చూడ ముచ్చటగా ఉన్నది. ఈ సారి. వీరాజీగారు "సాహసమ్మని సఖుగుడు" చాలా బాగా వ్రాసేగారు. కథలు "జారుడుమెట్లు, గడ్డిపోచ" చాలా బాగున్నాయి. కార్టూన్స్ మరీ మరీ ఎక్కువగా వేయండి. "రాగద్వేషాలు" భావయుక్తంగా సాగుతోంది.

పెన్మెత్స సూరిబాబు, ఎస్. హనుమంత్ రావ్, శేఖర్ రెడ్డి, ఎ.వి రావ్. (హైదరాబాదు.)

*　　*　　*

29-9-78 ఆంధ్ర సచిత్ర వార పత్రిక ముఖ చిత్రం నటి సంగీత చాలా చూడముచ్చటగా ఉన్నది. మోహనరూప సీరియల్ చాలా బాగుగా ఉన్నది. ముందు పత్రిక రాగానే మోహనరూప సీరియల్ చదివి కాని మిగతావి చూడ లేదంటే మీరు నమ్ముతారా. ముగింపు చాలాబాగుగాఉన్నది.


ఆర్. రామలక్ష్మి, (వంకాయవేమవరం.)


*　　*　　*

ది. 29-9-78వ తేదీన సినీ నటి బహారి "సంగీత" ముఖచిత్రముతో వెలువడిన "ఆంధ్ర సచిత్ర వార పత్రిక" చాలా బాగున్నది.

అప్పాన అనంతసుందరావు. (తాళ్ళపూడి.)

—లోకం పోకడ ✻ ఓమెక—





సప్తమారుతములు

ప్రాణవాయువు లేకుండా మనిషి బత లేడు. వాయురూపాలైన పంచ ప్రాణాలు—ప్రాణ - అపాన – వ్యాన – ఉదాన సమానములు దేహికి అవసరం. ఇవి కాకుండా విశ్వమంతటా వ్యాపించిన వాయువులు ఏడు ఉన్నాయి. అవి ఏవో, ఎక్కడ ఉంటాయో చాలా మందికి తెలియదు.

ఖగోళంలో ఎన్నోమండలాలున్నవి. అన్నిటికీ మీద ఉన్నది సూర్యమండలం. దానికిందిది నక్షత్రమండలం. నక్షత్ర మండలం క్రింద చంద్రమండలం ఉన్నది. దాని క్రింద గ్రహమండలం, గ్రహ మండలం క్రింద సప్తర్షిమండలం, దాని క్రింద ధ్రువమండలం ఉన్నవి. సప్తవాయువుల్లోనూ ఆరు వాయువులు పై ఆరుమండలాలలోనూ ఉన్నవి. మిగిలినది మేఘాలు, వర్షం, ఉల్కలు, మెరుపుల్లో ఉంటుంది. ఆ వాయువులు అవహ, ప్రవహ, సంవహ, ఉద్వహ, వివహ, పరివహ, పరావహములు. ఇందులో ఏది ఎక్కడ ఉండేదీ బ్రహ్మాండ పురాణంలో చెప్పబడింది.

"ఆవహోవర్తయేద్వాయుః
మేఘోల్కా వృష్టి విద్యుతః,
వర్తయేత్ ప్రవహశ్చాపి
తథా మార్తాండ మండలం,
వర్తయే దుద్వహశ్చాపి
తథా నక్షత్రమండలం,
సంవహో మారుత స్కంధ
స్తథా శీతాంశుమండలం.
సంవహోపి వివాహాఖ్యః
తథైవ గ్రహమండలం,
సప్తర్షిచక్రం స్వర్గంగాం
షష్ఠః పరివహస్తథా,
పరావహస్తథా వాయుః
వర్తయేద్ధ్రువ మండలమ్."

ప్రవహం సూర్యమండలాన్నీ, ఉద్వహ వాయువు నక్షత్రమండలాన్నీ ఆవరించి ఉంటాయి. సంవహ వాయువు చంద్రమండలాన్నీ, వివాహమనేది గ్రహమండలాన్నీ ఆవరిస్తాయి. పరివహం సప్తర్షిమండలాన్నీ, ఆకాశగంగను ఆవరిస్తుంది. పరావహం ధ్రువమండలాన్ని ఆవరిస్తుంది. మొదటిదైన అవహ వాయువు మేఘాలలోనూ, వర్షంలోను, మెరుపుల్లోనూ, ఉల్కలలోనూ ఉంటుంది. ఇవి ఖగోళాన్ని ఆక్రమించిన వాయువులు!

ఉత్తరాలు

వినాయక చవితి సంచిక

వినాయక చవితి సంచిక (15–9–78) హాస్య ప్రధానంగా మున్నెన్నడూ లేనంత బాగావచ్చింది. అన్ని కార్టూన్లు, ప్రత్యేకంగా బాపు రమణల గారి "పనివేళలు మారితే .." ముఖ్యంగా నవ్వించాయి. "వానలు, వరదలు" చిత్రాలు, సినిమా చిత్రాలు ప్రత్యేకాకర్షణీయంగా ఉన్నవి.

ఎల్లా శివప్రసాదరావు (బందరుపేట)

* * *

15–9–78 నాటి శ్రీ విఘ్నేశ్వరుడు ముఖ చిత్రంతో వెలువడిన పత్రిక నన్నెంతగానో నవ్వించింది. ఎప్పుడూ యిలాంటి ఉత్తరాలు వ్రాయలేదు కాని యిపుడెందుకో మిమ్మల్ని అభినందించాలనిపిస్తోంది.

పుట్టినరోజు సంచిక దాని ప్రత్యేకతను అద్వితీయంగా రూపొందించుకున్నదని నా అభిప్రాయం.

అన్ని పేజీలూ రసవత్తరంగా వున్నా. నాకు "యింటర్వ్యూ" కథ మరియు సినిమా రామాయణం మరీ మరీ హృదయానికి హత్తుకు పోయాయంటే నమ్మండి! నేనే కాదు అందరితో నవ్వించాను!!

జి. శ్రీనివాసులు, సుభాష్‌నగర్, (మహబూబ్‌నగర్)

నాడు నేడు - రేపు

నా రచన "నాడు-నేడు-రేపు"ను వారపత్రికలో ప్రచురించి ప్రోత్సహించి సందుకు హృదయపూర్వక కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను. 48వ పేజీ 3వ కాలములో 26వ లైనును అసంపూర్తిగా వదిలివేసారు. దయచేసి దానిని యీ క్రింది విధంగా పూర్తి చేసి పత్రికద్వారా పాఠకులకు తెలియచేయగలరని భావిస్తున్నాను. హిందూదేశ రాజులు అంతఃకలహాలతో యుద్ధాలు సాగిస్తున్న కాలంలో ఇస్లాం మతవ్యాప్తికై మహమూదు, మహమ్మద్ ఘోరీలు వరుసగా దండెత్తి చిన్న చిన్న రాజులందరిని ఓడించి సుస్థిరమైన ముస్లిం అధికారాన్ని స్థాపించారు.

చైతన్యమ్ (రచయిత) [వేల్పూరు]

హైదరాబాద్ నోట్‌బుక్

మా (మీ) వినాయక చవితి సంచికలోని కార్టూన్లు మమ్మెంతగానో ఆకర్షించినవి. "హైదరాబాదు నోట్‌బుక్"లోని నర్సుమని కేశవరావుగారి గురించి తెలియచేసిన విషయములకు ఎంతో సంతసించుచున్నాము.

దొంగ సత్యనారాయణ (రామచంద్రాపురం) (రామచంద్రునిగూడెం)

సినిమా

29–9–1978 నాటి సంగీత ముఖచిత్రం చాల అందంగా ఉంది.

జి.వి.జి. పేజి వల్ల మాకు చాలా క్రొత్త విషయాలు తెలుస్తున్నాయి.

"గడ్డిపోచ" కథలో డబ్బుకోసం ఆత్మ వంచన చేసుకున్న ఆలం పాత్రను చాలా సహజంగా చిత్రించారు. రచయిత కోటి సీతారామ శాస్త్రిగారికి నా అభినందనలు.

ఎన్గంటి దివాకరరావు, మునిగంటి వసంత కుమార్, (పెద్దపల్లి.)

* * *

నవ్వుని వసిడిపోసు. ప్రకాశించే మోము, పైడి ఆభరణ కాంతితో, సిరిసిరుల సౌందర్య మాధుర్యంతో, నున్నని చెక్కిలి పరువాల సోయగాల దడలిక, పైట చాటు సిగ్గుదొంతరలు, చిలికే 'సంగీత' ముఖచిత్రం, ముద్దుగావుంది. నన్నెంతో ఆకర్షించింది. అదే 29–9–78 మీ పత్రిక ముఖచిత్రం! మాకే విచిత్రం!

ఎల్. ప్రహ్లదచంద్ర, బి.ఎ., (ధర్మవరం.)

(58వ పేజీ చూడండి)

ఈనాటి వనితాలోకం

ఈ శీర్షికను నిలిపివేయాలనుకుంటున్నాము. కనుక మా పాఠితలు యిక ముందు తమ వ్యాసాలను పరిశీలనార్థం పంపవద్దని మనవి చేస్తున్నాము. ఇంతవరకు అందిన వ్యాసాలను పరిశీలిస్తాము. సం.

సీరియల్

రాగద్వేషాలు

శ్రీమతి మాధవపెద్ది పుణ్యశీలాప్రసాద్

15

(గత సంచిక తరువాయి)

అంత రాత్రివేళ వచ్చి తలుపు కొట్టిన వ్యక్తి ఎవరా అనుకుంటూ తలుపు తెరిచాడు శ్రీకర్! ఇందిరని చూసి ఆశ్చర్యపోయాడు.

గబుక్కున లోపలికి నడిచి సోఫాలో వాలిపోయింది ఇందిర.

"నాకు...నాకు...ఆశ్రయం... కావాలి" అతి కష్టంమీద ఆ మాటలను పలకగలిగింది.

గొంతు ఎండిపోయింది. చెప్పలేని నీరసం ఆవహించింది ఆమెని. మాట రావటంలేదు. కళ్ళు తెరిపిడి పడడంలేదు. స్పృహ తప్పిపోయింది!

శ్రీలత, శ్రీకర్‌లు ఆమెని మంచంమీద పడుకోబెట్టారు. ముఖంమీద నీళ్ళు జల్లారు. అయినా చాలా సేపటికిగానీ స్పృహ రాలేదామెకి.

కళ్ళు తెరవంగానే వేడి వేడి కాఫీ ఇచ్చింది శ్రీలత. అది తాగాక కాస్త ప్రాణ వచ్చింది ఇందిరకి. అతి కష్టంమీద లేచి కూచుంది.

క్రిందటి రోజునించి అన్నం లేకపోవడం వలన- జరిగిన ఉదంతంవలన- మానసికాందోళనవలన ఆమెలోని శక్తి అంతా హరించుకు పోయింది!

ఆమె పరిస్థితిని అర్థంచేసుకున్న శ్రీకర్- "మీరు విశ్రాంతి తీసుకోండి. రేపు మాట్లాడుకుందాం. లతా నువ్వు ఇందిర దగ్గరే పడుకో. ఇందిరగారూ... మీరు నిశ్చింతగా నిద్రపోండి. మీకింకే భయమూ లేదు" అంటూ లోపలికెళ్ళిపోయాడు.

శ్రీలత ఇందిరని పట్టుకుని మంచంమీద పడుకోబెట్టింది. దుప్పటి కప్పింది. ఆ పక్కనే మరో మంచంమీద తనూ పడుకుంది. ఆమెని మాత్రం ఏమీ కదిలించలేదు. ఆమె మనస్థితిని గ్రహించే తనూ మాట్లాడకుండా పడుకుంది. ఇద్దరికీ కంటిమీద కునుకులేదు.

ఇందిరకి జరిగిందంతా కళ్ళముందు కొచ్చింది. ఎట్లా పుట్టింది తను? ఎంత అపురూపంగా పెరిగింది? ఎంత అల్లారుముద్దుగా పెరిగింది? ఆడింది ఆటగా- పాడింది పాటగా ఎట్లా సాగించుకుంది అన్ని- పుట్టింట్లో? తన తల్లిదండ్రులకు ఎంత ప్రాణం తనంటే- దేనికీ లోటు లేకుండా పెరిగింది ఇన్నాళ్ళూ! అంతా తీపే గానీ చేదు అంటూ లేదు ఇన్నాళ్ళూ- తన జీవితంలో! అమ్మ పోయాక నాన్న తననెట్లా చూసుకున్నారు? పువ్వులాగానే పెరిగింది తను- తండ్రి చేతిలో! రెట్టింపు ప్రేమతో చూశారు- అమ్మ పోయాక నాన్న! మహారాణీలాగే అన్నీ తనిష్టప్రకారమే జరిపించుకుంది!

ఆక్సిడెంట్‌లో తన స్నేహితురాలు పోయిందని తెలిసీ తనని కాలేజీనే మాన్పించేశారు. తనకి ఏ కష్టమయినా కలుగుతుందేమోనన్న ఊహే భరించలేని తన తండ్రి!

అట్లాంటి తండ్రి ఇది...ఇది ఈ సంగతిని విని భరించగలరా? అసలు బతకగలరా?

ఇందులో తప్పు తనదీ ఉందా? అందని దానికై అర్రులు చాచడం తప్పు కాదూ? దూరపు కొండలు నునుపు అనుకోవడం తప్పుకాదూ? అయినా తన తండ్రికి ఎందుకో ఆ పిచ్చి? తెలుగు

జరిగినకథ 10: ఉన్నతాధికారి హనుమంత రావుగారు వివాహమాడిన బెంగాలీ యువతి గీత, ఇందిరను కనిన కొంతకాలానికి మరణిస్తుంది. ఆయన అక్క సుగుణ తన కొడుకు ఫారిన్ రిటర్న్‌డ్‌ను ఇందిరకు యిచ్చుటకు ఆమె అత్తమామలు నిరాకరించారని ఉత్తరంలో విచారం వెలిబుచ్చుతుంది. ఇందిరను చేసుకునే విషయములో విశ్వనాథం వ్రాసిన ఉత్తరం హనుమంతరావుని గుండె పోటుకు గురిచేయగా, ఆయన కుమారుడు శ్రీకర్ వ్రాసిన ఉత్తరం ఊరట కల్గిస్తుంది. హనుమంతరావుగారు ఇందిరకి వేరే సంబంధాలు చూస్తుంటారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న ఆనంద్‌తో ఇందిరకు ఘనంగా వివాహం జరిపిస్తారు రావుగారు. కాపురానికి కావలసిన అన్ని వస్తువులూ ఇచ్చి, ఇందిరను అత్తవారింటికి పంపుతారు. దురదృష్టవశాత్తు తుఫాను భీభత్సంలో తల్లిదండ్రులను కోల్పోయిన అల్లుడ్ని, కూతుర్ని తనింటికి తెస్తారు రావుగారు. ఇందిర తండ్రిని ఒంటరిగా వదిలివేసి ఆనంద్‌తో అమెరికా వెళ్ళిపోతుంది. 'నాన్సీ' స్నేహితుని భార్య అని చెప్పి యిందిరను ఆమె యింటికి చేరుస్తాడు. నాన్సీ, ఆనంద్‌ల ప్రవర్తనను ఏవగించుకున్న ఇందిర, వేరే ఇల్లు చూపమని శ్రీకర్‌ని అర్థిస్తుంది. నాన్సీ తన భార్యేననీ, ఇందిర ఆమెకు ఊడిగం చేయక తప్పదని చెప్పిన ఆనంద్‌ను ద్వేషించి బయటికివచ్చేస్తుంది ఇందిర.

రాగద్వేషాలు

బ్రాహ్మణులే కావాలని ఎందుకో ఆ పట్టుదల ?

తను వర్ణాంతర వివాహం చేసుకుని దూరమైన తెలుగు సంఘానికి మళ్ళీ ఈ విధంగా దగ్గర కావాలనేమో ?

కానీ జరిగిందేమిటి ? అసలు పేపర్లో అడ్వర్టయిజ్‌మెంటు చూసి అంతమోజు పడ్డారెందుకో నాన్న ?

ఇట్లా ఇంకెంత మంది మోసపోతున్నారో ? వరుడు ఫారిన్‌లో వున్నాడంటే అదో గొప్పని అనుకుంటున్నారు. ఆడపిల్లల తల్లిదండ్రులు కట్నాలు పొయ్యలేక తగిన వాడ్ని తేలేక చెప్పులరిగేలాగా తిరగలేక గుండెలమీద కుంపట్లలాగా పెరుగుతున్న పిల్లలకి పెళ్ళిళ్ళు చెయ్యలేక చెయ్యాలనే అభిలాషను ఒదులుకోలేక గత్యంతరం లేక ఇంక పేపర్ల ప్రకటనల వెంబడి పడతారు కాబోలు !

దానికితగ్గట్టే పేపరలోవివరాలేమీ ఇవ్వక పోయినా ఇచ్చినవి సరిగా లేకపోయినా వాటికి అప్లైచేసి నెలరోజుల గడువులో పిల్లనిచ్చి పెళ్లిచేసి చేతులు దులుపుకునే అభాగ్యపు తల్లిదండ్రులు ఎందరో ! అతడు మంచి వాడయితే అదృష్టం అంటారు. లేకపోతే కర్మసిద్ధాంతం చెప్తారు. అదేమిటంటే వేదాంతం వెళ్ళగక్కుతారు!

ఆడపిల్లలు ఫారిన్ కంట్రీ అంటే అదొక దేవలోకం అనీ— తన భర్త ఏకపత్నీ వ్రతుడనీ కలలుగంటూ వుంటారు! తనకు లేదూ— మొదటినుంచి భ్రాంతి? ఫారిన్ కంట్రీ చూడాలనీ, భర్తతో కొన్నాళ్లు అక్కడ గడపాలనీను! ఏమయింది? చివరికి ఏమయింది? ఆడపిల్లల తల్లిదండ్రులకు తన బ్రతుకే ఒక గుణపాఠం! తనకు జరిగిన ఈ అన్యాయం అందరికీ తెలియ జెప్పాలి! ఈ విధంగా మనదేశపు ఆడపిల్ల లింక మోసపోవడానికి వీల్లేదు! పేపర్ ప్రకటనలను నమ్ముకుని మోసపోయిన తన బ్రతుకే నిదర్శనం. దీంట్లో ఏ విధంగానూ సుఖశాంతులు లేవు. బాధా - బెంగా అంతే— అని తెలియాలి అందరికీ! అమెరికా వెళిన మన దేశపు యువకులు కొంతమంది— అమెరికన్ యువతుల ఆకర్షణలోపడి—వారిని వివాహమాడుతున్నారు. 'ఆడితే ఆడారు— మళ్ళీ తగుదునమ్మా అంటూ ఇండియాకు రావడం తల్లిదండ్రుల కోసమని మనదేశపు అమాయకపు కన్య మెడలో తాళి కట్టడం ఆమెని అనుభవించి, వదిలెయ్యడం. కాదు కూడదని ఆ పిల్ల తన లాగా వెంటబడితే తనని చూసినట్లే పని మనిషి లాగా చూడడం లేదా సాగినన్నాళ్ళు నాటకం ఆడడం లేదా ఆమెని వెళ్లగొట్టడం ... దేశంకాని దేశంలో అర్ధరాత్రివేళ బయటికి ఒక ఆడపిల్లని వెళ్లగొడితే ఆమె ఏమవుతుంది అనే ఆలోచనగానీ, జాలిగానీ వాళ్లకి ఉండవు...

ఆత్మాభిమానమున్న తనలాంటి ఆడపిల్ల ఆ బతుకు చచ్చినా బతకదు. వాళ్ళ కింద బానిస బతుకు బతకడమా ? కాని తనకు ఇండియా వెళ్ళిపోయినా బతకగల నిబ్బరం వుంది ! ధనం వుంది ! కడుపులో దాచుకునే తండ్రి వున్నాడు. కాని అవి ఏవీ లేనివాళ్ల గతి ? అధోగతేనా ? ఇంతేనా ? ఆనంద్ లాంటి మేకవన్నె పులులకి, పయోముఖ విషకుంభాలకి, తేనె పూసిన కత్తులకు, తడిగుడ్డలతో గొంతులు కోసే వాళ్ళకి, తియ్యని మాటలు చెప్తూనే వెనుక గోతులు తీసేవాళ్ళకి బుద్ధిచెప్పే మార్గమేలేదా ?

అయినా ఒక అమాయకురాలైన ఆడపిల్ల జీవితం నాశనం చేసే అధికారం ఎవరిచ్చారు వీళ్ళకు ?

అట్లాంటి దుర్మార్గులను గురించి ఆలోచించడమే మహాపాపం.

ఊహిస్తూనే చెప్పలేని కసి పుడుతోంది. పగ ఏర్పడుతోంది. అసహ్యం కలుగుతోంది. ద్వేషం రగులుతోంది; కడుపులో తీరని మంట— ఏదో ఆవేదన— కరడు కట్టిన దుఃఖం— తన జీవితం నేలపాలయింది. తననొక ఆట బొమ్మనిచేసి ఆడుకున్నాడా దుర్మార్గుడు! ఎంత ప్రేమ వలకపోశాడు? ఎన్ని ఆశలు కల్పించాడు? తనకేవిధంగానూ అనుమానం రాలేదే అతడిమీద! తన సర్వస్వం అతడికి అర్పించింది! ఇంక తన భవిష్యత్తేమిటి? అంధకారమేనా? తనేంచెయ్యాలి? అంధకారమెందుకు కావాలి ? ఆ దుర్మార్గుడు వదిలినందుకే సంతోషించాలి! అతడు లేకపోతే తనుబతకలేదా? ఆలోచనల లోనే తెల్లవారింది! హృదయం మరింత బరువెక్కింది!

"ఏమిటమ్మా ఆలోచిస్తున్నారు? ఆనంద్ గురించేనా?" శ్రీకర్ నెమ్మదిగా అడిగాడు.

శ్రీలత వచ్చి పక్కన కూచుంది. ఆమె తలమీద చెయ్యేసింది. పొద్దునలేచి దిగాలుగా కూచున్న ఇందిరనిచూసి చాలా జాలేసింది ఇద్దరికీ.

తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో వుంది ఇందిర! మనసు చాలా భారంగా వుంది! తన మనసులోని బాధ ఎవరితోనైనా చెప్పకుంటే గానీ కొంతయినా తగ్గదు. భారం తీరదు.

వాళ్ళిద్దరి ఆప్యాయతతో కరిగిపోయింది ఇందిర. గంభీరమైన మేఘానికి చల్లనిగాలి సోకితే వర్షించినట్టు — వాళ్ళ చల్లని మాటలకు కరడుగట్టిన దుఃఖం కట్టలు తెంచుకుంది! జీవితంలో బాధంటే ఏమిటో తెలియని ఇందిర బావురుమని ఏడ్చింది. హృదయవిదారకంగా ఏడిచింది. వెక్కి వెక్కి ఏడిచింది. శ్రీలత వళ్ళో తలపెట్టుకుని చాలాసేపు ఏడిచింది. ఎంతోసేపట్లా ఏడిచిన తరువాత ఆమె మనసు తేలికయింది. హృదయభారం తీరినట్లయింది. లేచి వెళ్ళి మొహం కడుక్కు వచ్చింది.

అంతసేపూ ఆమెని వాళ్ళు ఏవిధంగానూ వారించలేదు. చూస్తూ కూచున్నారు. ఆ తరువాత జరిగిందంతా విడమర్చి చెప్పింది వాళ్ళకి. ఇద్దరూ చాలా విచారించారు జరిగినదానికి.


"అసలు నాకు ఏడ్చేవాళ్ళంటే అసహ్యం. కానీ నేనెందుకట్లా ఏడిచానో నాకే ఆశ్చర్యంగా వుందండీ— ఇంకా ఆ దుర్మార్గుడి కోసం ఈ మాత్రపు కన్నీళ్ళుగూడా కార్చడం వృధా— అని నా అభిప్రాయం!

"కానీ నా దిగులల్లా ఒక్కటే. మానాన్నగారు ఈ విషయం విని ఆ షాక్‌ని తట్టుకోలేరు. అందుకని కొన్నాళ్ళు నేనీ విషయాన్ని నాన్నకి తెలియకుండా దాచిపెట్టదలిచాను. నేను దీన్ని పూర్తిగా హరాయించుకున్నాక నాన్నకి నెమ్మదిగా తెలియజేయాలి. అంతదాకా నేను ఇండియా వెళ్ళను. దానికి మీ సహాయం కావాలి. కొన్నాళ్ళు మీరు నాకు ఆశ్రయం ఇవ్వాలి. మెల్లిగా నాకో ఉపాధి మీరే కల్పించాలి. ఇది చేశారా నేను మీ మేలు మర్చిపోలేను.

"తరవాత ఇంకో సంగతి. ఏ విధంగా నయినా ఆనంద్‌కి బుద్ధి చెప్పాలి. దానికి మీ సహాయం కావాలి. తను చేసింది ఎంత క్రూరమైన పనో అతడికి తెల్సిరావాలి. దాని ఫలితం అతడు అనుభవించాలి..."

ద్వేషం స్పష్టంగా ప్రతిఫలించింది ఆమె కళ్ళల్లో!

"మీరు ప్రస్తుతం కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకోండి. మీకేవిధమైన సహాయమైనా మేము చేస్తాం. ఇది మీ స్వంత తోబుట్టువు



ఇల్లనే అనుకోండి. దేనికీ సందేహించకండి. మెల్లిగా మీ ఉద్యోగం సంగతి చూద్దాం. ఆనంద్ సంగతి పూర్తిగా మర్చిపోండి. మీకసలు వివాహమే కాలేదనుకోండి" అన్నాడు శ్రీకర్. శ్రీలత కూడా అదే అంది.

వాళ్ళ ఆదరణకి అభిమానానికి కళ్ళనీళ్ళు తిరిగాయి ఇందిరకి.

హృదయం చలించింది.

ఈ ప్రపంచంలో ఎన్నిరకాల మనుషులు అనుకుంది!.

దేశంకాని దేశంలో వీళ్ళు తనకి కనిపించడం నిజంగాదేవుడుచేసిన మేలే! లేకపోతే తనున్న పరిస్థితుల్లో ఏమైపోయేదో? తల్చుకుంటేనే గుండె దడదడలాడింది. స్వల్ప పరిచయానికే వాళ్ళపై తను ఆధారపడింది! ఎంత విచిత్రం!

10

నాలుగైదు రోజులు గడిచాయి. జరిగింది మర్చిపోవడానికి ప్రయత్నిస్తోంది ఇందిర.

శ్రీలత, శ్రీకర్‌లు ఇందిరని వదలకుండా వుంటున్నారు ఎప్పుడూ! ఏవేవో కబుర్లు చెబుతూ ఆమెని నవ్వించడానికి; సరదాగా వుంచడానికీ ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇందిరకో రకంగా మనసు విరిగిపోయింది. దేనిమీదా శ్రద్ధ లేదు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ వుండడమే! ఆలోచిస్తున్న కొద్దీ ఆనంద్ దుర్మార్గత్వం గుర్తుకు రాసాగింది. ద్వేషం ఎక్కువవుతోంది. అతడంటే ఎంత అనురాగమో వుండేది మొదట. ఇప్పుడు దానికి పదింతలు ద్వేషం పేరుకుపోయింది. ఎంత మమకారం వుండేదో అంత కరుకుదనం వచ్చింది.

శ్రీకర్ వచ్చి ఇందిర ఎదురుగుండా కూర్చున్నాడు ఆరోజు— "లతా కాస్త కాఫీ..." అనేలోగానే కాఫీ తెచ్చి వాళ్ళిద్దరికీ అందించి తనూ తీసుకుని అక్కడే కూచుంది శ్రీలత ఇందిర పక్కన.

"మీకో కథ చెప్పమంటారా? మాలతి కథ!" నవ్వుతూ అన్నాడు శ్రీకర్.

"లత కథేమిటి?" అంది ఇందిర.

శ్రీలత మొహం నవ్వుతూనే వుంది.

"అదేలెండి మా ఇద్దరి కథ" పెద్దగా నవ్వాడు.

వింతగా చూసింది ఇందిర.

శ్రీకర్ చెప్పడం మొదలు పెట్టాడు"— "నేను మిమ్మల్నిచూసి వెళ్ళాక మీ నుంచి మనసు మళ్ళించుకోలేక పోయాను అప్పుడే మీ నాన్నగారికొక ఉత్తరం రాశాను. మా

రాగద్వేషాలు

తల్లిదండ్రులను ఒప్పించడానికి శతవిధాల ప్రయత్నం చేశాను. వాళ్ళు ఒప్పుకోలేదు. కులం కులం అంటూ పట్టుకుకూచున్నారు. నాకు కోపం వచ్చి పెళ్ళే వద్దన్నాను. నన్ను నానా తిట్లు తిట్టారు. అయినా బెదర లేదు నేను. ఎదురు తిరిగాను. "నన్నిట్లాగయినా బతకనివ్వరా" అని పోట్లాడాను. వాళ్ళప్పటికి ఊరుకున్నారు. నేను మళ్ళీ ఇక్కడికి వచ్చాను. ఆ తరువాత కొన్నాళ్ళకి మీకు పెళ్ళయినట్లు తెలిసింది. కానీ ఆ పెళ్ళికొడుకెవరో నాకు తెలియలేదు.

ఆనంద్ నాకు ముందు నించీ తెలుసు. మొదట్లో మేమిద్దరం గాఢ స్నేహితులం గూడా! నాకు ఆనంద్‌తో పరిచయమయ్యాకే అతడికి పెళ్ళయింది. అమెరికన్ పిల్లని పెళ్ళి చేసుకున్నానని ఎంతో గొప్పగా చెప్పేవాడందరితో! నాకు గూడా ఏమీ విబ్రెట్టుగా అనిపించలేదు అది! అమెరికా వచ్చిన పెళ్ళి కాని యువకులు ఇక్కడి పిల్లలని వివాహమాడడం పరిపాటే! అందులో తప్పేమీ లేదు. ఎవరిష్టం వారిది! అందుకని అదేమీ మా స్నేహానికి అడ్డు రాలేదు.

కానీ కొన్నాళ్ళకి అతడి అసలు రంగు బయట పడ్డది. తాగుడు— ఇంకా ఏవేవో అలవాట్లు గూడా అతనికి వున్నాయని తెలిసింది నాకు! నేనూ అతడికి దూరంగా వున్నాను. ఆనందే మీకు కాబోయే పెళ్ళికొడుకని నాకు నాను మాత్రంగానైనా తెలిసివుంటే అప్పుడే చేసుకోవద్దని మీకు ఉత్తరం రాసి వుండేవాణ్ని.

ఇక్కడ మిమ్మల్నారోజు పార్టీలో చూసి ఆశ్చర్యపోయాను. ఆనంద్‌ని మీరు పెళ్ళి చేసుకున్నారని తెలిసి నేను పడిన బాధ అంతా ఇంతా కాదు. అతడి సంగతి మీతో చెప్పాలనుకునీ మిమ్మల్ని అప్పుడు బాధ పెట్టడం నాకిష్టంలేక పోయింది. అందుకే చెప్పలేక పోయాను. క్షణికానందంలో వున్న మీకు ఎప్పటికైనా నిజం తెలుస్తుందని నాకు తెలుసు. కానీ కనీసం క్షణికంగానైనా మీకున్న ఆనందాన్నీ సంతృప్తినీ పాడు చెయ్యడం నాకు సబబుగా అనిపించలేదు. మీరు మా యింటికి వచ్చిన రోజైనా చెప్పేవాణ్ని. నే నడిగాను గుర్తుందా— 'ఆనంద్ మిమ్మల్ని సరిగ్గా ట్రీట్ చేస్తున్నాడా?' అని. ఆ మాటకే మీరు చాలా బాధపడి పోయారు. అందుకే నేనూ ఏమీ చెప్పలేక పోయాను. నా నోరు మూతబడిపోయింది.

చూస్తూ చూస్తూ తోటి మనిషిని— అందునా ఆడపిల్లని నేను బాధ పెట్టలేను. చేతనైతే ఏదైనా సహాయం చెయ్యాలి— కానీ ఎవరినీ ఏ విధంగానూ బాధించగూడదనేది నా తత్వం—

కానీ— చెప్పక పోవడం నా తప్పేనని పిస్తుంది నాకు ఇప్పటికీ. నన్ను క్షమించండి దానికి!" అన్నాడు శ్రీకర్.

నవ్వింది ఇందిర.

"ఇందులో క్షమాపణలెందుకండీ? ఏదైతేనేం—ఎప్పుడైతేనేం—ఆ పీడ వదిలింది. అంతేచాలు! ఒక విధంగా నేను దృష్టవంతురాల్నేనండీ—ఇప్పటికయినా కళ్ళు తెరిచాను కదా...—" జాలిగా చూసింది శ్రీలత.

"ఇట్లాంటివి వింటుంటే ఆశ్చర్య పోతాం—కానీ నాలాంటి జీవితాలు ఇంకా ఎన్ని ఉన్నాయో—ఈ దేశంలో? వీటికి అంతువుందా? అనిపిస్తోంది నాకే..."

"మీలాంటి జీవితమే ఒకప్పుడున్న ఉదాహరణని చూపించ మంటారా?

ఆశ్చర్యంగా చూసింది ఇందిర.

"ఇదిగో—మా శ్రీలతే..."

"ఏమిటి?" ఉలిక్కిపడ్డది ఇందిర! నమ్మలేనట్లు చూసింది.


"అవును. మీరు నమ్మలేరు. కాని ఇది నిజం. ఒకప్పుడు అచ్చంగా అక్షరాలా మీలాగే బాధ పడ్డది శ్రీలత.

శ్రీలత బీద కుటుంబంలో పుట్టింది. తండ్రి బహు కుటుంబీకుడు. పిల్లలకి చదువులు చెప్పించలేదు. పెళ్ళిళ్ళు చెయ్యలేదు. కనీసం కడుపు నిండా అన్నమయినా పెట్టలేదు—కానీ పిల్లల్ని మాత్రం కంట్లో పెట్టుకునే వుంటాడు.

మనదేశంలో పెద్దవాళ్ళకి కొన్ని మూఢ నమ్మకాలు వున్నాయి. వాటిని చచ్చినా వదులుకోలేరు వాళ్ళు. అవే ఒక్కొక్కప్పుడు ప్రాణాంతకాలవుతాయి. అట్లాంటి మూఢ నమ్మకాల్లో "నారు పోసినవాడు నీరు పొయ్యడా?" అనేది— 'గర్భస్రావం మహా పాపం' అనేది 'దేవుడు పిల్లల్ని ఇస్తుంటే వద్దనడానికి మనమెవ్వరం?' అనేది 'పుత్రుడు లేకపోతే పున్నామ నరకం తప్పదు!' అనేది ఇవి కొన్ని!

ఆయన చేసే గుమాస్తా ఉద్యోగంలో ఎన్నని చెయ్యగలడు? అందుకని చదువులు మగపిల్లలకి మాత్రమే కేటాయించాడు.

ఆడపిల్లలు ఇంట్లోనే వుండి ఇంటి పనులు వంట పనులు నేర్చుకోవాలి.



గవర్నమెంటు ఉచితంగా విద్యను బోధిస్తున్నా మిగిలినవెన్నో కావాలి కదా చదువుకి ? కట్టుకోడానికి శుభ్రమైన బట్టలు, పుస్తకాలు అయినా వుండాలి కదా ?

బట్టలు శుభ్రంగా వుండాలంటే సబ్బు పెట్టి ఉతకాలి కదా ?

చిరగనివి ఉండాలంటే ఒకటికి రెండు జతలన్నా ఉండాలి కదా ? పెన్సిళ్ళు, రబ్బర్లు, పెన్నులు, సిరాలు, ఇట్లా ఎన్నో వుంటాయి ! ఇవన్నీ అందరికీ సమకూర్చాలంటే మహాకష్టం. అందుకని ఆడపిల్లలకి చదువు అక్కరలేదు. చదువు కంటూ బడికి వెళ్లకపోతే ఇంట్లో ఏట్లావున్నాఫరవాలేదు.

వాళ్ళల్లో శ్రీలతే పెద్దది. చదువుమీ









రాగద్వేషాలు

మక్కువే పాపం. కానీ ఏం చేస్తుంది? తమ్ముళ్ల పుస్తకాలు ఇంట్లోనే చదువుకుంటూ కాలక్షేపం చేసేది. యుక్తవయసు వచ్చింది శ్రీలతకి. పెళ్లి చెయ్యాలన్నది పెద్ద బెంగ తలిదండ్రులకి. అమ్మడానికి పొలం పుట్రా లేవు. ఇల్లూ- వాకిలీ లేవు! మరి పెళ్లెట్లా చేస్తాడు? సరే- ఉద్యోగం లోనైనా అడిగి పిల్ల పెళ్లి చెయ్యాలని నిశ్చయించుకున్నాడామె తండ్రి. కానీ అంత తొందరగా కుదురుతాయా సంబంధాలు? ఎక్కే గడప- దిగే గడప! పదివేలిస్తావా? పదిహేను వేలిస్తావా? జవాబు చెప్పలేని ప్రశ్నలు! సంవత్సరాలు గడుస్తున్నాయిగానీ సంబంధం కుదరలేదు. రెండో పిల్లగూడా పెళ్లికెదిగింది! విసుగొచ్చింది తండ్రికి! అలిసిపోయాడు. విరక్తి కలిగింది. ఆ విసుగంతా శ్రీలతమీద చూపించేవాడు! ఊళ్లో ఏ పెళ్లివార్త విన్నా తన కూతురుకి కాలేదే అనే చింత మరీ ఎక్కువయ్యేది. కనబడ్డ వాళ్లనల్లా అడుగుతూనే వున్నాడు. చెయ్యగలిగిన ప్రయత్నాలు చేస్తూనే వున్నాడు. కానీ- శ్రీలత పెళ్లి కాలేదు. తండ్రి బాధ తీరలేదు.

(ఇంకా వుంది)

కార్టూన్లు పంపేవారికి మనవి

కార్టూన్లతో పాటు స్వంత చిరునామాగల స్టాంపులు అతికించిన కవరు పెట్టి సంపాదకుడు, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం, విజయవాడ-3. అన్న చిరునామాకి టపాలో పంపాలి. వీటి పరిశీలనకు కనీసం 6నుంచి 8 వారాలు పట్టవచ్చును. ఈలోగా, నేరుగా కాని, టపాలోగాని వీటిపై ఉత్తరప్రత్యుత్తరాలకు తావు ఉండదు. కార్టూన్లు 'టపా'లో పోయినా, దారితప్పిపోయినా సంపాదకుని బాధ్యత వుండదు. ప్రత్యేక సంచికలకు కార్టూన్లు పంపేవారు కవరు మీద ఆ సంచికపేరు ఉదహరించాలి. ఈ కార్టూన్లకికూడా పై నిబంధనలు వర్తిస్తాయి.

సం.

దీర్ఘసుమంగళీ భవ

ప్రియబాంధవి

"శ్రీ సీతారామాభ్యాన్నమః...అమ్మా...! ఏకాదశీ సోమవారం... మృగశిర నక్షత్రం... వర్జ్యం రాత్రి ఏడు గంటలకు..."

"చాల్నాలే!... తెల్లారతూనే తయారయేవ్... మీకు పనీ పాటూ లేదు. వెళ్లు వెళ్లు! తిథి, వార, నక్షత్రాలు నువ్వు చెప్పేదేమిటి? మా దగ్గరే ఉన్నాయ్ కేలండర్లు— దయచేయ్!"

"బాబూ— ముసలివాణ్ణి. కరుణించాలి. తమలాంటి వాళ్లే ఇలాగంటే నాగతేమిటి?"

"వెళ్లవయ్యా— వెళ్ళు. చెప్తుంటే నీక్కాదూ? పెద్ద విభూతి పిండికట్టొకటి— నువ్వూను! తెల్లారుతూనే నీ ముఖం చూడవలసి వచ్చింది ఖర్మ!... ఏం వెళ్తావా— లేదా?" అంటూ దభాల్న తలుపు బిగించి లోనికి వెళ్లిపోయేడు రుసరుసలాడుతూ ఆ ఇంటియజమాని— పెద్ద భూకామందు.

ఎర్రగా నిగనిగలాడుతూ మెరుస్తూన్న రాగి చెంబులోకి నిట్టూరుస్తూ చూసేడు భిక్షువు.

అప్పటికి అది ఆరో గడపైనా, పాత్రలో ఒక్క గింజైనా లేకపోవటంతో కళ్లంట టప-టప కన్నీటి చుక్కలు రాలేయి. బారెడు పొద్దెక్కుతూంది. సీతాకాలపు పైత్యపెండ— కండలు తిరిగిన వాళ్లనే జోపేస్తూంటే— కండలెండి, వయసు పండిన వృద్ధుల సంగతి చెప్పాలా?

తాను లేచిన వేళావిశేషం అంతే అనుకుంటూ వంగిన నడుమును చేతికర్ర ఊతతో పైకెత్తి మరో గడప వైపు వెళ్ళేడు. అప్పటికే చంకలోనున్న పంచాంగం చెమటతో తడిసింది. నుదుట దిద్దిన విభూతి రేఖలు... అతడి భవిష్యత్తులాగే అయోమయంగా చెరిగిపోయేయి. పైనున్న చింకి అంగవస్త్రం తన సంసారం జ్ఞప్తికి తెస్తూంది. దాంతోనే ముఖం మెల్లగా ఒత్తుకుని మరో గడప ఎక్కేడు— శాస్త్రులు అనబడే ఆ వృద్ధ భిక్షువు.

లక్ష్మీదేవి అగ్రహారం నూరు గడపలకి మించని చిన్న బ్రాహ్మణ అగ్రహారం. పేరుకు బ్రాహ్మణ అగ్రహారమైనా, బ్రాహ్మణ లోగిళ్లు పాతిక లోపే! ఏనాడో బ్రాహ్మణులక్కడ మోతుబర్లుగా ఉండేవారట. అందుకని బ్రాహ్మణ అగ్రహారమైంది. అదీకాక— పూర్వం ఒక రాజుగారు ఒక సోమయాజిగారికి యజ్ఞం చేసుకుంటానంటే— అతని విద్వత్తుకు సంతోషించి— ఆ అగ్రహారాన్ని దానంగా ఇచ్చేరట. అదే రాణీగారి పేర్న అగ్రహారంగా వెలిసింది.

అయితే కాలక్రమేణా నాలుగు జాతులూ కూడి బ్రాహ్మణ వాడ తగు మాత్రంగానే మిగిలింది. వారు కోటికి పడగెత్తకపోయినా—కూటికి లోపం లేని వారు. కులానిక్కీ విద్యకూ పేద కాని వారు. సిరిసంపన్నులు గాకపోయినా— సరస్వతీ పుత్రులు. 'ఇదం బ్రాహ్మ్యం—ఇదం క్షాత్రం' అన్నట్టు కలం ఒక చేత్తో— కాడెను మరో చేత్తో పట్టేరే కాని ఒళ్లు దాచుకోని శ్రామికులు వారు. అందుకే 'మట్టిని నమ్మిన జాతికి పొట్టకు లోపం ఉండద'ంటారు.

అలాంటి అగ్రహారంలో ఓ గడప రాంభొట్లు గారిది. ఆయన జటాంత స్వాధ్యాయీ— శుద్ధ వైదికుడూను. అతడు ఆంధ్ర — అమరాలు పుక్కిటి బట్టిన పండితుడు. వైదీకే అయినా, కడుపు నింపేందుకు కండలు కరిగించేరే తప్ప కాలు ముడుచుకునే కరణం కాలేదు—సంభావనలకు సిద్ధం కాలేదు! తాతల నాటి అయిదెకరాల మాగాణీ సాగు చేసేరే కాని — వైదీకానికి ఖరీదు కట్టి ఎరుగరు. విత్తిన చేత్తో ఒకరి కిచ్చేరే కాని—చేయి చాచి ఎరుగరు! గంటం పట్టినా — గంగడోలు దువ్వేరు. శాస్త్రాలు చదివినా శ్రమించేరు. నోటికొచ్చిన ముక్క చెప్పేవారు — చేతికొచ్చిన సాయం చేసేవారు. అదే ఆయన ఘనత




ఆంధ్రుల కీర్తి పతాక ఎగరేసిన కాకినాడ అప్పారావు

భారతదేశంలోని అగ్రశ్రేణి ఫుట్‌బాల్ ఆటగాళ్లలోని "రైట్ ఇన్ సైడ్" లలో మేటిగా కొనియాడబడిన మామిడిపల్లి అప్పారావు కాకినాడలో ఆగస్టు 30 న స్వల్ప అనారోగ్య కారణంగా కన్నుమూశారు.

1920 లో కాకినాడలో జన్మించిన అప్పారావు తన 16 వ ఏటనే బెంగుళూరులో జరిగిన అఖిల భారత పోటీలలో ప్రతిభావంతంగా ఆడి తన జట్టు విజయానికి తోడ్పడ్డాడు. తర్వాత కలకత్తాలోని కాళీఘాట్ క్లబ్ ఆహ్వానంపై వెళ్లి మరింత విజృంభించారు. ఆ తర్వాత కలకత్తా ఈస్ట్ బెంగాల్ క్లబ్‌లో చేరి 14 సంవత్సరాలపాటు కలకత్తా ఫుట్‌బాల్ మైదానంలో విజయపతాకము ఎగురవేసిన ఘనుడు మన అప్పారావు. ఆ క్లబ్ సాధించిన విజయ పరంపరలకు అప్పారావు ప్రతిభే వంటే అతిశయోక్తి కాదు.

టైఫాయిడ్ కారణంగా 1948 లో లండన్ ఒలింపిక్స్‌లో పాల్గొన లేక పోయారు.



విదేశాలలో....

సోవియట్ యూనియన్, రుమేనియా, ఆఫ్ఘనిస్థాన్‌లు పర్యటించిన భారత ఫుట్‌బాల్ జట్టుకు నాయకత్వం వహించిన ఆంధ్రుడు అప్పారావు.

ఆటలో ఒక్క ఫౌల్ వేయకుండా ఆడి ఎదుటి జట్టు క్రీడాకారుల అభిమానాన్ని కూడా దోచుకున్న దొడ్డమనిషి. ప్రేక్షకులు, పత్రికల ప్రశంసలే కాక డెన్నిస్ క్రాంప్టన్ లాంటి విదేశ క్రీడాకారుల అభినందనలు అందుకున్న మేటి క్రీడాకారుడు అప్పారావు మరణం క్రీడా లోకానికే తీరనిలోటు!

ఫోటో : వివరాలు

— ముకరమ్

దీర్ఘ సుమంగళీ భవ

పిత్రార్జితాన్ని ఊర్జితం చేసుకుని కుటుంబానికి ఏలోటూ రానిచ్చేవారు కాదు. తర తరాల ఆచారాలను త్రికరణ శుద్ధిగా ఆచరించేవారు. పసిడికి తావి అబ్బినట్లు— అతనికి దేవీ ఉపాసన కూడ ఉండేది. అందుచేత ఆయన పౌరాణికులే కాక — ఉపాసకులు కూడ. ఆయన సంసారం ఏమంత పెద్దది కాదు. తానూ —భార్యా— తల చెడిన అప్పచెల్లెలూ—వంశోద్ధారకుడూ మాత్రమే.

ఆయన భార్య అన్నివిధాలా ఆయనకు సహధర్మచారిణి. భర్తృ మనోభావాలు తప్ప మరేభావమూ ఎరుగని అర్ధాంగి వారి వంశోద్ధారకుడు నీలకంఠశాస్త్రి. దేవీ వరప్రసాదుడుగా తిమ్మి కాంభొట్లుగారు— శాస్త్రికి తానే గురువై— విద్యా బుద్ధులు నేర్పేరు. తనంతటి వాణ్ణి చేసేరు. తనకు చేదోడు వాదోడుగా పొలం పనుల్లో పెట్టి స్వంత సేరీలో— పనిపాట్లలో పాలికాపులతో కలిసి కష్టించి ఫలసాయం యింటికి చేర్చుకునేవారు.

ఏక భుక్తం కావటంవల్ల కాంభొట్లు గారు— మింట చుక్కలు పొడిచే వేళ— చుక్కల క్రింద వాకిట్లో— సన్నజాజులు విరిసేచోట— విద్యార్థులు కూచోగా— వేదాల వల్లె వేయింపించేవారు. ఒకోసారి విరిసిన వెన్నెట్లో— పారిజాతాల పరిమళాల మధ్య- వల్లె జనానికి పురాణాలు వినిపించేవారు. పరమార్థం బోధించేవారు. అందుకే ఆయన త్రోవంట వెళ్తూంటే అంతా చేతులెత్తి మ్రొక్కేవారు. ఆయనా నమస్కారం అందుకుంటూ చిరునవ్వుతో— వారి యోగక్షేమాలు అడిగేవారు— ఆశీస్సు లిచ్చేవారు.

ఏటా దసరా నవరాత్రులు ఘనంగా జరిపే ఆచారం కాంభొట్లు గారిది. దేవీ ఉపాసకులాయె! నవరాత్రులు నెలరోజులున్నా యన్న దగ్గర్నుంచీ— ఏర్పాట్లు ఆరంభమయేవి. ఆ చుట్టుపట్ల జనానికి అవే తిరునాళ్లు. పది క్రోసులమేర నుంచీ, జనం నాటు బళ్లమీద వచ్చేవారు. రా తనక పగలనక ఆ నవరాత్రులలో జనబాహుళ్యం కాంభొట్లు గారిచ్చే దేవీ కుంకుమ కోసం కాచుకునేవారు. ప్రసాదం దొరకటంతో ప్రసన్నంగా తిరిగి వెళ్ళేవారు వారిప్రసన్నతే కాంభొట్లుగారికి పంచ భక్ష్యాలున్నూ. ఆ కుంకుమ ధరిస్తే సకల పాపాలేగాక— సర్వ రోగాలూ పోతాయని ఆ పేద ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసమే ఆయనకు శ్రీరామ రక్ష!

ఎప్పటిలాగే ఆ ఏడు కూడ దేవీ నవరాత్రులు పెద్ద ఎత్తునే ప్రారంభించేరు. దేవీనవరాత్రులు దివ్యంగా జరుగ సాగేయి. నిరతాన్నదానంజరిగిపోతూంది. మహాష్టమి. మహార్ణవమీ కుంకుమ పూజ కనుల పండువగా జరిగింది. ప్రజలు తండోప తండాలుగా వచ్చేరు ఆ పూజ చూడటానికి. కాంభొట్లుగారి ముఖాన— ఆయన ముఖ వర్చస్సుకు తగినట్లు వెండి రూపాయంత కుంకుమ బొట్టు— ఉదయాద్రి నుంచి లేచే బాల భాస్కరుని లా మెరిసిపోయేది. ప్రజలంతా సాష్టాంగ దండ ప్రమాణాలు చేసేవారు. ఆయన యందు వారి భక్తి భావం అలాంటిది.

విజయదశమి నాడు కూడ యథాప్రకారంగా స్నానాదులు ముగించి పూజలోకి వచ్చేరు కాంభొట్లుగారు. అలా ఆయన పూజ చేసి, ధ్యాన నిష్ఠలో ఉండగానే అపరాహ్ణం దాటింది. గుమి గూడిన ప్రజా సమూహం ఆయన నిశ్చలతను భంగపరచ వేదు. ఆయన ధ్యాన సమాధికి అంతరాయం కల్గలేదు. అలా నిశ్చల సమాధిలో నుండగానే ఆయన ప్రాణవాయువులు పరమాత్మలో విలీన మయేయి. పనికిరాని కట్టె మాత్రం దేవి పాదాల చెంత వాలిపోయింది. చెంతనే మడి వస్త్రాలతో కూర్చున్న నీలకంఠ శాస్త్రి దిగ్గున లేచి—తండ్రి శరీరాన్ని లేవనెత్త బోయి—బావురు మన్నాడు. అంతా చుట్టూ

సాహిత్య ప్రపంచంలో సరికొత్త ప్రయోగం!

52 సంవత్సరాల సాహిత్యసేవలో నిష్ణాతులు శ్రీ **కొండపల్లి వీరవెంకయ్య** అండ్ **సన్స్** రాజమండ్రి వారి అభినందనలతో **లతా ఎంటర్‌ప్రైజెస్** వారి...

మీకో స్వంత గ్రంథాలయ పథకం

గ్రంథాలయాలు... దేవాలయాలు... విశ్వవిద్యాలయాలు కూడా! అక్కడుండేవి కేవలం నిధి నిక్షేపాలు కావు. మహాత్ముల అనుభవసారాలు... నిత్యసత్యాలు.

సాహిత్యాభిమానులకై మేము రూపొందించిన ***స్వంత గ్రంథాలయ పథకం***లో మీరు రూ.**10**లు చెల్లించండి! వెంటనే రూ.**14**ల విలువైన మీ అభిమాన రచయితల, రచయిత్రుల/సినీరంగ ప్రముఖుల నవలలు-**3** మరియు **1** ఉచిత నవలతో మొత్తం **4** పుస్తకాలు మీ యింటికి వస్తాయి. అంతేకాదు... మా డిస్ట్రిబ్యూషన్ కేటలాగులో గల ఏ పుస్తకం కొన్నా **20%** డిస్కౌంటు కూడా! ఈ మా స్వంత గ్రంథాలయ పథకంలో మొదటి నెల చందాకై మీకు వచ్చు **4** పుస్తకాలు కాక సభ్యత్వ రుసుము రూ.**4** లకై సాహిత్య చార్య శ్రీ **K.V. నాగేశ్వరరావు** గారు సంకలనం చేసిన ***సూక్తి ముక్తావళి*** మీ సభ్యత్వ కార్డుతో బాటు అదనం! అనగా... మొదటి నెలలో మీరు చెల్లించే రూ.**10+4** = రూ.**14** లకు **5** పుస్తకాలన్నమాట! రెండవ నెల నుంచి నెల **1**కి చందా రూ.**10**లు మాత్రమే. అంటే... ఒక సంవత్సరానికి మీరు చెల్లించవలసింది రూ.**124**లు. సంవత్సరానికి చందా ఒకేసారి అయితే రూ.**114**లు మాత్రమే!

అర్థ సంవత్సరపు చందా..... రూ.**60**లు

మూడు నెలలకు చందా..... రూ.**30**లు.

ముందుగా M.O. లేదా డ్రాఫ్టు పంపించండి. లేదా V.P.P. సౌకర్యము కూడా కలదు. **12** నెలల మీ ఈ చందాకు మీరు పొందగలిగేవి అమూల్యమైన **49** పుస్తకాలు (అసలు విలువ రూ.**171-50** పై.లు.) మొదటి నెలలో మీకు అందే పుస్తకములు

డా॥ కొర్రపాటి గంగాధరరావు గారి అమృతమథనం	డా॥ సి. ఆనందా-రామం గారి పాంచజన్యం	శ్రీమతి కురుమద్దాలి విజయలక్ష్మి గారి ఒకజంట కలసిన తరుణాన	శ్రీ మునిమాణిక్యం నరసింహారావు గారి శరద్రాత్రులు.
ఆబోతు లాంటి మగాడు... పువ్వు లాంటి చిన్నది... ఒడుదుడుకులు-రంకెలు జాతర్లు-దేవుడు సంఘటనలు... సంఘర్షణలూ గల బుద్ధివికాసక నవల. జాతిని చైతన్యవంతం చేసిన ఆధునిక మహాళ గాథ!	హరిజన గిరిజన వర్గాల పట్ల ప్రభుత్వ సహకారం ఏ విధంగా మంటగలిసి-పోతున్నది నిరూపించే నవల! ఒక అనాథ బాలిక జీవిత చిత్రణ	బెల్ బాటం ప్యాంటుతో ఓ. అమ్మాయి పెళ్లి చూపులకు కూర్చోవటం తప్పు కాదు. అది ఆధునిక తత్వం. గర్భాయి స్త్రీ పాత్ర ధరించడం మాత్రం ఆడదాని తనం. ఈ ఇతివృత్తాన్ని రచయిత్రి ఆద్యంతం పోషించారు.	పెళ్లయిన కొత్తలో అందరికీ వస్తాయి. (హనీమూన్ డేస్) శరద్రాత్రులు. తన దాంపత్యం శృంగారం కలిపి అందంగా చెప్పిన మునిమాణిక్యం పెళ్లయిన వారికి ఆ తీయని రోజులు జ్ఞాపకం తెస్తాడు. పెళ్లికాని వారికి ఆ రోజులు ఎలా గడపాలో చెప్తాడు

వెంటనే సభ్యులుగా చేరండి! మీ యింటిని సాహిత్య నిలయంగా మలచండి!!

ఈ మా గ్రంథాలయ పథకంలో చెప్పబడిన ఈ **49** పుస్తకాల విలువ రూ.**171-50** పై.లు మీరు ఉచితంగా కూడా పొందడానికి మరొక అద్భుత పథకం రూపొందించబడింది!

ఈ పథకం ద్వారా మీరు ఒక్క రూపాయి కూడా పెట్టుబడి లేకుండా మీరు మీ యింటిలో స్వంత గ్రంథాలయాన్ని నెలకొల్ప వచ్చు! ప్రత్యేకంగా తయారు చేసిన ఈ ఉచిత గ్రంథాలయం యొక్క ఉచిత ప్రాస్పెక్టస్‌కై వెంటనే వ్రాయండి!

⁂ డిస్ట్రిబ్యూటర్లు కావలెను!

లతా ఎంటర్‌ప్రైజెస్

బుక్ పబ్లిషర్స్ అండ్ డిస్ట్రి...

మెయిన్ రోడ్, రాజమండ్రి.

DIMPLE LEP/1535/4 DESIGNERS

దీర్ఘ సుమంగళీ భవ

చేరేరు. ఆయన కళ్ళల్లో చలనం లేదు. ప్రజలు హాహాకారాలు చేసేరు.

* * *

దహన సంస్కారాలు పూర్తి చేసుకుని ఇల్లు చేరేడు నీలకంఠ శాస్త్రి— విషణ్ణ హృదయంతో. ఇంట్లో తల్లి, మేనత్తల గోడు భరించరానిదైంది. వచ్చిన బంధువర్గమంతా ఏవో ఉపశమన వాక్యాలు చెప్తున్నా అవి జ్వలిస్తున్న అగ్నిలో నీటి బిందువుల్లా ఆవిరి అయిపోయేవి. తన దుఃఖాన్ని ఉపశమించుకోలేక విలపించ సాగేరు. తండ్రి అండను ఇన్నాళ్ళూ కాలం గడిపేడు తప్ప అతడికి అంత వయసేదీ ?

తండ్రి ఆజ్ఞను శిరసా వహించడం మినహా ఏ పనీ స్వయంగా నిర్వహించే అలవాటు లేదు అతడికి. ఇప్పుడు మరి తప్పనిసరి! ఈ సంసార భారం అతడి నెత్తిన పడింది. హిమాద్రిలా తమ కుటుంబానికి అండగా నుండే తండ్రి మరి లేడు. ఆయన నిర్వహిస్తుండే పనులన్నీ ఇప్పుడు శాస్త్రి మీద పడటంతో గాభరాపడి పోయేడు.

అటు పొలం పనులూ, ఇటు రాత్రులందు విద్య నేర్చుకుందుకు వచ్చే శిష్యులకు విద్యాదానం— తను నాశ్రయించిన బీదా — బిక్కీకి సహాయమూ, అన్నీఅతడే నిర్వహించుకోవాలి. ఎన్నో రాత్రులు ఒంటరిగా తండ్రికై దుఃఖించేడు. ఈ కార్య భారానికి దిగులు పడేవాడు.

అధైర్యం ముంచుకొచ్చేది. కాని— ఏది ఏమైనా తన తండ్రి ప్రతిష్ఠనూ, ఆయన ధర్మనిరతినీ గంగపాలు చేయరాదని భీష్మించుకున్నాడు. మనసు దిటవు చేసుకున్నాడు. విలపిస్తున్న తల్లి, మేనత్తలను ఓరడించేవాడు. తిరిగి— క్రమేణా తన నిత్య కృత్యాలకు అలవాటు పడక తప్పలేదు.

* * *

మూడు శిశిరాలు భారంగా దొర్లిపోయేయి. భర్తపోయిన ఆరునెలలు తిరగకుండా శాస్త్రి తల్లి ఇహలోకం చాలించి భర్తృ సాన్నిధ్యాన్ని పొందింది. 'పుణ్యాత్మురాలు' అన్నారంతా. శాస్త్రిని చూసి రెండు కన్నీటి బొట్లు రాల్చేవారు. తల్లినీ, తండ్రినీ గోల్పోయిన అభాగ్యుడయేడు శాస్త్రి. మిగిలిన విధవ మేనత్త బాధ వర్ణనాతీతం! ఆమె కనుల ముందే చెట్టంత తమ్ముణ్ణి, మరదల్ని గోల్పోయింది. భూమికి భారంగా తానొక్కతే మిగిలిపోయేనని నిత్యం దుఃఖించేది.

అన్నీ మన ఇష్టప్రకారం జరిగితే మరి సృష్టి రహస్యం ఏముంది? భగవంతుని చిద్విలాసాలు అందరికీ గ్రాహ్యమయేనా! తల్లినీ, తండ్రినీ పోగొట్టుకున్న శాస్త్రి— మేనత్త బలవంతంవలన ఒకింటివాడయేడు. అతడికి వేలువిడిచిన మేనమామ కూతురు 'పార్వతి' అర్ధాంగిగా అతనింట అడుగు పెట్టింది. ఆమె తండ్రి బహు కుటుంబీకుడేకాక బహు బీదవాడు కూడ. ఆయన ఆరవ కుమార్తె పార్వతిని చూసి— వారి స్థితికి జాలిపడి— శాస్త్రి ఆమెను వివాహమాడేడు. మహదానందంతో వివాహంచేసేడు కన్యాదాత. సత్సంప్రదాయం నుంచి వచ్చిన పార్వతి భర్త అడుగు జాడల్లోనే మెలిగేది.

శాస్త్రి మేనత్తకు కళ్ళలో అంతర్కుసుమాలు ఏర్పడటంతో చూపు పోయింది. ఆమె సపర్యలుకూడ పార్వతే చేయవలసి వచ్చేది. ఆమె భూదేవిలా ఎంతో సహనంతో సంసారందిద్దుకోసాగింది. అయితే—ఆ ఇంటికి శాస్త్రి వివాహమైనది మొదలుబంధువుల రాకపోకలు ఎక్కువయేయి. ఎక్కడెక్కడి బంధువులో వచ్చి— ఏవో నాలుగు అనునయ వాక్యాలుచెప్పి తమ పబ్బం గడుపుకునేవారు. చూస్తూ—చూస్తూ వాళ్ళను పొమ్మనలేడు. నెలలకొద్దీ తిష్ఠవేసే బంధువుల్ని మేపలేడు. ఇలా ఇరకాటంతో రోజులు వెళ్ళబుచ్చేవాడు.

! రాబడి అంతా ఆ భూమి మీద గింజలే కద. ఏడాది పంటనూ నలుగురు బంధువులూ వచ్చి ఊడ్చేస్తే అప్పులూ, తిప్పలూ తప్పవు కద. అదే అయింది శాస్త్రికి. అయితే మండు టెండలో పోయే బాటసారికి మర్రి నీడలా పార్వతి నెల తప్పిందన్న వార్త ఆ కుటుంబానికి వెన్నెల జల్లయింది.

ఈసారి కాంభొట్లుగారే తిరిగి ఉదయిస్తారన్నారు జనం... 'జన వాక్యంతు కర్తవ్యం' అన్నట్టుగా పార్వతి చక్కని కొడుకుని కన్నది. వాడికి కాంభొట్లు అనే నామకరణం చేసేరు. కాలాను గుణంగా పార్వతి వాడ్ని ఇంగ్లీషు చదువులో పెట్టమంది. వంశ పారంపర్యంగా వస్తుండే వైదీకాన్ని మాన్పి

ఇంగ్లీషు చదువులో పెట్టేరు చిన్న కాంభొట్లును.

శాస్త్రి ఒక్కడే పొలం పనులు చూడటం కష్టం కాసాగింది. కూలికి పెట్టే పాలి కాపుల వల్ల ఎంత పని చేయించ గలడు? అందులోనూ, చేతిలో సొమ్ము ఆడటం లేదు. వయసు మీరుతున్న కొద్దీ ఆరోగ్యం క్షీణించ సాగింది పొలం పనులు సరిగా నిర్వహించ లేక పోవటంతో ఫలసాయం తక్కువ కాజొచ్చింది.

ఆ రోజుల్లోనే రత్తయ్యను చేరదీసేడు.

ఒకనాడు శాస్త్రి పొలం నుంచి వస్తూండగా కుంభవృష్టిగా వర్షం పడుతూంది. ఒక మర్రిచెట్టు నీడను తల దాచుకుందికి వెళ్ళేసరికి అక్కడ గజ గజ వణికిపోతూ చిన్న గోచీతో పదేళ్ళ కుర్రవాడు కన్పించేడు. 'రత్తిగాడు' దిక్కులేని స్థితిలో పొరుగూర్నించొస్తూ శాస్త్రికి తారసిల్లేడు. వాడికి భోజన సదుపాయలు గూర్చి తనింటి వద్దే స్థానం ఏర్పరచేడు. అంత చిన్నవాడికి భారీ పనులు వప్పగించలేక ఏవో చిన్న చిన్న పనులు మాత్రమే పురమాయించే వాడు


* * *

రత్తిగాడు—రత్తయ్యగా మారి శాస్త్రికి పొలం పనుల్లో చేదోడు వాదోడుగా ఉండేవాడు. వాడికీ వయసొచ్చింది. పొలాల గట్లమీద, చేలల్లోనూ, కాపు పడుచులతో సరసాలకి దిగేవాడు. ఈ వార్తలు కర్ణాకర్ణిగా విన్న శాస్త్రి రత్తయ్యను ఒకింటి వాడ్ని చేస్తే మంచిదని పార్వతితో సంప్రదించేడు.

రత్తయ్యకు మాత్రం ఇంకెవరున్నారని? తాము వాడ్ని ఎంతకాలం వంటరిగా ఉంచి పొలం పనులు చేయించగలరు? అందుచేత ఏదో ఒక మంచి పిల్లను చూసి ముడిపెడితే తమ భారంతీర్చినట వుతుందని ఆలోచించేరు ఆ భార్యాభర్తలు. వాళ్ళ ఆలోచనలలోకి వెంటనే వచ్చింది 'వరహాలు'.

ఆ ఊళ్ళో గురవయ్య అంత డబ్బున్న వ్యక్తి కాకపోయినా, మంచివాడని ప్రతీతి. ఇంతో—అంతో పొలంచెక్క నుదున్నుకుంటూ బ్రతుకుతున్నాడు. అతడికూతురే వరహాలు. మంచి వినయం — విధేయతా ఉన్నపిల్ల. పెద్దలయందు గౌరవం — పిన్నలయందు ప్రేమా ఉన్న ఆ పిల్ల — గుణవతే తప్ప రూపవతికాదు. ఈపిల్లను రత్తయ్యకిస్తే సుఖపడతాడని భావించాడు శాస్త్రి.

గురవయ్య దగ్గిర ఈ విషయం కదిపేడు శాస్త్రి. రత్తయ్యకు బొత్తిగా— ఏ భూమీ పుట్రా— లేనందున పిల నివ్వడానికి సంకోచించేడు గురవయ్య. శాస్త్రి ఆలోచనలో పడ్డాడు. వరహాలును ఇస్తే — ఈడూ, జోడూ బాగుంటుంది. రత్తయ్యకు ఆస్తి పాస్తులు లేకపోయినా— కండబలం— గుండె బలం ఉన్నవాడు. తనకూ— అండ—దండగా ఉన్నాడు. రత్తయ్యకు తానూ — ఇన్నాళ్ళ జీతం బత్తెం ఇవ్వలేదు. అందుచేత ఓ మడి చెక్క వాడి పేర నవ్రాస్తే పుణ్యం— పురుషార్థం దక్కుతుందని ఎంచేడు శాస్త్రి. పార్వతీ సరేనంది. ఆరాత్రి నిద్రలో — తన తండ్రికూడ దీనికి ఆమోదించినట్లు కల గన్నాడు శాస్త్రి. ఆ మరునాడే గురవయ్యతో



ప్రస్తావించి వివాహం నిశ్చయించేడు రత్తయ్యకు.

వివాహం సలక్షణంగా జరిగిపోయింది.

పెరటి వైపున క్రొత్తగా పాక వేయించి అందులో రత్తయ్యా, వరహాలూ దంపతులను కాపురం పెట్టించేడు. వారూ మురిసిపోయేరు.

అప్పటివరకూ ప్రక్కఊరి హైస్కూల్లో చదువుకుంటున్న చిన్న కాంభొట్లు—మెట్రిక్ ప్యాసయి— కామేశ్వరరావు అయేడు. ఏదో మెట్రిక్ పేసయేడు కదా— ఇక తనకు సహాయంగా ఉండి— పొలం పనులు చూస్తాడనుకునే సరికి— పట్నంలో పై చదువులు చదువుతానని మొరాయించేడు. కొడుకు ముచ్చట తీర్చమని బ్రతిమాలింది భార్య పార్వతి. తన కొడుకు ఏ కలెక్టరో అయి హోదాగా ఉంటే చూచి ఆనందించాలనుకుంది ఆ మాతృహృదయం. అంతేకాని— ఆ అమాయక హృదయానికి కొడుకును పట్నంలో ఉంచి కాలేజీ చదువులు చదివిస్తే అయే ఖర్చు అంచనా తెలియలేదు.

ఉన్న ఒక్క కొడుకు ముచ్చటా— భార్య మనసూ కాదనలేకపోయేడు శాస్త్రి. కొంత అప్పుచేసి కుర్రాడ్ని కాలేజీలో చేర్పించి వచ్చేడు.

* * *

కాలచక్రం తిరుగుతూనే ఉంటుంది దాని గమనాన్ని ఆపే శక్తి ఏ మహామహులకూ లేదు. ఆ కాలగర్భంలో అనేక జీవితాలు కలిసి పోతుంటాయి. క్రొత్త జీవితాలు చిగురిస్తాయి. కాల గమనంతో సుఖదుఃఖాలు మారుతూండటం ప్రకృతి లక్షణం ఓడలు బళ్ళూ— బళ్ళు ఓడలూ అవుతాయని పెద్దల వాక్యం. అదిలో తీవిగా మీసం మెలివేసే చేతులే— దేహీ అని (చేయి) చాచవచ్చు. దేహీ అనే చేతులే రత్న కంకణా

[44వ పేజీ చూడండి]

సగం లో ముగింపు

ప్రయాగ రామకృష్ణ

(గత సంచిక తరువాయి)

– సెలవయిపో వస్తోంది.

రేపో, ఎల్లుండో బయలుదేరి వెళ్ళాలి. హడావిడి పడుతున్నాడు. 'మరో నాలుగు రోజులు లీవు ఎక్స్టెండ్ చేయకూడదూ' అంది కాదంబరి. వీల్లేదన్నాడు కృష్ణ.

ఐతే ఈ పూట సినిమాకు వెళ్దాం. హోటల్లో భోజనం చేద్దాం అంది.

"ఏం ఎందుకనో" అడిగాడు చిలిపిగా.

"ఏమీలేదు. నువ్వెలాగో రేపు వెళ్ళిపోవాలంటున్నావు గనుక సరదాగా ఈకాసేపైనా గడుపుదామని" ఆశగా అంది.

అంగీకరించాడు కృష్ణ తలూపి!

ఇద్దరూ కలిసి సాయంత్రం ఆరయ్యాక "రంభా" థియేటర్ వైపు వెళ్ళారు. అప్పటికే చాలామంది జనం వున్నారక్కడ. హిందీ సినిమాల క్రేజ్. అంతకు మించేం లేదు. పైగా వొకె కాంపౌండ్లో మూడు థియేటర్లు. ముచ్చటగా వుంటాయి ఆ పేర్లు. సౌందర్య రాసులు ఊర్వశి మేనకల చిత్రపటాలు రెండూ నృత్య భంగిమలో వుంటాయి ఆ థియేటర్లమీద. చుట్టూరా దీపాలు రంగు రంగుల్లో ఆరుతూ వెలుగుతూ.

టిక్కెట్లు తీసుకుని లోపలకు వెళ్ళి కూర్చున్నారు. పావుగంట గడిచింది. ట్రయిలర్ మొదలైంది. కాదంబరి సినిమా చూడ్డం లేదు. దగ్గరగా జరిగి మధ్య మధ్యలో కబుర్లు చెప్తోంది. భుజం మీద తల ఆన్చింది. చేతి వేళ్లను తన చేతుల్లోకి తీసుకుని చిక్కు పడేస్తోంది. వాటినిహత్తుకుంటోంది. తియ్యటి అనుభూతి అది. గొప్ప ఆనందం అది. ఇన్నింటిమధ్యా ఎదురుగా కదలాడే బొమ్మలు...మాటలు...పాటలు... కొంచెం సర్దుకూర్చున్నాడు.

జరిగినకొద్దీ తను మరింత దగ్గరగా వస్తోంది. వచ్చి వచ్చి... కల చెదిరినట్టయింది. వున్నట్టుండి పూదారంగు లైట్లు వెలిగాయి. జనం లేచి విలబడ్డారు. కాదంబరి వులిక్కిపడింది. ఇంటర్మిషన్–

"అప్పుడే?" అంది కాదంబరి.

నవ్వొచ్చింది కృష్ణకు.

"బోర్ కొడ్తోంది. వెళ్దామే మిటి" అన్నాడు ఆ పిల్లవంక చూస్తూ.

"లేదు. నా కిక్కడే బాగుంది" అంది నవ్వుతూ... అంతా చిలిపి.

'మొండి. హిందూమతం కాదు. జైన మతం కాదు. రెట్టమతం.'

సన్నగా నవ్వింది మళ్ళీ. లేచి నిలబడింది. బయటకొచ్చి రిక్షా ఎక్కి కూర్చున్నారు. హోటల్ దగ్గర ఆగింది. భోజనం చేసి



పెద్ద కథ

నడుచుకుంటూ వచ్చారు. ఇంటి దగ్గర కొచ్చేటప్పటికి తొమ్మిది దాటుతోంది...

'గుడ్‌నైట్ కాదంబరీ' అన్నాడు కృష్ణ.

కాదంబరి దగ్గరగా వచ్చి నిలబడింది. వచ్చి అతని ముఖాన్ని అరచేతుల్లోకి తీసుకుంది. నుదుటి మీద ముద్దుపెట్టుకుంది. ఏమిటో హాయి. ఏదో చిత్రమైన అనుభూతి.

'కాదంబరీ.'

పిల్చినా పలకడంలేదు.

'హవ్వ. రోడ్డుమీద...? ... యిలాగ ?...'

ఫక్కున నవ్వింది ...

ఇంతలో అటుగా సైకిలుమీద పోతున్న కుర్రాడెవరో పెద్దగా అరిచిపోయాడు 'పార్వతీ దేవదాసం'టూ.

మత్తు వదిలింది యిద్దరికీ !

'వెధవ. వెధవ పోలిక వాడూ నూ ... ఇంకెవరితోనన్నా కంపేర్ చేయకూడదూ' కొంటెగా నవ్వింది !

అతనూ నవ్వాడు. నవ్వుకుంటూనే కాదంబరి వెళ్ళిపోయింది.

* * *

'కాదంబరీ' అమ్మ పిలిచింది లోపలికి వెళ్ళి వెళ్ళకుండానే.

కాదంబరి మాట్లాడలేదు.

'ఎక్కడికి వెళ్ళావు ఇంతసేపూ' అడిగింది గట్టిగా అమ్మ.

'కృష్ణ మళ్ళీ రేపు వూరికెళ్ళుతున్నాడు. అందుకని...' మధ్యలోనే ఆపేసింది.

'కాదంబరీ ! ఒక్క మాట చెప్పనా' తల్లి లాలనగా అంది.

తలెత్తి చూసింది కాదంబరి. అంతే !

'వయసొచ్చిన పిల్లవు నువు. పగలనక రాత్రనక యింకా అతనితో అలా తిరుగుతుంటే బాగుండదు. ఈ తిరుగుళ్ళు మానెయ్యాలి.'

కోపం వచ్చింది తనకు. ఎందుకు మానెయ్యాలి. యెందుకీ నీతిబోధలు. ఎవరికోసం ఈ సూక్తిముక్తావళి. ఇప్పుడేం జరిగింది కనుక. అనుకోకుండా కళ్ళవెంబడి నీరు కారింది.

'నీకు తెలీదు కాదంబరీ ! అతన్ని కట్టుకుని నువు సుఖపడలేవు. అతనికున్న బాధ్యతలకి బరువులకి వొక్క అడుగు కూడా ముందుకు వేయలేడు. నామాట విను. నిన్నేవిధంగానూ సుఖపెట్టలేడతను.'

'అమ్మా...? !'

'అవునమ్మా ! ఇన్నాళ్ళూ నేనేం అభ్యంతరం చెప్పలేదు. కాని ఇప్పుడలాకాదు. అతనికి తండ్రి పోయాడు. పైగా ఇంటికి పెద్దవాడు. ఇద్దరాడపిల్లలున్నారింకా. తల్లుంది. తమ్ముళ్ళున్నారు. వాళ్ళందరి మంచీచెడ్డా అన్నీ అతనే చూడాలి. అంతమంది మధ్య నువ్వేం సుఖం అనుభవిస్తావు చెప్పు.'

అమ్మేం చెప్తోంది ? !

అతనికీ రోజున అనుకోకుండా బాధ్యతలు, బరువులు వచ్చాయి కనుక అతనినుంచి తప్పించుకో మంటోంది ... ఛి ! ఛీ ! ! యెంత స్వార్థం.

పెద్దపెట్టున ఏడుపొచ్చింది కాదంబరికి.

ఏ యింటికి ?

డా. సి. నారాయణరెడ్డి

ఇంటికి రమ్మంటున్నారు నన్ను.
ఏ యింటికి ?
త్వరపాటున పుట్టిన ఆ యింటికా ?
పొరపాటున మెట్టిన ఈ యింటికా ?

నా కాళ్ళు
'నిన్న'లో పాతుకున్న వేళ్ళు.
నా ఒళ్ళు
నేటిని పైకెత్తే ఎదుగుళ్ళు.

అదిసరే — నేనెవణ్ణి ?
కాళ్ళు నేలలో ఒళ్ళు నేలపై
ఊహ నింగిలో
ఉన్నవాణ్ణి.

క్షణాల్లో దినాలను పిండుకుని
అనుక్షణం ఎదుగుతున్నవాణ్ణి.
నా యిల్లు అగణ్యం,
నా చిరునామా చైతన్యం.

గదిలోకి వెళ్లి కూర్చుని బావురుమని ఏడ్చింది. తెరలు తెరలుగా దుఃఖం. ఎప్పటికో తెల్లవారింది. అప్పటికే కృష్ణ స్టేషన్‌కి వెళ్లిపోయాడ్ట. రైలు ఆరున్నరకో యేమో. బండి బయలుదేర టానికి యింకా పదినిముషాలు వ్యవధుంది. వెంటనే బయటికొచ్చి ఆటో ఎక్కి కూర్చుంది. స్టేషన్‌లోకి వెళ్ళేటప్పటికి గార్డు ఈలవేసాడు. పచ్చదీపం చూపించాడు. పరుగెత్తుకుంటూ వెళ్ళింది.

'కృష్ణా!'

'కాదంబరీ !'

తన చేతిని అతని చేతుల్లోకి తీసుకున్నాడు.

తన కళ్ళవెంట కన్నీరు తిరిగింది.

రైలు బిగ్గరగా అరిచింది.

'ఉత్తరాలు రాస్తుండు...'

తలూపింది తను. రైలు కదిలింది ... దూరమైపోయింది

* * *

మధ్యాహ్నం రెండుగంటలు దాటింది.

పడుతూ లేస్తూ ఆఫీసుకు వెళ్లాడు.

అసలు ట్రెయిన్ యెప్పుడో పన్నెండు గంటలకు చేరాల్సింది. కాని ఈరోజు రెండుగంటలు లేటు.

పరుగు పందెంలా వుంది బ్రతుకంతా. జస్ట్ రొటీన్. గానుగెద్దు జీవితం. కుడియెడమైతే పొరపాటు లేదోయ్ .. అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డు ... వివిధ భారతి వాణిజ్య ప్రసార విభాగం ప్రకటనలు మధ్యలో గంటలు ... అరుపులు ... గుడివాడలో నాలుగు ఏనుగులు ఒకేసారి శివపూజ చేయుట జెమినీ సర్కస్ ... ''చీరలెత్తుకుపోయిన చిలిపికృష్ణుడు'' సినిమా ఏడ్వర్‌టయిజుమెంటు...

పారిపోవాలన్నంత కోపం. బొత్తిగా రంగు రుచి వాసన లేకుండా పోయింది బతుక్కి.

జరిగిన కథ - 2 : చిన్నతనంలో ఆత్మీయంగా తిరిగిన కాదంబరి, ప్రక్కింటి వాళ్లబ్బాయి కృష్ణా ప్రేమించుకుంటారు. తిరుపతి నుంచి వచ్చిన కృష్ణ, రిసెర్చ్ స్కాలర్ మూర్తిని సావిత్రి చేసుకోబోతున్న దని కాదంబరికి చెప్తాడు.

ఎంత క్యాజువల్‌గా బతికేయడం ... ఎప్పటికప్పుడు పరిస్థితుల్తో రాజీపడిపోయి —

కృష్ణకు చిరాకేసింది...

తను బయలుదేరుతుంటే అమ్మ అంది —

'కాదంబరికి వాళ్ళమ్మ సంబంధాలు చూస్తోందట్లే వుంది. వచ్చే వైశాఖంలోనో, ఫాల్గుణంలోనో మూడుముళ్ళూ వేస్తార్ట. నిన్న మాటలమధ్యలో చెప్పిందావిడ. ఇంతమందిమధ్యలో తన కూతురెక్కడ కష్టబడిపోతుందోనని ఆవిడ బాధట.'

కృష్ణ ఆశ్చర్యంగా చూసాడు.

ఎంత మనం మనం అనుకున్నా యెవరి ఆలోచనలు వాళ్ళకుంటాయి. ఎవరి భయాలు వాళ్ళకుంటాయి. అయినా నీకేమిటి దిగులు, నిక్షేపంలా నాలుగురాళ్ళు సంపాదిస్తున్నావు. మగపిల్లవాడివి. పిల్లనిచ్చేవాళ్ళు దొరక్కపోరు నీకు.

కృష్ణ మాట్లాడలేదు అర్థంకానట్టు చూసాడు.

డబ్బు, సుఖం, స్వార్థం — పులి మేక ఆట. అంతే. అకస్మాత్తుగా అతన్నేదో నిస్పృహ ఆవరించింది. తెలీని ఎగోనీ — అస్పష్టత — కాదంబరిమీద ప్రేమ — అర్థంకాని ఆల్జీబ్రా.

కాదంబరి కిదంతా తెలుసా ? —

'లేదు. తెలిసుండదు' అనుకున్నాడు. మరి తెలియకపోతే... ?

రైలు కుదుపులో ఆ అరుపులో గాలిలో చేయూపుతూ కాదంబరి తుడుచుకున్న కన్నీళ్ళకు అర్థం ఏమిటి.

* * *

'ఫోన్ సార్ మీకు' నాయక్ వచ్చి చెప్పాడు.

''ఎక్కణ్ణుంచో కనుక్కోలేకపోయావా ?''

''విజయవాడ నుంచి ట్రంకాలుట !''

పరిగెత్తాడు. 'హలో నేను కృష్ణని...'

'నేనే కాదంబరిని' ఆ పేరు వినంగానే ప్లీజయ్యాడు కొంచెం.

'ఊఁ చెప్పు కాదంబరీ !'

క్షణం మౌనం. మనసు అట్టడుగుపొరల్లో ఆనందం.

''కృష్ణా ! నువ్వసడానికి ముందరే నేనంటు

న్నాను. ఇదంతా ఎస్కేపిజం. తప్పని యింకోళ్ళ మీదకి తేలిగ్గా నెట్టేయడంకాని, కొన్ని నిర్ణయాలు తీసుకునేటప్పుడు తెలీదు అవి ఆచరణలో ఎంతవరకూ సాధ్యమోనని. ఆ ప్రేమలో — ఆ పిచ్చిలో — ఆలోచించే శక్తి ఓర్పు కూడా వుండవు.''

'దూరంగా నువు కళ్ళముందు కదుల్తావు. నిన్ను చూపుల్తో దగ్గరకు తీసుకుని, కళ్ళల్లో నిలుపుకుని, ప్రేమతో తడిపి ఆ తడిలో చలికి వణుకుతున్న నిన్ను వెచ్చటి రెప్పల్తో కప్పి — ఏమిటో కృష్ణా! గతం ఎప్పుడూ అందంగానే వుంటుంది. సంఘర్షణల్లా వర్తమానంతోనే...'

''హలో...హలో...'' ఊహూం... వూరుకుంది ఫోను. మధ్యలో 'కట్' అయినట్టుంది. మళ్ళీ కాదంబరి మాట వినపడ్డది.

'అమ్మ కెలా చెప్పను? అర్థంలేని ఆర్గ్యుమెంటా విడిది. కూతురికి కాబోయే ఆడబిడ్డలు — మరుదులు — ఆస్తి — అల్లుడి సంపాదన ... ఆ ఇంట్లో తన కూతురు అనుభవించబోయే కష్టసుఖాలు ఇవే ఆలోచిస్తోంది ఎంతసేపటికీ.

కాని ఆవిడకేం తెలుసు నీ పక్కన నీ నీడలో ఒదుగుతూ నేను తాదాత్మ్యం చెందడం. కృష్ణవేణి ఒడ్డున — ఆ ఇసుకతిన్నెమీద — కళ్ళల్లోకి చూస్తూ కూర్చున్నప్పుడు క్షణకాలం నా అస్తిత్వం స్పందించడం ... ఇది చాలదూ బతుక్కి...

కన్నీటిపొర అడ్డుపడ్డట్టుంది. గొంతు జీరబోయింది.

'కాదంబరీ!'

'ఫరవాలేదు. ఇంతలో ఏమైపోను.'

గొంతులో వుండలా చేరి ఏదో బాధపెడ్తోంది.

'అమ్మ ... అమ్మకోసం ..

ఈ సెంటిమెంట్ సున్నాల మెడను చుట్టేసుకుని ఉరి(గా)డయ్యేలా వుంది.

ప్రేమ బాధ్యతని స్వీకరిస్తుంది. ఈ సింపుల్ థింగ్ ఎలా చెప్పనావిడకు...

సగంలో ముగింపు

'కృష్ణా! నువు చెప్పు. ప్లీజ్.'

మళ్ళీ ఫీబిల్‌గా మారింది గొంతు.

'కాదంబరీ! ఏమిటిది ఇప్పుడేమైందని?'

సమాధానం లేదు సన్నగా ఏడుపు తప్ప.

ఫోన్ పెట్టేసింది.

స్వార్థం మనిషిని డామినేట్ చేస్తోంది.

''ఏ వయసులో అనుభవించాల్సినవి ఆ వయసులో అనుభవించాలి. ఐనా, మరో మూడేళ్ళో నాలుగేళ్ళో అతనికోసం నువ్వాగుతావే అనుకో అప్పుడుమాత్రం నమ్మకం ఏమిటి? ఆ అబ్బాయి తల్లి, చెల్లెళ్ళు తమ్ముళ్ళు ఎవరూ మీకు మీ సంసారానికి అడ్డురారని...'' కాదంబరి వాళ్ళమ్మందిట. అని కొంచెం ఆగి 'ఉన్న నాలుగెకరాలు తండ్రి చేసిపోయిన అప్పులకూ కూడ సరిపోయేట్టులేవు ... సెంటే మిగిలేనో, రెండు సెంట్లే మిగిలేనో ఏవరికి' అంటుంది కాదంబరి అమ్మగారు.

తల నొప్పి భరించలేనంతగా. సీట్లోంచి బయటకొచ్చాడు.

బైట వీధి మలుపు చివర నిలబడ్డ రిక్షాను పిలిచి ఎక్కి కూర్చున్నాడు.

ఎక్కడికో తెలీదు ఏదో అసంతృప్తి. ఏదో ఏగోనీ — ఎక్కడలేని ఒంటరితనం ... ఆస్తి అంతస్తు అధికారం డబ్బు — మనసుల్లో కుత్సితత్వం — నాన్న పోవడం — ఊరి చివర కాలవ. కాలవ దగ్గర చెల్లెళ్ళ పాతిపెట్టడం — అమ్మ ఏడుపు — చీకటి — శూన్యం.

ఇదంతా యిరవైఏళ్ళకే ? !

కదలికలేకుండా మొద్దుబారిపోయింది బతుకు.

కళ్ళల్లో కాంతి పోయి గాజుగోళీల్లా తయారయ్యాయి. అప్పుడే కాదంబరి తనకు మరింత దగ్గరగా వచ్చింది. నవ్వుతూ తుళ్ళుతూ కావల్సినన్ని కబుర్లు చెప్పేది. మనసుకు ఊరట కలిగేది. సేద తీరేది.

తను, కాదంబరి — సాయం సంధ్యలో కృష్ణ ఒడ్డున ఇసుక తిన్నెలమీద ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకుంటూ...చేతివేళ్ళు చిక్కుపడేసుకుంటూ— దగ్గర్లో నీటిమీద పడిన ఎర్రటి అసురసంధ్య వెలుగు — ఆవిడ కళ్ళల్లో పడి చెదిరిపోతుంటే దానంతటిని ఏరుకుంటూ — వచ్చి వచ్చి ఆమె నడుం చుట్టూ చెయ్యివేసి దగ్గరకు తీసుకుని — చక్కిలిగింతకు తన తనువు పులకరిస్తే — కొబ్బరాకుల మధ్య వెన్నెల సిగ్గుపడితే — లోకమేమి తెలిసేదికాదు.

అప్పుడు తెలీని లోకం ఇప్పుడు తెలిసింది.

తెలిసిన లోకంలో ఇన్ని ఎత్తుపల్లాలు. వాస్తవానికి, ఊహకు ఎంత తేడాయో... జీతం పేరుకు వెయ్యి రూపాయిలు. అమ్మ మందులు, తమ్ముడి చదువు, చెల్లెలు స్కూలు ఫీజు... ఇంటి అద్దె... సంఘం... మర్యాద వచ్చీపోయేవాళ్ళు వీటన్నిటినీ తట్టుకోవాలి. ఇవేవీ కాదని తప్పించుకుని తిరగలేడు తను. చెయ్యాలి. అందరూ తనను మంచివాడనుకోవాలి. బుద్ధిమంతుడను కోవాలి. తండ్రి కాకపోయినా కొడుకైనా ప్రయోజకుడై తల్లిని, పిల్లల్ని చూస్తున్నాడను కోవాలి. ఈ స్వార్థం వుంది మళ్ళీ తనకు. ఎంత మోసమో... కడుపులో లేంది కౌగరించుకుంటే వచ్చినట్టు.

కాదంబరీ వాళ్ళమ్మందంటే తప్పేముంది. కోపమేమ రాలేదు. బాధపడాల్సింది కూడ ఏంలేదని పించింది. కాని కాదంబరి సాన్నిధ్యంలో, ఆ స్పర్శలో ఏదో పిచ్చి ఆశ తరతరాల దాహాన్ని తీర్చుకోవాలని ఆత్మతో ఆత్మను పెనవేయాలని తనలో ఐక్యమైపోవాలని ఈ కష్టాలు కన్నీళ్ళు అన్నీ మర్చిపోయి ఏ దివ్యలోకాల్లోనో విహరించాలని... ఏదో పారవశ్యం... ఏదో హాయి... ఏదీ... ఏదీ ఆ థ్రిల్ ఇప్పుడు... ఏమైందా ఎక్సైట్‌మెంట్...

'ఇంత దుఃఖము సైప నాకేక హృదయ మేల'

* * *

కాదంబరికి నిద్ర రావడంలేదు.

వెల్లకితలా పడుకుని ఆలోచిస్తోంది.

పది పదకొండు పన్నెండు

అలసటగా చర్చి గంటలు మోగాయి. మళ్ళీ వున్నట్టుండి నిశ్శబ్దం.

పలచటి నీలిరంగు వెలుతురు గదంతా పరుచుకుని ఎదుటి గోడమీది 'పికాసో' బొమ్మమీద దాని కాంతి పడి సన్నగా చెదిరిపోతోంది. అది కృష్ణే ఇచ్చాడు తనకు. ఆ బొమ్మంటే కాదంబరికి చాల ఇష్టం.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.


'రేపో మాపో తాంబూలాలు కూడ పుచ్చు కుందాం అనుకుంటున్నాం. ఇహ చిన్నపిల్లల వేషాలు మానేయ్' అమ్మ ఖచ్చితంగా చెప్పింది.

మనసు మారాం చేసింది. ఇది తన స్వవిషయం అందులోనూ పెళ్ళి... జీవితాన్ని మరొకరితో పంచుకోబోయే మహత్తర సదవకాశం... ఇప్పుడు కూడ తల్లి మాటకు ఎదురు చెప్పలేని తన బలహీనతను ఏమని పిలవాలి. మంచితనమనా...





CASAP 39-244 TEL



సగంలో ముగింపు

నో... నాన్సెన్స్... ఈ మంచితనం తనకు అక్కర్లేదు. ఈ సమాజం ఈ సమాజపు కృత్రిమ విలువలు అంతకంటే అక్కర్లేదు తనకు.

'నేసలు పెళ్ళే చేసుకోను'

'అందరం ఇలా అన్నవాళ్ళమే. అయినా ఎన్నాళ్ళిలా గుండెలమీద కుంపటిలా మొయ్యను నిన్ను' మొండిగా వాదించిందమ్మ.

ఏం మాట్లాడలేదు తను. ఆ రాత్రలాగే గుడ్లనీరు గుడ్లకుక్కుకుని పడుకుంది.

మరునాడు ఉదయం ఎనిమిదైతేగాని నిద్రలేవలేదు కాదంబరి. అమ్మ దేముడి గదిలో వుంది. దేవతా విగ్రహాలకు పూజ చేస్తోంది. తనను చూసింది. చూసి, లేచి దగ్గరకు వచ్చింది. పసిపిల్లలాగా తనను దగ్గరకు తీసుకుంది.

'ఈ పూజలు పునస్కారాలు అన్నీ నీకోసమే. నీ సుఖంకోసమే తల్లీ!'

అమ్మవారి పాదాల ముందు కుంకుమ తన చేతి కిచ్చింది. తీసుకుని నుదుట దిద్దుకుంది కాదంబరి.

కిరణ్‌తో కాదంబరి వివాహం యధావిధిగా జరిగింది.

బంధువులు స్నేహితులు చాలమందొచ్చారు. సన్నాయిమేళం అరుపులో కొత్తబట్టల మధ్య చిక్కి, కన్నీళ్ళలో తడిసి శిలాప్రతిమలా... అనుభూతిలేని మాంసపు ముద్దగా —

మూడుముళ్ళూ వేయించుకుంది కాదంబరి!

పెళ్ళికి కృష్ణ వెళ్ళలేదు.

అందరి మనస్సు మూగబోయింది. మిగిలింది అప్పగింతలుట.

'ఈకాస్త తతంగంకూడ పూర్తయిందని' స్త్రీ ఇహ వాళ్ళ పిల్లని వాళ్ళ కప్పగించొచ్చు' పెళ్ళి కొచ్చినవాళ్ళల్లో ఎవరో అంటున్నారు.

ఏడుపొచ్చింది. కృష్ణ కాకుండా మరెవరితోనో జీవితం ... అతనులేని అస్తిత్వం.

ఇతనెవరో...ఇతని నీడన తను ... బతికినంత కాలం ఈ నరకం... అరచేతుల్తో ముఖాన్ని కప్పుకుని ఏడ్చింది.

'కాదంబరీ! ఏమిటీ కన్నీళ్ళు హాయిగా నీ భర్తతో నువు కాపరంచేయడానికి పోతున్నావు. అయినా ఎన్నాళ్ళిలా అమ్మదగ్గరుంటావు చిన్నపిల్లలా. నీకు మాత్రం నీ భర్త సంసారము, ఇల్లు, పిల్లలు కావాలనిలేదు.'

అమ్మను విడిచి వెళ్ళాల్సొస్తున్నందుకు బాధపడుతున్నాననుకున్నారు వాళ్ళంతా.

కాదంబరే మాట్లాడలేదు.

కన్నీళ్ళు తుడుచుకుంది! అంతే!

మరో రెండు మూడు రోజుల్లో కిరణ్ నేపాల్ వెళ్ళిపోవాల్ట. 'నాతోపాటే తీసుకువెళ్తాను కాదంబరిని కూడ. మళ్ళీ మరోసారెందుకు' అన్నాడు.


సరే అన్నారు అంతా.

'నో నో' గట్టిగా అరవాలనిపించింది కాదంబరికి.

కాని, తప్పేదెలా? 'కృష్ణా! నీ, నామధ్య దూరం ఇప్పటికే ఎక్కువైపోయింది. ఇంకా యెక్కువవుతోంది. దూరంగా ఇంకా దూరంగా... చాలా దూరం వెళ్ళిపోతున్నాను. ఈ జన్మ కింక చూస్తానో చూడనో నిన్ను' అని కృష్ణకి ఉత్తరం రాసింది.

[ఇంకా వుంది]

"గాడిద పిల్ల గాడిదకి ముద్దు" అంటే యిదే....



—ఫోటో : జొనేవల్లి మురళి

ముఖ్య గమనిక

పైవారం దసరా సంచిక 68 పేజీలతో ఎక్కువ ఆకర్షణలు :
వెల 85 పైసలు : : ముందుగానే మీ కాపీకై చెప్పి వుంచండి !

దగుల్బాజి

"వైదేహి"



సుబ్రహ్మణ్యం, వసంత, ఇద్దరూ ఒక సెక్షన్‌లో స్టెనోలుగా పని చేస్తున్నారు. ఇద్దరూ ఒకరిపై ఒకరు ఆకర్షితులైనారు. చివరకు పెద్దలతో సంప్రదించి, పెళ్లి చేసుకోవాలనే నిర్ణయానికొచ్చారు.

పెళ్లికొడుకుల డిమాండ్ పెరిగిన ఈ రోజుల్లో సుబ్రహ్మణ్యం కొరకు రోజు కొకర్రైనా, ఇంటికో, ఆఫీసుకో వచ్చి, విచారించి పోతూండే వాళ్ళు. వాళ్ళందరికీ ఏవో అబద్ధాలు, కుంటిసాకులు చెప్పి తప్పించుకుంటూ వస్తున్నాడు సుబ్రహ్మణ్యం. ఎంత త్వరగా వసంతా వాళ్ళ పెద్దలతో మాట్లాడి, ముహూర్తాలు పెట్టించేస్తే, అంత మంచిదను కున్నాడు. ఈ విషయం ఇప్పటికే చాలామందికి తెలిసిపోయింది. ఇంకా జాప్యం చేస్తే, వాళ్ళందరి వద్ద తమ ప్రేమ అపహాస్యంపాలయ్యే ప్రమాద ముంది. ఆఫీసుకొస్తూ ఆలోచిస్తున్నాడు సుబ్రహ్మణ్యం.

ఆఫీసుకొచ్చి అటెండెన్స్ రిజిస్టర్లో సంతకం చేశాడు. తన పేరు కిందనే వున్న, వసంత పేరు కెదురుగా "సి. ఎల్." మార్కు చేసివుంది. "అయితే ఈ రోజు వసంత ఆఫీసుకు రాదన్న మాట. ఏమైందో ఏమో ? కొంపతీసి పెద్దవాళ్ళు ఏ పెళ్ళిచూపులో ఏర్పాటుచేసి, ఆమెను ఇంటివద్ద కట్టిపడెయ్యలేదుకదా? ' ఈ ఆలోచన వచ్చినప్పుడు సుబ్రహ్మణ్యంలో అనిర్వచనీయమైన బాధ కలిగింది. తన సెక్షన్‌లోకి వెళ్ళి టైప్‌రైటర్‌పై వున్న ముసుగు తీసాడు. తను టైప్ చేయవలసిన కాగితాలు అప్పటికే టేబుల్‌పై సిద్ధంగా వున్నాయి. ఈ రోజు వసంత రాదుగనుక, ఆమె పనికూడా తనే చేయవలసివస్తుంది. ఆమె వాటా పని చేయవలసివచ్చేందుకు కాదుగానీ, ఆమె రాక పోతే, తనకు ఆఫీసులో పని చెయ్యబుద్ధెయ్యదు.

చేసేదేమీలేక, అతికష్టంమీద రెండు కాగితాలు టైప్ చేశాడు. ఒకసారి అలా వెళ్ళి టీ త్రాగి, ఒక సిగరెట్ వెలిగిస్తే మనసుకు కాస్త రిలీఫ్ వస్తుందనుకొని, పైకి లేచి, ఆఫీసు కెదురుగా వున్న టీ స్టాల్‌వైపు నడిచాడు.

"ఏమోయ్! సుబ్రహ్మణ్యం! ఈ రోజు చాలా డల్‌గా వున్నావు. నీ ప్రేమిపురాలు రానందుకేనా ?" టీ స్టాల్‌నుండి బయటికొస్తూ ఎదురైన గురుప్రసాదం అడిగాడు.

"వీడొకడు. మమ్మల్ని గమనిస్తూండడమే వీడి పని. గుడ్లగూబ" అని విసుక్కున్నాడు లోలోపల.

పైకి మాత్రం నవ్వుతూ, "అదేం కాదు గురూ ? ఒంట్లో అంత కులాసాగా లేదు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"నాకు తెల్సులేవోయ్" అంటూ అతను ముందుకు సాగిపోయాడు.

"ప్రేమ వ్యవహారాలు యెంత గోప్యంగా వుంచితే, అంత మంచిది. కానీ అవి అలా దాగవే" అనుకుంటూ స్టాల్ లోనికి వెళ్లి కుర్చీలో కూర్చున్నాడు. సర్వర్‌కు టీ తెమ్మని ఆర్డర్ ఇచ్చి, టీ తాగి డబ్బు చెల్లించి బయటికొస్తూంటే, ఒక నడివయస్కుడు అతనివద్ద కొచ్చాడు.

"సార్ ! మీరీ ఆఫీసులో పని చేస్తున్నారా?" యెదురుగా కనిపిస్తున్న సుబ్రహ్మణ్యం వాళ్ల ఆఫీసును చూపిస్తూ నమ్రతగా అడిగాడాయన.

అవునన్నట్లు తలూపాడు, అనుమానంగా ఆ వ్యక్తిని చూస్తూ సుబ్రహ్మణ్యం.

"ఇక్కడ సుబ్రహ్మణ్యం అనే ఒక కుర్రాడు పని చేస్తున్నాడట. ఆ అబ్బాయి గుణగణా లెలాంటివో చెప్పగలరా ?" అత నడిగాడు.

ఇద్దరూ ఆఫీసు ప్రహరీగోడ కింద కొచ్చి నిల్చున్నారు.

"ఏం ఏదైనా పెళ్లి సంబంధమా ?" అడిగాడు సుబ్రహ్మణ్యం.

"అవునండీ !"

"అయితే వినండి. అతనికి దాదాపు ముప్పై ఏళ్ళుంటాయి. అతన్ని చేసుకోడానికి యెవరూ ముందుకు రాలేదు. అనాకారి. అంతేకాదు. పైలాపచ్చీసుగా తిరుగుతూంటాడు. జూదం ఆడుతాడు. వ్యభిచార గృహాల కెడతాడు. అమ్మా నాన్నలకు కూడు పెట్టడానికి ఏడుస్తాడు. అతనికి లేని దురలవాటు లేదు. అలాంటి నీచుణ్ణి చేసుకొని ఏ ఆడపిల్ల సుఖపడుతుందో నా కర్థం కాదు" అన్నాడు సుబ్రహ్మణ్యం శూన్యంలోకి చూస్తూ

"అంత చెడ్డవాడా ?" నమ్మలేనట్లు అడిగాడు ఆ వచ్చిన పెద్దమనిషి.

"అయినా నాకెందుకుగానీ ... నేనిలా చెప్పానని వాడితో అనకండి" అని ముందుకెళ్లిపోబోయాడు సుబ్రహ్మణ్యం.

"చూస్తూ...చూస్తూ ... మా పిల్ల గొంతు కొయ్యలేను. నాకీ నిజం తెలియచేసినందుకు చాలా కృతజ్ఞతలు. అయినా ఆ దగుల్బాజీని ఒకసారి చూపిస్తారూ ?" అన్నాడు అతను.

సుబ్రహ్మణ్యం ముందు తత్తరపడి, తర్వాత తేరుకొని ఏదో చెప్పబోయేంతలో అదే సమయంలో మత్తుగా తూలుతూ రోడ్డుపైన వెడుతున్న ఒక యువకుణ్ణి చూపించి, "అదిగో ... మాటలలోనే వచ్చాడు ! వాడే ఆ దగుల్బాజీ !" అన్నాడు సుబ్రహ్మణ్యం.

అతనికేసి చూచాడు పెళ్లిపెద్ద. నీరుకావి పట్టిన గుడ్డలు వేసుకొని, చింపిరిజుట్టుతో, తూలుతూ నడిచిపోతున్నాడు, ఆ యువకుడు.

"అమ్మబాబోయ్! వస్తాను " అని గోడవారగా నిలిపివున్న సైకిల్ ఎక్కి వేగంగా వెళ్ళిపోయాడు ఆ పెళ్ళి పెద్ద.

1978 లో

ఈ క్రిందివారి

రచనలు

భారతి

ప్రచురించింది.

✶

[మీరు
గమనించారా?]

✶

* కేవస్వీ * పిరాట్ల * పరబ్రహ్మ శాస్త్రి * దిలావర్ * సౌంధ్యశ్రీ * ఇస్మాయిల్ * సదానంద * సౌంకలియా * శివారెడ్డి * శేషేంద్రశర్మ * సోమసుందర్ * లక్ష్మీరంజనం * నారాయణరెడ్డి * సిధారెడ్డి * రమణారెడ్డి * దాశరథి * మధునాపంతుల * శివప్రసాద్ * నిఖిలేశ్వర్ * తిలక్ * కార్తికేయ శర్మ * కాళిదాసు * మురళీధర్ * జ్వాలాముఖి * కొలకలూరి * రామాచంద్రమౌళి * సంపత్కుమారాచార్య.

✶

[వీరు కాక ఇంకా
ఎందరో వున్నారు!
ఈ జాబితా
మచ్చుకి మాత్రమే!]

దగుల్బాజీ

"మళ్ళీ రాకు – నా ప్రాణం తీయకు" అని, తను ఆడిన నాటకానికి తనను తానే అభినందించుకుంటూ, ఆఫీసులోకి వెళ్ళిపోయాడు, సుబ్రహ్మణ్యం.

*   *   *

మరు రోజు వసంత ఆఫీసు కొచ్చింది. అటెండెన్స్ రిజిష్టర్లో సంతకం చేసి, వెళ్ళి తన స్థానంలో కూర్చుని టైప్‌రైటర్ టకటక లాడించసాగింది.

వస్తూనే "హల్లో!" అని పల్కరించే వసంత ఈ రోజు అంత సీరియస్‌గా వుండడం ఎందుకో సుబ్రహ్మణ్యానికి అర్థం కాలేదు.

"వసంతా!" పక్కనే కూర్చున్న సుబ్రహ్మణ్యం పల్కరించాడు.

"ఏం?" అంది టైప్ చేస్తూనే.

"ఏం అదోలా వున్నావు?"

"ఏంలేదు – మనసేం బాగాలేదు."

"ఎందుకని?"

"తర్వాత చెప్తాను. ఇక్కడ గుడ్లగూబలు చాలా వున్నాయి. మన ప్రేమకు అవరోధం కల్గిస్తాయి." గురుప్రసాదాన్ని దృష్టిలో వుంచుకొని, అంది వసంత.

"ఆ గురుప్రసాదంగాడు ఏదైనా చేశాడా?"

"చేశాడా?... చేశాడా? రాస్కెల్. ఈర్ష్య ఎంతపని చేయిస్తుందని" అంది వసంత.

"ఏం జరిగింది వసంతా?" అని అడిగాడు సుబ్రహ్మణ్యం అసహనంగా.

ఆమె జవాబు చెప్పడానికి సందేహించింది.

లంచ్ టైమ్‌లో మాట్లాడుకోవచ్చని సరిపెట్టుకొన్నాడు, సుబ్రహ్మణ్యం. కొంతసేపైన తర్వాత అలవాటుప్రకారం టీ తాగాలని రోడ్డుమీద కొచ్చాడు

అంతే. అతని కాలర్ పట్టుకొని ఎవరో వెనక్కు లాగారు. సుబ్రహ్మణ్యం తూలి అతని ఛాతీమీద పడ్డాడు. ఎవరా అని అతనికేసి చూచాడు. నిన్న తనను గురించి వాకబు చేసిన పెళ్ళిపెద్ద.

"ఏమైంది?"

"సుబ్రహ్మణ్యం గురించి అబద్ధాలు చెప్పిన పెద్దమనిషివి నీవేకదూ?" గుడ్లెర్రచేసి అడిగాడు, అతను.

"అబద్ధాలేముంది? అన్నీ నిజాలే" అన్నాడు సుబ్రహ్మణ్యం బెరుకుగా.

"ఏముకలేరేస్తాను ... నిజం చెప్పు." బెదిరించాడు అతను కాలరు బిగించిపడ్తూ.

"నేను అబద్ధం చెప్పానని, మీకెవరు చెప్పారు?" వస్తున్న కోపాన్ని అణచుకుంటూ అడిగాడు సుబ్రహ్మణ్యం.

"నేను తర్వాత మా ఫ్రెండ్‌ను అడిగాను. అతనికి సుబ్రహ్మణ్యం గురించి బాగా తెలుసు"

"అయితే ఇప్పుడు నన్నేం చేయమంటావ్?"

"అబద్ధాలు చెప్పినందుకు, ఒక మంచి వ్యక్తిని నీచుడుగా చిత్రించినందుకు నాచేత తన్నులు తినమంటాను" అంటూ చేయి పైకెత్తాడతను

"ఒరే! అన్నయ్యా! ఆయన్ను వదులు ... ఎందుకలా హింసిస్తున్నావు?" అంటూ పరుగెత్తుకొచ్చింది వసంత.

"వీడేనమ్మా! నీ సుబ్రహ్మణ్యం గురించి అవాకులు చవాకులు అల్లి చెప్పిన రాస్కెల్" అన్నాడు అతను.

సుబ్రహ్మణ్యం, వసంతా ఒకరి ముఖాలొకరు చూచుకున్నారు ఆశ్చర్యంగా. తర్వాత ఏదో అర్థమైనట్లు ఇద్దరూ పెద్దగా నవ్వుకున్నారు.

వాళ్ళిద్దరూ ఎందుకలా నవ్వుతున్నారో అర్థంగాక తెల్లముఖంవేశాడతను.

"వీరే అన్నయ్యా! సదరు సుబ్రహ్మణ్యం" అంది వసంత నవ్వాపుకుంటూ.

"అయితే నిన్న మిమ్మల్ని గురించి మీరే ఎందుకలా అబద్ధాలు చెప్పారు?" కాలర్ వదిలేస్తూ అడిగాడు వసంత అన్నయ్య.

"మీరెవరో నాకు తెలియదాయె ... నాకేమో రోజుకొకరు పెళ్ళి బేరాలు తెస్తున్నారు. వసంతకోసం వాళ్ళందర్నీ తప్పించుకోడానికి, రోజుకొక అబద్ధం చెప్పలేక నా పని అవస్తయిపోతూంది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"భలేవాడివయ్యా! బావమరిదీ! నీకిక ఆ అవస్థ కల్పించనులే" అన్నాడు అతని చెయ్యి, తన చేతిలోకి తీసుకుంటూ వసంత అన్నయ్య. ◉

నాతో నేస్తం కడతావా?....

—ఫొటో : ఎస్. సత్యనారాయణ



దీర్ఘంగా ఆలోచించి, ఒక నిర్ణయానికి వచ్చేడు రాఘవేంద్రరావ్. కాలుతున్న సిగరెట్‌ను సగంలోనే యాష్‌ట్రేలో పడేసి, కుర్చీలో నుండి లేచి నిలబడ్డాడు.

వంటింట్లో భార్య పంకజం గిన్నెల్ని సర్దుతుంది. ఆమెకీ విషయం తెలియకూడదు. తెలిస్తే నానా గొడవ చేస్తుంది. అసలే అనుమానపు మనిషి!

టేబులుమీద నున్న ఉత్తరాన్ని తీసి, జాగ్రత్తగా మడతపెట్టి, పేంటు జేబులో వుంచాడు.

రాఘవేంద్రరావ్ బేంకులో క్యాషియర్. రెండేళ్ళ క్రిందటే పెళ్ళయింది, పంకజంతో. ఇద్దరిదీ అన్యోన్య దాంపత్యం అయితే, పంకజం వట్టి అనుమానపు మనిషి. భర్త ఏ ఆడదానితోనైనా మాట్లాడితే భరించలేదు. అందుచేతనే 'సుధ' విషయం భార్యకు ఎంతమాత్రం తెలియకుండా జాగ్రత్తపడ్డాడు రాఘవేంద్రరావ్.

'సుధ' రాఘవేంద్రరావుకు పెన్ ఫ్రెండ్.

నెలకు కనీసం రెండు మూడు ఉత్తరాలన్నా వ్రాస్తుంది. ఆమె వ్రాసిన ఉత్తరాల్లో అక్షరాలు ముత్యాల్లాగ వుంటాయి. ఎంతో అభిమానంగా, ఆత్మీయంగా ఉత్తరాలు వ్రాస్తుంటుంది.

అందుకనే, సుధ అంటే రాఘవేంద్రరావ్‌కు ఎంతో యిష్టం. ఆమె వుత్తరాన్ని పదే పదే చదువుకొంటూ మురిసిపోతుంటాడు. అయితే, ఈ విషయం భార్యకు తెలియకుండా జాగ్రత్తపడ్డాడు.

తనకు వో గర్ల్‌ఫ్రెండ్ వుందని తెలిస్తే భార్య మూడో ప్రపంచ యుద్ధాన్ని ప్రకటిస్తుందని రాఘవేంద్రరావ్ భయం.

బీరువాలోనుండి పర్సు తీసి జేబులో పెట్టుకున్నాడు.

"పంకజం! అలాగ బజార్లోకెళ్ళి యిప్పుడే వస్తాను" అన్జెప్పి బయటపడ్డాడు

పోస్టాఫీసు రోడ్డుమీదనుండి వెళ్తుంటే 'సుధ' వుత్తరం గుర్తుకువచ్చింది. క్రిందటిసారి వుత్తరంలో 'తను బియ్యే పరీక్షకు వెళ్ళడం లేదంటూ' వ్రాసింది. కారణం ఏమిటని ప్రశ్నించాడు. ఆర్థిక సమస్యలంటూ వ్రాసింది.

ఆ జవాబుకు రాఘవేంద్రరావ్ చాలా నొచ్చుకున్నాడు. 'సుధ' పరీక్షకు వెళ్ళాలి. అందుకు, తను సహాయం చెయ్యాలి. తనకు వున్న ఒక్కగానొక్క గర్ల్‌ఫ్రెండ్‌కు సాధ్యమయినంతగా హెల్ప్ చెయ్యాలి.

రాఘవేంద్రరావ్‌లో వుమన్ సింపతీ ప్రారంభమయింది. 'సుధ'కు పరీక్ష ఫీజు కట్టాలని నిశ్చయించుకున్నాడు.

పోస్టాఫీసుకు వెళ్ళి, ఎమ్. ఓ. ఫారం తీసుకున్నాడు. ఫారం నింపుతుంటే రామారావ్ వచ్చేడు. "ఎక్కడికిరోయ్ ఎమ్. ఓ.?" అని నవ్వుతూ ప్రశ్నించాడు.

రామారావ్ రాఘవేంద్రరావుకు బాల్య స్నేహితుడు.

"మా ఫ్రెండ్‌కి." రాఘవేంద్రరావ్ జవాబు చెప్పేడు.



కశింకోట ప్రభాకరదేవ్

"ఫ్రెండ్‌కా? ఎవర్రా...?!"

"సుధ అని నా గర్ల్ ఫ్రెండ్..."

"వాట్? ... గర్ల్ ఫ్రెండా?"

"అవున్రా. పరీక్ష ఫీజు కట్టలేక, పరీక్షకు వెళ్ళనంటూ వ్రాసింది. అందుకని, నేను పంపిస్తున్నాను."

రాఘవేంద్రరావ్ మాటలకు రామారావు ముఖంలో రంగులు మారేయి.

"నీ ఫ్రెండ్ వూరు కాకినాడ కదూ?"

"అవున్నా నీకూడా తెలుసా?" రాఘవేంద్రరావు ఆశ్చర్యపోతూ అడిగాడు.

ఫక్కుమంటూ నవ్వేడు రామారావ్.

"నువ్వొట్టి ఫూల్‌విరా" అన్నాడు.


"సుధ నీ గర్ల్ ఫ్రండ్ అన్నావ్. సుధ ఆడది కాదు మగాడు. పూర్తి పేరు సుధాకర్. నీలాంటి వాజమ్మలను బోల్తాకొట్టించి, డబ్బు లాగడానికి 'సుధ' అంటూ ఆడ పేరుతో తెలివిగా వ్యవహరిస్తున్నాడు."

రామారావ్ మాటలకు నీరుకారిపోయాడు రాఘవేంద్రరావ్.

"ఇదంతా నీకెలాగ తెలుసు?" అనుమానంగా చూశాడు.

"నేనూ నీలాగే ఓసారి బోల్తాపడ్డాను. ఏదో పనిమీద 'కాకినాడ' వెళ్ళి, వాళ్ళింటికి వెళ్ళేసరికి గుట్టు బైటపడింది." ●

ఇలాంటి చుట్టాలొద్దు బాబోయ్!



బంధువులు, స్నేహితులూ లేనివాళ్ళుండరు. ప్రతీ వారింటికి ఒకరోజు కాకపోతే, ఒక రోజు బంధువులో స్నేహితులో వస్తూనే వుంటారు. కాని ఆ వచ్చినవాళ్ళు ఇంటియజమానికి ఇబ్బంది కలిగించకుండా, బాధించకుండా వచ్చివెళ్తే, వాళ్ళు ఎదే ఎదే వచ్చినా పరవాలేదనిపిస్తుంది. ఒకరింటికి వెళ్ళినప్పుడు ఆ ఇంటివారి పద్ధతుల్ని కొంచెం అవగాహన చేసుకుని వాటికి అనుగుణంగా నడుచుకుంటే ఎంతో బాగుంటుంది. కొందరిళ్ళలో ఎవరి సబ్బులు వాళ్ళే రుద్దుకుంటారు తువ్వాళ్ళూ దువ్వెన్లూ ఎవరివి వాళ్ళే వాడుకుంటారు. అందుకు మనం ఒకరింటికి వెళ్ళినప్పుడు ఓ సబ్బు, దువ్వెన్న పౌడరు డబ్బా స్నోల్లాంటివి. ఓ దిండూ, దుప్పటి లాంటివి తీసుకొని వెళ్తే ఎంత మర్యాదగా వుంటుంది? అలా కాకుండా 'ఓ తువ్వాలిస్తారా?'' "కాస్త పౌడరిస్తారా?'' "దువ్వెన్న వుందా?'' అని అడగడం- లేదా ఎదురుగా కనపడ్డ తువ్వాలుతో తుడిచేసుకుని, వాళ్ళ దువ్వెన్లూ, సబ్బులూ వాడటం లాంటివి చేస్తే, ఒకరు వాడినవి వాడటం అభ్యంతరం వున్నవాళ్ళు బాధ పడతారు.

మరి కొందరుంటారు. చక్కగా సర్దుకుని, నీట్‌గా వుంచుకున్న సోఫాలమీద తడి కాళ్ళు పెట్టుకుని కూర్చోడమో, లేక పడుకోడమో లేదా విడిచిన బట్టలన్నీ వాటి మీద పడెయ్యడమో చేస్తారు. డైనింగ్ టేబుల్‌మీద కాళ్ళు పెట్టుకుని దర్జాగా కూర్చుంటారు. అటువంటప్పుడు, ఆ ఇంటి యజమాని అవస్థ ఎలా వుంటుందో ఆలోచించండి!


ఒక పెద్దమనిషి భార్యా సమేతంగా ఢిల్లీ చూడటానికి వచ్చాడు. స్థలం మార్పువల్ల బాగా జలుబుచేసి, దగ్గు పట్టుకుంది ఆ దంపతులు డైనింగ్ టేబుల్ దగ్గర ముక్కుచీది పక్కనేవున్న గోడకి రాయడం, ఆ చేతుల్తో ఓ టేబుల్ మీదున్న వంటకాల్ని వడ్డించుకోడం- వాళ్ళకిక్కడే [illegible] ఓ ఇంటి యజమాన్ని [illegible] డైనింగ్ టేబుల్ అన్న ఆలోచన లేకుండా [illegible]న్నవి కంచంచుట్టూ వుమ్మేస్తారు. ఆ వుమ్మినవి ఎత్తడమంటే ఎంత అసహ్యంగా వుంటుందో వూహించండి! అంతేకాకుండా నీట్‌గా తోముకుని వుంచుకునే వాష్ బేసిన్‌లో దగ్గి వుమ్మెయ్యడం, చీదడం లాంటివి చేసి కుళాయి విప్పకుండా వెళ్ళిపోతారు. అటువంటివి కడిగి తోమాలంటే ఆ ఇంటి ఇల్లాలికి ఎంత బాధగా వుంటుందో తెలుసుకోరనుకుంటా! మరి కొందరికయితే లెట్రిన్ ఎలా వుపయోగించుకోవాలో కూడా తెలీదు. ఫ్లష్ లన్నా లాగరు, సరికదా కనీసం చెంబుడు నీళ్ళన్నా పొయ్యకుండా వస్తారు ఇటువంటి శుభ్రత లేని వారిని భరించాలంటే, మొహమాటస్తులయిన ఇంటి యజమాన్నికి ఎంత ఇబ్బందిగా వుంటుందో యోచించండి! ఖర్మంచాలక 'నీళ్ళు పొయ్యం''డని చెప్తే పెద్ద అవమానంగా భావించి, ఆ ఇల్లాలిని దుమ్మెత్తిపోస్తారు. ఒకరిచేత చెప్పించుకోడం నామోషిగా బాధపడిపోతారు.

పిల్లలున్న వాళ్ళతో మరో రకం ఇబ్బందులు ఆ ఇంటి వాళ్ళు షోకేస్‌లో సర్దుకున్న బొమ్మల్ని తీసి ఆ పిల్లలు విడదీయడం దాంతో 'ఆ బొమ్మలో సారి ఇవ్వురా కాస్సేపు ఆడుకుని ఇచ్చేస్తుందీ'' అనడం కాని "అవి పిల్లలకి ఇచ్చే ఆట వస్తువులా? ఎంత ఇష్టపడి వాళ్ళు ఎంత జాగ్రత్తగా వాటిని దాచుకున్నారూ'' అని కొంచెమయినా యోచించరు. ఆ ఇల్లాలు "అవి షోకేస్‌లో పెట్టుకునేవి, ఆటబొమ్మలు కావమ్మా'' అని అందనుకోండి- ఇంక ఆ పిల్ల రాగం హెచ్చించడం తల్లి మూతి ముడుచుకుని కూర్చోడం- లేదా ఇవ్వలేదన్న కోపంతో ఆ పిల్లని బాదడం- ఇదీ వరస అంతేగానీ పిల్లలకి బుద్ధి చెప్పకోరు పిల్లలు సామాన్లు లాగేస్తున్నా విలువైన వస్తువులు పాడు చేస్తున్నా, మంచాలు, సోఫాలు ఎక్కి తొక్కుతున్నా తల్లి, తండ్రులు "తప్పమ్మా'' అనయినా వారించరు.

మరి కొందరయితే పిల్లలు ఉచ్చపోసి, పాడుచేసినా తమ పిల్లలు కానట్టే, చూసి, చూడనట్టు వూరుకుంటారు ఒక వేళ మొహమాటం విడిచి గుడ్డ ఇచ్చి తుడవమంటే తల కొట్టేసినట్లు ఫీలయి, మొహం ముడుచుకుని తుడిచి ఆ గుడ్డ అక్కడే వదిలేస్తారు— "అది వుతుక్కోవలసిన బాధ్యత మీదే'' అన్నట్టు. ఇలాంటి వారికి చాకిరీ చెయ్యడమే కాకుండా, వారి పిల్లలు ఉచ్చ, దొడ్డీ కూడా శుభ్రం చెయ్యాలంటే ఆమె అవస్థ ఎలా వుంటుందో ఆలోచించండి! [illegible] ఈ రకమైన వెట్టి చాకిరీలు చెయ్యక తప్పదు.

కందుకూరి వెంకట మహాలక్ష్మి.

సినిమా



...?'లో చంద్రమోహన్, మాధవి

స్టార్స్ - సెంటిమెంట్స్

సెంటిమెంటు అనే ఆంగ్ల పదానికి తెలుగులో అర్థం చెప్పుకోవాల్సివస్తే ''నమ్మకం'' అనొచ్చు సెంటిమెంట్స్ చాలా రకాలు. రాహుకాలం చూడడం ఒకాయన సెంటిమెంటైతే, తిథి, వారశూలం చూడడం ఇంకొకాయనకు పట్టింపౌతుంది. శకునాలు చూడడం ఒకాయనకు పట్టింపైతే. రాశిఫలం చూడడం వేరొకాయన సెంటిమెంటౌతుంది. ఇలా మనిషి మనిషికి ఓ రకమైన సెంటిమెంటు వుండడం సహజం. ఈ సెంటిమెంట్సును గూర్చి కొంతమంది సినిమా స్టార్స్‌ను ప్రశ్నించాను. ఒక్కొక్కరు తమ, తమ సెంటిమెంట్సును వివరించారు.

జయచిత్ర

''షూటింగ్‌కు వెళ్లే ముందు ''అమ్మ'' కాళ్లకు దండమెట్టి వెళ్లడమనేది నేను ఖచ్చితంగా వుండే విషయాల్లో అతి ముఖ్యమైంది. ఇదో పెద్ద సెంటిమెంటు నాకు. అలా చేయనిరోజు నా మనస్సు అశాంతిగా వుంటుంది, ఏదో శక్తి నానుంచి దూరమైనట్టనిపిస్తుంది'' అంటుంది కళాజ్యోతి జయచిత్ర.

జయసుధ

దేవర్‌గా నటించనున్న శివాజీగణేశన్

స్టంటు శాఖ నుంచి, చిత్ర నిర్మాతగా తన జీవితాన్ని తీర్చిదిద్దుకున్న స్వర్గీయ శాండో చిన్నప్పదేవర్ జీవన పరిణామ దశలను ... చలన చిత్రంగా నిర్మించడానికి తమిళ రచయిత శ్రీ బాలమురుగన్ నిర్ణయించారు.

గాంధీజయంతి రోజున, చిత్ర నిర్మాణానికి అంకురార్పణ జరగడానికి వీలుగా, దేవర్ పాత్రధారి శ్రీ శివాజీగణేశన్ కాల్‌షీట్లు యివ్వడానికి సమ్మతించారని తెలిసింది.

కొన్ని వేలమంది జీవిత సౌభాగ్యానికి కారణ కర్తగా వుండిన ... శాండో చిన్నప్పదేవర్ వంటి మానవోత్తముడ్ని, దేవుడు తన దగ్గరకు యింత త్వరగా రమ్మనడం ... ఆశ్చర్యకరమైన విషయం.

దాసరిపై దేవర్ అభిప్రాయం

''అగ్రదర్శకుడు'' శ్రీ దాసరిని ... స్వర్గీయ శాండో చిన్నప్పదేవర్ అమితంగా అభిమానించేవారు. ఎంతగా ప్రేమించేవారంటే ... తన చిత్రానికి శ్రీ దాసరిని దర్శకుడుగా ఎంపికచెయ్యడం వరకు.

ఒకరోజున శ్రీ దేవర్‌ను, యీ విలేఖరి ఒక ప్రశ్న అడిగాడు. మీ కుటుంబ సభ్యులందరు దర్శకులుగా పేరు గడించారు కదా. మరి, శ్రీ దాసరిని ఎంపికచెయ్యడం ఎలా జరిగింది?

''నిజమే. శ్రీ దాసరి కష్టజీవి. రోజుకు యిరవైగంటలు పని చేసే శ్రామికుడు. వృత్తి తప్ప మరో ధ్యాసలేని మనిషి. అందుకే ఆయన్ను దర్శకుడుగా ఎంపికచేశాను,'' అన్నారు దేవర్.

''నేను ... దాసరిగారిని అమితంగా లైక్ చెయ్యడానికి మరో కారణం ... ఆయన స్పైక్ స్పిరిట్,'' అన్నారు దేవర్.

రావణుడే రాముడయితే?

లక్ష్మీ ఫిలిం కంబైన్స్ నిర్మిస్తున్న ''రావణుడే రాముడయితే'' స్కోప్ వర్ణ చిత్రంపై ... ప్రేక్షకులు చాలా హోప్స్ పెట్టుకున్నారు. ఎందుకో తెలుసా? ఆ చిత్రం తాలూకు స్టిల్సు ఎంతో ఆకర్షణీయంగా వున్నాయి గనుక. మకుటంలో గమ్మత్తయిన ఆకర్షణ వుంది గనుక.

శ్రీ అక్కినేని ... శ్రీ దాసరి కాంబినేషన్‌లో కొత్తదనం వుంటుంది గనుక.

''రావణుడే రాముడయితే'' స్కోప్ వర్ణ చిత్రానికి ఆఖరి షెడ్యూలు సెప్టెంబర్ 16న ప్రారంభమైంది. ఈ సంచిక పాఠకుల్ని అందేసరికి ... చిత్ర నిర్మాణం పూర్తి అవుతుంది కూడా. శ్రీమతి అనురాధాదేవి నిర్మిస్తున్న యీ కొత్తతరహా సాంఘిక చిత్రానికి శ్రీ దాసరి రసవత్తరమైన కథను సమకూర్చారు.

శ్రీ అక్కినేని ''మాస్'' పాత్రలో, కొత్తతరహా అభినయాన్ని ప్రదర్శిస్తున్న ''రావణుడే రాముడయితే'' స్కోప్ వర్ణ చిత్రంలో జయచిత్ర, లత టీ అమ్మే అమ్మాయిలుగా నటించడం ... గమనార్హం.

ఈ చిత్రంలో మురళీమోహన్ చిత్రకారుడుగా నటిస్తున్నారు. ఇంకా మోహన్‌బాబు, మాడా, కె. వి. చలం, ప్రభాకరరెడ్డి, అల్లురామలింగయ్య ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు.

ఈ చిత్రాన్ని డిశంబరులో విడుదలచేసి, జనవరి నుంచి మరో చిత్రాన్ని శ్రీ దాసరి చిత్రీకరణలో ప్రారంభించే ఉద్దేశ్యాన్ని, నిర్మాత అనురాధాదేవి వెల్లడించారు.

''నల్లటి వస్త్రం ధరిస్తే, అది నష్టానికి చిహ్నమని చాలామంది అనుకుంటారు. కానీ నా విషయంలో అది నిజంకాదు. నేను ఏనాడు నల్లదుస్తులు ధరించినా నాకు మంచే జరిగింది, జరుగుతూంది. విజయం చేకూరాలనుకున్నప్పుడు విధిగా నల్లదుస్తులు ధరించడం నా సెంటిమెంటు'' అంటుంది జయసుధ.

జయలక్ష్మి

''నిద్రలేవగానే ''అమ్మ'' ముఖం చూడడం నా సెంటిమెంటు. షూటింగ్‌కని వూరెళ్లినప్పుడు తప్ప, వూర్లో వున్న రోజుల్లో ఏ ఒక్కరోజు అలా జరక్కపోతే, పచ్చిమంచినీళ్లు కూడా ముట్టుకోను'' అంటుంది ఫటాఫట్ జయలక్ష్మి.

శ్రీధర్

''ఆరోనంబర్ మీద నాకో గురి అదే పట్టింపు. అందుకే నా ఇంటి నెంబరు 6, నా ఫోన్ నెంబరు (అంకెలన్నీ కూడితే) ఆరు. నూరు ఆరైనా, ఆరు నూరైనా, ఈ ఆరును మాత్రం వదల కూడదనేదే నా సెంటిమెంటు'' అంటారు శ్రీధర్.

రంగనాథ్

''నాకు సెంటిమెంట్స్ అంటూ స్పెషల్‌గా ఏమీ లేవు. మాటమీద నిలబడడమే నా ముఖ్యమైన సెంటిమెంటు. ఇదొక్కటి చాలు అన్నింటినీ కవర్ చేయడానికి, రిపేర్ చేయడానికి.'' అంటారు రంగనాథ్.

చంద్రమోహన్

''ప్రాతఃకాలాన భగవంతుడికి పూజ చేసిగానీ, మారు పనికి పూనుకోకపోవడం నా సెంటిమెంటు. ఇంట్లో వున్నా, షూటింగ్‌కని వూరెళ్లినా, ఆ దేవుడ్ని 10 నిమిషాలు ధ్యానించిగానీ ఏ పని చేయను నేను. ఆ సమయంలో నన్నెవరు డిస్టర్బ్ చేసినా నేను సహించలేను.'' అంటారు చంద్రమోహన్.



'రిషి రాజ్'లో
జయమాలిని

సి ని మా

స్వగృహంలో పుట్టినరోజు జరుపుకోబోతున్న జయసుధ

కృషితో చిత్ర చిత్ర ప్రవర్ధమానమవుతున్న కుమారి జయసుధకు ... పరిశ్రమలో అగ్రనటి తరువాతి స్థానం లభించింది. ప్రతిభతో రాణిస్తున్న జయసుధకు ... ఎప్పటికీ అపజయం జరగదు. నటనా సామర్థ్యంతో బాటు ... క్రమశిక్షణను పాటిస్తున్న యువనటికి ... రాబోయే సంవత్సరాలు మంచి ఫలితాలను ఇవ్వగలవు.

డిశంబరు 17 న జయసుధ పుట్టి ... 19 ఏండ్లు అయినాయి. ఈ డిశంబరు 17 కు ఒక ప్రత్యేకత వుంది. అదేమిటన.

వాణీ మహల్ సమీపాన గల గిరి వీధిలోని ఒక అందాల భవంతిని, జయసుధ కొన్నట్టు తెలిసింది.

ఈసారి పుట్టినరోజు పండుగ ... అత్యంత వైభవంగా జరుగుతుందని ఈ కలం ఆశిస్తోంది.



'కటకటాల రుద్రయ్య'లో ఒక సన్నివేశం

అన్నపూర్ణా స్టుడియోస్ చిత్రాలు

డాక్టర్ నాగేశ్వరరావు కథానాయకుడుగా నటించనున్న భారీ వర్ణ చిత్రాన్ని,

శ్రీ అక్కినేని లేకుండా మరో లఘుబడ్జెట్ చిత్రాన్ని ఏ. ఏ. కంబైన్స్ తలపెట్టినట్టు వార్త

ప్రముఖ రచయిత్రి శ్రీమతి సులోచనారాణి విరచితమైన "కీర్తి కిరీటాలు" నవలకు నాయకుడుగా శ్రీ అక్కినేని పాత్రపోషణ గావించే చిత్రం, జనవరి నుంచి ప్రారంభం కాగలదని తెలిసింది.

మరో చిత్రం నవంబరులో ప్రారంభం అవుతుందని తెలిసింది.

ఏ. ఏ. కంబైన్స్ ప్రతి సంవత్సరం ఒక భారీ చిత్రాన్ని, ఒక లఘు చిత్రాన్ని నిర్మిస్తుంది.

తొలి షెడ్యూలు ఇరవై ఒక్క రోజులు

"ఇదెక్కడి న్యాయం" చిత్ర నిర్మాత శ్రీ జగదీష్ చంద్రప్రసాద్, శ్రీ లలితా ఎంటర్ ప్రైజస్ పతాకంపై రంగులలో నిర్మిస్తున్న "కోరికలే గుర్రాలయితే" చిత్రం... ఆగస్టు యిరవై నాలుగున ప్రారంభమై... వరుసగా యిరవై ఒక్క రోజులు జరిగింది.

తొలి షెడ్యూలు పూర్తయిన రోజున, నిర్మాత శ్రీ జగదీష్ చంద్రప్రసాద్, అడయారు అరసు స్టుడియోలో పత్రికలవాళ్లను ఆహ్వానించి... తేనీటి విందు నిచ్చారు.

దర్శక... కథకుడు శ్రీ దాసరి "కోరికలే గుర్రాలయితే" చిత్రం గూర్చి క్లుప్తంగా వివరిస్తూ... స్వర్గం—నరకం తరువాత కథానాయిక జయలక్ష్మికి ఘనకీర్తిని యీ చిత్రంలోని పాత్ర తేగలదని తెలిపారు.

మొదటి షెడ్యూలులో ఒక పాటను చిత్రీకరించినట్టు, యిన్‌డోర్‌కు సంబంధించిన సన్నివేశాలు పూర్తయినట్టు అగ్రదర్శకుడు చెప్పారు.

"కోరికలే గుర్రాలయితే" చిత్రంలో ఆరు పాటలున్నాయని, అయిదు పాటలను అక్టోబరులో జరిగే అవుట్‌డోర్‌లో చిత్రీకరించడానికి వుద్దేశించామని, దర్శకుడు శ్రీ దాసరి తెలిపారు. ఒక యుగళ గీతాన్ని చంద్రమోహన్... జయలక్ష్మి, మరొక ప్రేమ గీతాన్ని మురళీమోహన్... ప్రభ, మూడవ దానిని మోహన్‌బాబు... రమాప్రభ, ఒక పాటను చంద్రమోహన్, వేరొక పాటను జయమాలిని పైన చిత్రీకరణ జరుగుతుందని, దాసరి చెప్పారు.

ఈ చిత్రంలో పైన కనిపించే పేర్లుగాక, యింకా నిర్మల... కాంతారావుగార్లు ప్రధాన పాత్రలను పోషిస్తున్నట్టు, నిర్మాత శ్రీ జగదీష్ చంద్రప్రసాద్ చెప్పారు.

అన్నపూర్ణా ఫిలింస్ ద్వారా... నవంబరులో విడుదలకు వుద్దేశించబడిన యీ చిత్రానికి సత్యం సంగీతాన్ని, కె. ఎస్. మణి ఛాయాగ్రహణాన్ని, దుర్గా... నాగేశ్వరరావు కో–డైరెక్షన్ను, కోడి రామకృష్ణ సహదర్శకత్వాన్ని, రమేష్‌చంద్ర నిర్మాణతను నిర్వహిస్తున్నారు.

జయంతి

"శారద" చిత్రం విడుదలయ్యాక, ఆ చిత్రంలో నటించిన జయంతికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. "సాఫ్టు కారెక్టర్స్ చేయడంలో జయంతికో స్పెషాలిటీ వుంది. ఆమైతేనే అలాంటి పాత్రలకు పూర్తి న్యాయం చేస్తుంది" అని పరిశ్రమ, ప్రజ జయంతిని మెచ్చుకుంది. బలమైన కారణాలు లేవుగానీ, జయంతి తెలుగు చిత్రాల్లో కన్పించడం అరుదై పోయింది మొన్న మొన్నటివరకు. నటనా సామర్థ్యం వున్న జయంతి లాంటి నటికి అంత గ్యాప్ రావడం శోచనీయమే. "బొమ్మరిల్లు" చిత్రంలో ఒక పక్కాటి పాత్రనిచ్చి "జయంతి" లాంటి ఈజ్ వున్న నటిని మరచిపోకండి అని గుర్తుచేసారు విజయబాపినీడు. "బొమ్మరిల్లు" ఘనవిజయం సాధించిన పిదప "జయంతి" బిజీ అవుతూందనే చెప్పాలి. సత్యచిత్రవారి "కుమారరాజా" చిత్రంలో హీరో కృష్ణతో, ప్రతాప్ రాఘవగారి "అంతులేని వింతకథ"లో ఒక ముఖ్య పాత్రలో నటిస్తూంది జయంతి. మరికొన్ని కొత్త చిత్రాల్లో కూడా జయంతి నటించే అవకాశాలు కన్పిస్తున్నాయి.



'కుమార రాజా'లో
జయప్రద, కృష్ణ

సినిమా

సుభాషిణికి శుభయోగం

కోరి వరించే అదృష్టాన్ని ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు. అదృష్టం అందరినీ వరించదుకూడా. అలాంటి అదృష్టానికి నోచుకున్న చిన్నారియే సుభాషిణి.

అగ్ర దర్శకుడు శ్రీ దాసరి పరిచయం చేసిన సుభాషిణి "శివరంజని" విడుదల గాకుండానే, అందరి దృష్టిని ఆకర్షించడం, ఆమె చేసుకున్న అదృష్టమే, మరి.

ఇప్పుడు సుభాషిణి శ్రీధర్‌గారి చిత్రంలో, మారుతీ ప్రొడక్షన్స్ చిత్రంలో, కౌముదీ పిక్చర్స్ చిత్రంలో నాయిక పాత్రలను పోషించడం... గమనార్హం.

"శివరంజని" తరువాత "కళ్యాణి"

రాగాలలో శివరంజనికి ఎంత ప్రాముఖ్యత వుందో, కళ్యాణి రాగానికీ అంత విశిష్టత వుంది.

అంత విశిష్టత వున్న "కళ్యాణి"ని, మన "ప్రజా దర్శకుడు' తన చిత్రీకరణలో, శ్రీ లక్ష్మి నరసింహా యింటర్నేషనల్ తలపెట్టిన వర్ణ చిత్రానికి పెట్టారు.

సెప్టెంబరు 15న, మధ్యాహ్నం మూడున్నర ప్రాంతాన, జెమినీ రికార్డింగు థియేటరు సినిమా ప్రముఖులతో అలరారింది.

ముహూర్తానికి విచ్చేసిన ప్రతి వ్యక్తినీ, నిర్మాత ఎం. కె. మావుళ్లయ్య, అగ్రదర్శకుడు దాసరి సాదరంగా ఆహ్వానించి... వారందరిచేత కొబ్బరికాయలను కొట్టించి... దీవెనలు పొందారు.

"శివరంజని" చిత్రంలో సుభాషిణికి ముఖ్య పాత్రనిచ్చి ప్రోత్సహించిన శ్రీ దాసరి...మావుళ్లయ్య తలపెట్టిన "కళ్యాణి" చిత్రంలో సుభాషిణికి టైటిల్ పాత్ర నివ్వడం... గమనార్హం.

ప్రతిభ వున్నవాళ్లకు, శ్రీ దాసరి ఎప్పుడూ "ఫర్"గానే వుంటారనడానికి... "కళ్యాణి" పాత్రను వుదాహరణగా పేర్కొనాలి. శ్రీరామ నవమి... గణపతి నవరాత్రుల సందర్భాలలో జరిగే వీధి నృత్యాలపై అల్లబడిన ఓ కమనీయ కథే "కళ్యాణి" చిత్రానికి మెయిన్ థీమ్, అన్నారు దర్శక... కథకుడు శ్రీ నారాయణరావు.

"కళ్యాణి" వర్ణచిత్రానికి సత్యం సంగీతాన్ని, కె. ఎస్. మణి ఛాయాగ్రహణాన్ని, భాస్కరరాజు శిల్పాన్ని బాలు కూర్పును, రమణబాబు ... హరిశ్చంద్రరావు సహదర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు. శ్రీ అన్నారావు నిర్మాణత.

అక్టోబరులో తొలి షెడ్యూలు, నవంబరులో మరి షెడ్యూలు జరుగుతుందని, నిర్మాత మావుళ్లయ్య తెలిపారు.

శ్రీధర్ కొత్త ప్రయత్నం

హీరో శ్రీధర్ క్రొత్తరంగాన్ని ప్రవేశించారు. విశేషమేమిటంటే ఆ రంగంకూడా సినిమాకు సంబంధించినది కావడమే. కృష్ణంరాజుగారు, శ్రీధర్‌గారు నటించిన "రాముడు – రంగడు" చిత్రానికి సంబంధించిన కృష్ణా జిల్లా హక్కులను హీరో శ్రీధర్ కొనుక్కున్నారు. "రాముడు – రంగడు" చిత్రం నాకు నచ్చింది. డబ్బు లొస్తాయనే నమ్మకం కలిగింది. నా నమ్మకాన్ని నిజంచేసుకునే నిమిత్తమే ఈ క్రొత్త ప్రయత్నం" అన్నారు శ్రీధర్. పేరాశలేని పెద్దమనిషి శ్రీధర్ చేస్తున్న ఈ క్రొత్త ప్రయత్నానికి ప్రేక్షకుల ఆశీర్వాదం తప్పకుండా లభిస్తుంది.


మద్రాసులోని ప్రముఖ సాంస్కృతిక సంస్థ "కళాసాగర్" 1977 వ సంవత్సరానికి హీరో శ్రీధర్‌ను ఉత్తమ నటుడిగా ఎన్నుకుంది. "తరం మారింది" చిత్రంలో చక్కగా నటించినందుకు గానూ ఈ అవార్డు వచ్చింది. ఉత్తమ నటుడిగా ఎన్నుకోవడమన్నది ప్రధానంకాదు, ఏ చిత్రంలో నటించినందుకు ఆ అవార్డు నిస్తున్నారన్నదే ముఖ్యం. ఆ విషయంలో "కళాసాగర్" చాలా కరెక్ట్ అనడానికి "తరం మారింది" చిత్రంలో నటించిన శ్రీధర్‌ను బెస్ట్ యాక్టర్‌గ ఎంపిక చేయడమే తార్కాణం.

– జనప్రియ ★


ఈ 8 కారణాలకోసం...
అవతలనుండి
పొందించు మూత,
ఎక్కువ వండే స్థలావకాశం
అతి సులభముగా
ఉపయోగించుటకు మరియు
సురక్షితానికైపొందపరచబడింది
సాటిలేని సేఫ్టి వాల్వ్,
మూడువిధాలుగా
రక్షించుతుంది
ఎక్కువ దార్ఢ్యం మరియు
దప్పంగానున్న అడుగు ఎక్కువ
కాలం వాడటానికి హామి
Prestige
ఐ. ఎస్. ఐ. మార్కు :
గుణవిశేషాలకు హామి
ఆహారంయొక్క
సత్వాంశములనూ, వాటి
సువాసననూ కాపాడుతుంది
దేశం నలుమూలల్లోనూ
సర్వీస్ కేంద్రాలు
4 లీటర్లనుండి 12 లీటర్ల వరకు
వివిధ సైజులు
భారతపు ప్రథమ ప్రెషర్ కుకర్
నేడు కూడా విపులంగా
ఉపయోగింపబడుతున్నది
Prestige
ప్రెస్టీజ్
టి టి. (ప్రైవేట్) లి.
బెంగళూరు–560016

MCA/TT/50-Tel

☼ జి. వి. జి. పేజీ ☼



మన ఊరి పాండవులు

ఇంటి ముందు శాంతమ్మ (ఝాన్సీ) పేడ్నీళ్ళు చల్లుతోంది. దొరగారు (రావుగోపాలరావు) రావడంతోటే సంభ్రమంతో "అరే! అన్నయ్యా! రా ... రా ... దారి తప్పొచ్చినట్లున్నావ్?" అంది. "దారెతుక్కునే వచ్చానమ్మా. మీరంతా ఏమనుకున్నా నా గుండె అంత పాషాణం కాదులే. రక్తసంమంధం తెంపుకుంటే తెగుతుందా? మొన్న రాత్రి మీ ఆయన కల్లోకొచ్చి, నా కొడుకు సంగతేంజేశావ్ బావా – అన్నాడు. ఏం జెప్పను? ఇదిగో – పట్నవాసాన ఫాక్టరీలో ఉజ్జోగం జూశా. ఇదిగో సిఫార్సుత్తరం. ఓ నెల తిండికిదిగో వందరూపాయిలు. ఈరోజు మంచిది. వెంటనే యెళ్ళమను," అన్నాడు దొర. ఇంతలో పార్థు (చిరంజీవి) తటాలున వచ్చి ఉత్తరం లాక్కొని, "థూ!" అని ఉమ్మేస్తూ, "అక్కర్లేదు. మాకా దయాధర్మాలక్కర్లేదు!" అంటూ ఉత్తరాన్ని చింపిన ముక్కలను దొర మీద పడేశాడు. దొర ఎగాదిగా చూశాడు. కోపం నిగ్రహించుకున్నాడు. నెమ్మదిగా లేచాడు. "మామయ్య కష్టపడి తెచ్చాడురా ఉజ్జోగం!" అంది శాంతమ్మ. "తెచ్చింది పట్టుకుపొమ్మను. అది మనమీద ప్రేమేం కాదులే. ఆ సంగతాయనకి బాగా తెలుసు. నాన్నని గోతిలో దించి, మన ఆస్తి అంతా కాజేసి, ఇవేళ ముష్టి వేస్తున్నాడు. ఈ నాటకమంతా నన్ను ఊర్లోంచి వెళ్ళగొట్టించడానికి. ఇలాంటి దగుల్బాజీ దగాకోరు..." అంటూ ఆవేశంతో పేడనీళ్ళు తీసి, దొర మీద పోశాడు. దొర తీవ్రంగా "శాంతమ్మా! వీడు నీ కొడుకు గనక బతికిపొయ్యాడు. ఈ మాటలు జనం వింటే కాళ్ళిరగ్గొట్టి కైమా కొట్టేస్తారు. అప్పుడు నా పూచీ ఏమీ అడక్కు!" అని విసురుగా వచ్చినదారినే వెళ్ళిపోయాడు.

బాపు దర్శకత్వంలో కృష్ణంరాజు సమర్పించే జయకృష్ణా మూవీస్ "మన ఊరి పాండవులు" వర్ణ చిత్రానికి జయకృష్ణ నిర్మాత.

మరో కొత్త దర్శకుడు


శ్రీకాంత్ ప్రొడక్షన్స్ "పెన్ని" చిత్రానికి బి. ఎ. సుబ్బారావు వద్ద సహాయ దర్శకుడుగా సినిమా రంగంలో 1966 లో ప్రవేశించిన సి. గంగాధర్ బి. ఏ. (లిట్) 1974లో కృష్ణంరాజు, శారద నాయకా నాయికులుగా శ్రీ సుందర్‌లాల్ నహతా సహకారంతో ఒక చిత్రానికి దర్శకత్వం వహించాల్సింది కాస్తలో తప్పిపోయింది. ఆ విషయం గురించి ఆయన ఇటీవల కనిపించినప్పుడు వివరిస్తూ, "నావ తుఫానులో చిక్కింది. స్క్రిప్టు సిద్ధం చేసుకుని, ఒక పాట రికార్డు కూడా చేసుకొని, షూటింగ్‌కు వెళ్లలేక నీళ్ళు మూల్గే నన్ను మేఘావృతమైన నిశీధిలో కళ్ళున్న కబోదిని చేసింది. ఆ తర్వాత నేను ఏమయ్యాను? ఏమవ్వాలి? అలమటించాను. మద్రాసు వించి వెళ్లాలన్నా మనసొప్పదు... మనిషి తల వంచలేదు. తల దించనూలేదు. మరి ఎలా – అని కొట్టుమిట్టాడుతూండగా, సుందర్ ప్రొడక్షన్స్‌వారి మురళీకృష్ణగారు రావడం, వెంటనే హైదరాబాద్‌కు తీసుకెళ్లడం, కథ ఎన్నుకోడం, సినిమా తీయడం – అంతా 27 రోజుల్లో కలలా జరిగిపోయింది" అంటూ ఆ చిత్రం గురించి వివరించారిలా: "ఏ. శ్రీరాంరెడ్డి గారిచ్చిన ఐడియాతో కథ, స్క్రీన్‌ప్లే తయారు చేసి నేను దర్శకత్వం వహించిన 'సినిమా గోల' అనే చిత్రంలో హైదరాబాద్‌కు చెందిన రంగస్థల నటీనటులే పాల్గొన్నారు. గన్నిశెట్టి వెంకటేశ్వరరావు మాటలు రాశారు. ఎన్. ఆర్. కె. మూర్తి ఛాయాగ్రాహకుడు. పి. సాంబశివరావు ఎడిటరు. జి. సంగయ్య నిర్మాత. సినిమా పేరుతో లోకాన్నీ, ప్రజల్నీ – కళ పేరుతో యువ నటీనటులలో, వారి జీవితాలతో చెలగాటమాడుకుంటూ, దగా చేస్తూ, సినిమా పరిశ్రమకే కళంకం తెస్తూన్న ఓ బోగస్ కంపెనీని ప్రభుత్వం పసిగట్టి, దోషులను శిక్షించడమే ఈ చిత్రంలోని ఇతివృత్తం."

'రామచిలక'లో వాణిశ్రీ

'కరుణామయుడు'లో విజయచంద్ర




దేనితోనూ సరిపోల్చలేని ఆ లావణ్యం.
మృదువైన. సుకుమారమైన. సహజ సౌందర్యం.


LUX


LUX
SUPREME

జి. వి. జి. పేజీ



ఎస్.బి.యస్. వారి తొలి రంగుల చిత్రంలో కమల్‌హాసన్, జయసుధ

ఎన్. టి. ఆర్. ఫాన్ జయసుధ లాయర్ విశ్వనాథ్‌లో

వాహినీ స్టూడియోలో హాస్పిటల్ సెట్ ... గాయాలకు కట్లతో వున్న గీత (జయసుధ)ను పరామర్శించడానికి వచ్చిన విశ్వనాథ్ (ఎన్.టి.ఆర్.) ''నాకోసం మీరు...'' అంటూ జాలిగా చూశాడు.

''స్టాప్ ... ప్రాణాన్ని పణంగా పెట్టాను. అంతేగా మీరు చెప్పబోయేది? నాన్సెన్స్ ... అనుకోకుండా బులెట్‌కి అడ్డంపడ్డాను. నా ఫేవరిట్ హీరోను దక్కించుకోగలిగాను. యు నో...అయామ్ ఎ డాన్సింగ్ స్టార్. లోకమంతా నా ఫాన్స్. నేను మీ ఫాన్‌ని. కూర్చోండి,'' అంది గీత నవ్వుతూ.

''ఇంత గాయపడ్డాకకూడా యిలా నవ్వుతూ మాట్లాడగలుగుతున్నారంటే...''

''మై డియర్ సార్! కొన్ని గాయాలు బయటికి కనిపిస్తాయి. కొన్ని కనిపించవు. ఇంతకంటే పెద్దగాయాలు నాకిదివరకే తగిలలేదని ఏమిటి మీ నమ్మకం? ఆహా — గాభరాపడకండి. నా కష్టాలు వర్ణించి భోరుమని ఏడవనులెండి.''

''అసలు నేనంటే మీకెందుకు అభిమానం?''

''సింపిల్ సార్! ఎవరో మిమ్మల్ని చంపాలనుకొన్నారు కనుక ... ఓ రకం మనుషుల్నే ఈ ప్రపంచం చంపుకోంటుంది — చాలా మంచివాళ్ళని, చాలా దుర్మార్గుల్ని.''

''మీకెలా తెలుసు?''

''నాకా? నా ఒక్కతెకే తెలుసు. ఒకరిని రక్షించుకున్నాను. మరొకరిని పోగొట్టుకున్నాను.''

''ఎవరా మరొకరు?''

''మై డాడీ ... ఓ ... ఏం తీసుకుంటారు? కాఫీ, టీ, కోకో...''

''మిమ్మల్ని చూడాలని వచ్చాను. మీ ఆతిథ్యం కోసం కాదు ... చూశాను. వస్తాను.''

''అయితే, తరచు యిలా చూస్తూండండి. ఐమీన్ — సానుభూతి చాలా ఖరీదైన వస్తువు సార్. ఈ జీవితంలో నాకు దక్కని వస్తువు ... చూడండి! మిమ్మల్ని చంపాలనుకున్న తుపాకీ ఎటువేపునించి పేలిందో నాకు తెలుసు. నేను డాన్సర్‌ని. గొప్పవాళ్ళ బతుకులూ, బుద్ధులూ అన్నీ నాకు తెలుసు. మీలాంటివాళ్ళు బతికివుండడం ఎవరికి నష్టమో నాకు తెలుసు.''

''ఎవరు? ఎవరు నన్ను చంపాలనుకున్నది?''

''జి ఎన్ కె.''

విస్తుపోయాడు విశ్వనాథ్.

వాహినీ, ఎ. వి. ఎం. స్టూడియోలలో తయారౌతున్న రవి చిత్ర ఫిలిమ్స్ ''లాయర్ విశ్వనాథ్'' స్కోప్ కలర్ చిత్రం నిర్మాత వై. వి. రావ్. ''ఈ చిత్రానికి చాలా సెట్స్ వేయించవలసి వచ్చింది. ఒక్కోసారి ఒకే స్టూడియోలోనే రెండు మూడు సెట్స్ వేసి ఒకేరోజు షూట్ చేశాం,'' అన్నారు దర్శకుడు ఎస్.డి. లాల్. ఇతర నటవర్గం: రంగనాథ్, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, అల్లు రామలింగయ్య, కాంతారావు, రాజనాల, శరత్‌బాబు, రమణమూర్తి, ముక్కామల, ధూళిపాళ, సాక్షిరంగారావు, మాడా, కె. వి. చలం, త్యాగరాజు, ఎం. పి. ప్రసాద్, పొట్టిప్రసాద్, కె. కె. శర్మ, బాలకృష్ణ, ప్రేమ్‌కుమార్, హనుమంతాచారి, జగ్గారావు, మనోహర్, విజయకుమార్, ప్రభాకర్, పెమ్మసాని రామకృష్ణ, గరగ సూర్యనారాయణ, కవిత, సుజాత, జయవాణి, పండరీబాయి, పుష్పకుమారి, విజయభాను, వి. విజయలక్ష్మి. సాంకేతికవర్గం: గొల్లపూడి, ఆరుద్ర, సి. నారాయణరెడ్డి, సత్యం, పి. దేవరాజ్. బి. చలం, డి. రాజగోపాలరావు, కృష్ణకిశోర్‌రెడ్డి, కత్తుల గోపాలకృష్ణ, వి. సుందరం, పి. రఘురాం,

"మై ఫేర్ లేడీ" కథాకమామిషు

అసలు ''మై ఫేర్ లేడీ'' చిత్రానికి మూలం ''పిగ్మాలియన్'' అనే జార్జ్ బెర్నార్డ్ షా రచన. రెక్స్‌హారిసన్, ఆడ్రీహెప్‌బర్న్‌లతో తయారైన ఆ ఆంగ్ల చిత్రం విడుదలైన ప్రతిచోటా విజయవంతంగా నడిచింది. దాని ఆధారంగా ఎన్. సి. సిప్పీ, గుల్జార్, ఎన్. బి. కామత్‌లు హిందీలో తీయాలని ఆలోచిస్తూండగా ప్రేమ్‌సాగర్ ''ప్రేమ్ పూజారిణి'' పేరున 5 రీళ్ళ వరకు తీశాడు. దిలీప్‌కుమార్, సైరాబానులతో డైరెక్టర్ చంద్రబరోత్ అదే చిత్రాన్ని కొన్ని మార్పులతో కొంతవరకు తీశాడు. దేవ్ ఆనంద్, టినామునీమ్‌లతో బాసు చటర్జీకి కూడా తీయాలని ఉంది. తెలుగులో ఎ. ఎన్. ఆర్., జయప్రదలతో సుందర్‌లాల్‌నహతా తీయదలచినట్లు తెలుస్తోంది. ''పిగ్మాలియన్'' కన్నా అదే ఛాయలు గల ''ది ప్రిన్స్ అండ్ ది షో గరల్'' చిత్రం ఎంతో బాగుంటుంది. మేరిల్‌మన్రో నిర్మించిన ఆ చిత్రంలో ఆమె పక్కన సర్‌లారెన్స్ ఒలీవియర్ నాయకుడుగా నటించడమే కాకుండా ప్రతిభావంతంగా దర్శకత్వం కూడా నెరపాడు.



'మా యింటి దేవత'లో
కృష్ణ, శాంతకుమారి, హరనాథ్

ప్రమోషన్‌కోసం పడరానిపాట్లు సీతాపతి సంసారంలో

"ఆఫీసు పక్కనన్నా ఇల్లు తీసుకో. లేకపోతే, మీ ఇంటి పక్కనున్న ఏ ఆఫీస్ అయినా చూసుకో. అంతేగాని, యిలా లేటుగా వస్తే మాత్రం వూరుకోను," అని క్రితంరోజు కోప్పడ్డ మేనేజర్ (చక్రవర్తి)ని మెప్పించి, ప్రమోషన్ సంపాదించడానికి ఆ మర్నాడు సీతాపతి (చంద్రమోహన్) ఆఫీసుకు వెళ్లగానే మేనేజర్ గదిలో ఆయనతోపాటు వన్నెల విసనకర్రలా వున్న ఆయన మూడో భార్య (విజయవాణి)ని చూసి, "అహా ... అహా ... ఏమి నా అదృష్టం! అమ్మగారు కూడా యిక్కడే వున్నారు. ఈవేళ నేను లేచిన వేళావిశేషం చాలా మంచిది. ఏంలేదు సార్! రేపు ఆదివారంనాటికి నాకు పెళ్ళయి అయిదేళ్ళు నిండుతాయి," అన్నాడు.

"అలాగా? యావజ్జీవ కారాగరశిక్షలో అయిదేళ్ళు పూర్తయ్యాయన్నమాట? సీతాపతీ! ఈ దేశానికి నేను గనక ప్రధానమంత్రి అయితే, ఒక పెళ్ళి అయిదేళ్ళవగానే — దానంతటదే రద్దు అయిపోయేలా ఏక్టు తీసుకువస్తాను. అయిదేళ్ళవగానే ఇంకో భార్య ... ఇంకో పెళ్ళి..." అన్నాడు మేనేజర్.

"అహా! అద్భుతం సార్! యిలాంటి ఐడియాలు మీకు గాక ఇంకెవరికొస్తాయి సార్! తమరు వుండవలసిన స్థానమే వేరు."

"అలాగా?"

"అలాగా — అని యెంత అందంగా అన్నారు, సార్! ఈ లోకంలో ఇంకెవ్వరూ అంత స్వీట్‌గా అనలేరు సార్!"

"ఇంతకీ, విషయం ఏమిటి?"

"ఆదివారంనాడు మా యింట్లో మీకు డిన్నర్ ఏర్పాటు చేశాము. మీరిద్దరూ తప్పకుండా రావాలి. రానంటే, ఈ ప్లగ్‌లో వేలు పెట్టి చచ్చిపోతాను," అన్నాడు సీతాపతి.

"ఇంత ఇదిగా పిలిస్తే, ఏ మేనేజర్ ఒప్పుకోకుండా వుంటాడు?" అన్నాను నేను ఆ షాట్ తర్వాత డైరెక్టర్ ఎం.ఎస్. కోటారెడ్డితో. ఎం. రామకృష్ణారెడ్డి సమర్పించే శ్రీ రామకృష్ణా కంబైన్స్ "సీతాపతి సంసారం" చిత్రానికి ఎం. సుబ్బరామిరెడ్డి, కె. శంకరరెడ్డి నిర్మాతలు.

కంచికి చేరని కథ

చిలకలూరిపేటకు సమీపంగా ఉన్న నాగభైరవ పాలెంలో ఒక పెద్ద చెరువు, దాని పక్కన బారులు తీరిన ఇళ్ళు — ఎంతో ముచ్చటగా ఉందా గ్రామం. అక్కడ ఆగస్టు 31న శ్రీ రామకృష్ణా సినీ ఎంటర్‌ప్రైసెస్‌వారి "కంచికి చేరని కథ" చిత్రానికి ప్రారంభోత్సవం జరిగింది. పూర్ణా పిక్చర్స్ జి. విశ్వనాథ్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ చిత్రానికి సంభాషణలు రాసిన ఆరుద్ర తొలి క్లాప్ కొట్టారు. నాయికా నాయకులు అభిలాష, సుధాకర్ ముహూర్తం షాట్‌లో పాల్గొన్నారు. ఈ చిత్రానికి మూలమైన కె. పతంజలిశాస్త్రి, వి. ఎస్. రామేశ్వరరావులు రాసిన "కంచికి చేరని కథ" నాటిక ఆకాశవాణిలో 14 భాషలలో అనువదింపబడి ప్రసారమవడమే కాకుండా ఇటలీలో ఉత్తమ నాటికగా పాతిక వేల రూపాయల బహుమతిని పొందిందని కూడా తెలియజేశారు ఈ చిత్ర నిర్మాతలు పి. పి. హరి, బి. కోటేశ్వర రావు. "నవసమాజంలో బ్రతుకుతెరువుకు పడుచు పిల్లలు పడే అగచాట్లు సరికొత్త కోణంలో చూపబడుతుంది చిత్రంలో" అన్నారు డైరెక్టర్ పురాణం సుబ్రహ్మణ్యం. ఒక విశిష్టమైన నాటికను పాత కొత్త నటీనటుల సమ్మేళనంతో కొత్త పంథాలో చిత్రీకరించడానికి పూనుకున్న ఈ చిత్ర నిర్మాతలు ఎంతైనా అభినందనీయులు. ఎం. పి. ప్రసాద్, రాళ్ళపల్లి, జి. ఎస్. ఆర్. మూర్తి, యర్రంనేని చంద్రమౌళి, భాషా, రాజా, బజ్జీల్లా, చైతన్య, శ్రీలక్ష్మి, జయవిజయతోపాటు ప్రధాన భూమికల్లో ప్రభాకరరెడ్డి, మోహన్‌బాబు, కూడా పాల్గొంటున్నారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, ఆరుద్ర గీతాలు రాశారు. కృష్ణప్రసాద్ తొలిసారిగా సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్. ఆర్. కె. మూర్తి ఛాయ, ఆత్మ కూర్పు, సోమనాథ్ శిల్పం, కె. వి. ఆంజనేయులు నిర్వహణ — సహదర్శకత్వం, ఇంద్రనారాయణ సహకార దర్శకత్వం వహిస్తున్నారు. సెప్టెంబర్ 25కు షూటింగ్ ముగిసే ఈ చిత్రం నవంబర్ విడుదల. ప్రొడక్షన్: దొండపాటి శ్రీనివాస్.



'రావణుడే రాముడైతే'లో అక్కినేని



* జి. వి. జి. పేజీ *

కుమారరాజాలో మాస్క్ షాట్

మాస్క్ షాట్ యెంతో క్లిష్టమైనది ఎంతో ఓపిక, శ్రద్ధ, జాగరూకత అవసరం. రోజా కృష్ణ త్రిపాత్రాభినయంలో సత్య చిత్ర అధినేతలు సూర్యనారాయణ, సత్యనారాయణ స్కోప్ కలర్‌లో నిర్మించే "కుమారరాజా" చిత్రానికి హీరో కృష్ణ కుమార్, జైరాజ్ పాత్రలలో కనిపించే చిత్రీకరణకు ముందు ఛాయాగ్రాహకుడు వి. ఎస్. ఆర్. స్వామి మాస్క్ ఏర్పాట్లు చేస్తున్నారు. అప్పుడు హీరో కృష్ణకు డైరెక్టర్ పి. సాంబశివరావు సన్నివేశాన్ని వివరించారిలా: "జైరాజ్ మెట్లెక్కి పైకి వెళ్ళబోతూంటే కుమార్ ప్రవేశిస్తాడు 'గుడ్‌మార్నింగ్, సార్!' అంటాడు. జైరాజ్ 'గుడ్...మా...' అంటూ వెనక్కి తిరిగి, కుమార్‌ని చూసి విస్తుపోతాడు. 'ఐ సీ... యు ఆర్ అప్పాయింటెడ్ విత్ ఇమ్మీడియెట్ ఎఫెక్ట్!' అంటూ చెయ్యిజాపుతాడు. 'థాంక్యూ, సార్!' అంటూ కుమార్ షేక్‌హాండ్ యిస్తాడు. 'మా గెస్ట్ హౌస్‌లో నువ్వు వుండొచ్చు. నువ్వు అంటున్నానని ఏమీ అనుకోకు, బాబూ! ఎందుకో అలాగే అనాలనిపిస్తోంది,' అంటాడు జైరాజ్. 'పెద్దవారు. మీరు నన్ను మీరు అనకూడదు, సార్. ఇలాగే పిలవండి. ఈ పిలుపులో ఆత్మీయత వుంది. వస్తాను, సార్!' అంటూ కుమార్, దివాకర్ వెంట వెళ్ళిపోతాడు. కుమార్ వెళ్తున్న వైపే చూస్తూ జైరాజ్ 'అవే కళ్ళు. అదే రూపం పాతికేళ్ళ క్రితం నేనెలా వుండేవాడ్నో సరిగ్గా అలాగే వున్నాడు. ఎవరితను? ఎందుకు ఇతన్నే చూడాలనిపిస్తోంది? ఇతను నా బిడ్డ అయితే, మరి...ఓ—గాడ్!' అంటూ అంతుచిక్కని సమస్యతో తలపట్టుకొని సతమతమైపోతాడు."



'తాయారమ్మ—బంగారయ్య'లో ఒక సన్నివేశం

తాజా కబుర్లు

"అక్టోబర్ 15న ప్రారంభిస్తున్నాం కొత్త చిత్రాన్ని. పూర్తిగా ఔట్‌డోర్‌లో తయారౌతుంది," అన్నారు కవితా ఆర్ట్ ప్రొడక్షన్ అధినేత డి. వి. ఎస్. రాజు. వారు 'సినీ లిటో వర్క్స్' నిర్వహిస్తున్నప్పట్నించీ— అంటే, దాదాపు పాతికేళ్ళుగా వారితో నాకు పరిచయం వుంది. అప్పుడెంత ఆప్యాయంగా పలకరించేవారో—ఇప్పుడూ అంతే. ఎన్ని చిత్రాలు నిర్మించినా ఐశ్వర్యం ఆయనలో ఏ విధమైన మార్పునూ తీసుకురాలేదు. నిగర్వి. నిరాడంబర వ్యక్తి. నిండుకుండ. అందుకే చిత్ర పరిశ్రమలో ఆయనంతటి సహృదయులు యెవరూ లేరని అంటూంటారంతా. కె. విశ్వనాథ్ దర్శకత్వంలో ఆయన రంగుల్లో నిర్మించే కొత్త చిత్రానికి దాసం గోపాలకృష్ణ విరచిత "ప్రెసిడెంట్ పేరిందేవి"ని ఎన్నుకున్నారు. నూతన్‌ప్రసాద్, కవిత, గోకిన రామారావు, సాక్షి రంగారావు, రమణమూర్తి, కె. వి. చలం ఇంతవరకు బుక్ అయ్యారు. చక్రవర్తి సంగీత దర్శకుడు. జి. కె. రాము ఛాయాగ్రాహకుడు. సూరపనేని కళాధర్ శిల్ప దర్శకుడు.

నరసింహనాయుడు సమర్పించే యువ చిత్ర వారి కొత్త చిత్రానికి దాసరి నారాయణరావు దర్శకత్వం వహిస్తారు. మహదేవన్ సంగీత దర్శకుడు. యు. రాజగోపాల్ ఛాయాగ్రాహకుడు. డిసెంబర్‌లో షూటింగ్ ప్రారంభమై, ఫిబ్రవరికి పూర్తవుతుందని తెలియజేశారు నిర్మాత కె. మురారి.

ఎన్. టి. ఆర్‌తో కె. బాపయ్య దర్శకత్వంలో శిల్ప దర్శకుడు రాజేంద్రకుమార్ సమర్పించే ఆదిత్య చిత్ర వారి సినిమాస్కోప్ వర్ణ చిత్రానికి డిసెంబర్ 11న ప్రారంభోత్సవం జరుగుతుంది

ఎ ఆర్. చిత్ర పతాకంలో లంజిబాబు, రామచంద్రరావు నిర్మించే చిత్రానికి, మరో రెండు చిత్రాలకు కొమ్మినేని శేషగిరిరావు దర్శకత్వం నెఱపబోతున్నారు.

కళాకారుని స్మృతి చిహ్నంగా వీధి పేరు


మద్రాసులోని బోగ్ రోడ్ పేరును 'బి. ఎన్. రెడ్డి రోడ్'గా మార్చినట్లే బొంబాయి జుహు ప్రాంతంలో స్వర్గీయ బాలరాజ్‌సాహ్ని నివసించిన వీధికి ఆ కళాకారుని పేరే పెట్టారు.

ఎవరు బాధ్యులు ?

విజయవాడలో స్థానికంగా నాటిక సమాజాల లోను, మండలులలోను ప్రసిద్ధుడైన శ్రీ కోనేరు రాజుబాబు కథ, స్క్రీన్‌ప్లే స్క్రిప్టు కూడా తయారుచేసుకుని; డబ్బు దస్కం కూడదీసుకుని— ఔత్సాహిక నటుల నందరిని బాసట చేసుకుని— "ఎవరు బాధ్యులు?" అన్న ప్రయోగాత్మక చిత్రం — మూడు రీళ్ల నిడివిగలదాన్ని — తయారు చేశాడు.

పిల్లలు చెడిపోడానికి పెద్దల బాధ్యత చాలా వుంటుందన్న సత్యాన్ని 'రాజుబాబు' ఈ చిత్రం ద్వారా చెప్పాలనుకున్నాడు... ఔత్సాహిక కళాకారులకు, సాంకేతిక నిపుణులకూ కూడా యీ చిత్రం— తమ తమ శక్తిసామర్థ్యాలను చూపెట్టుకోడానికి యెంతో అవకాశాన్ని యిచ్చింది. శ్రీయుతులు నండూరు సుబ్బారావు, డి. ఆర్. మోహన్, ఏ. వి. యన్. మూర్తి, జి. రామకృష్ణారావు, చక్రం, కె. సుబ్బారావు, కుమారి రాజ్యలక్ష్మి, శ్రీమతి సీతాలత, రాజకుమారి, అరుణకుమారి, అమరలత యింకా పిల్లలు కొందరు యిందులో నటించారు. డైరక్టరు జయకుమార్, మేకప్ శేఖర్... యిందులో ఒక నేపథ్యగీతాన్ని కూడా చేర్చుకుంటే బాగుండేది... ఐనా ఔత్సాహికులు చేసిన యీ కృషి ఎన్నదగిందిగా వుంది.

'ఎవరు బాధ్యులు'లో నండూరి సుబ్బారావు




[వీరాజీ]

ప్రకృతి రహస్యం కనుగొనబడింది!



ఇది సహజంగా, మృదువుగా
మీ వంటి ఛాయను పెంపొందిస్తుంది


చర్మానికి నలుపుదనం ఎలా సంక్రమిస్తుంది.



మీ చర్మం లోపల మెలానిన్ అనే ఒక పదార్థముంది. ఇది ఎంత హెచ్చుగా ఉంటే మనుషులు అంత నల్లగా ఉంటారు. మీరు ఎండలోకి వెళ్ళినపుడల్లా, అల్ట్రావయిలెట్ కిరణాలు మీ చర్మంలో ప్రవేశించి మెలానిన్‌ను మరింత పెంచుతాయి.

వంటి ఛాయను పెంచడానికి పురాతన పద్ధతి ఏదైనా ఉందా?

వందలాది సంవత్సరాలుగా, ఆడవారు—సెనగపిండి, పాల మీగడ, నిమ్మరసం, గ్లిసరీన్, ఇంకా ఏవేవో ఉపయోగిస్తూ వస్తున్నారు. వీటి మూలంగా చర్మం మెత్తబడి కొంత మెరవచ్చు; అంతేగాని చర్మాన్ని నిజంగా ఎర్రగా చేయలేవు. మరొక తెగకు చెందినవి బ్లీచింగ్ పదార్థాలు. ఇవి ఎంత హానికరమైనవో వేరే చెప్పనక్కర్లేదు. అపురూపమైన మీ పట్టుబట్టల్ని మీరు బ్లీచ్ చేస్తారా? మీ చర్మం కూడా పట్టువలె నాజూకు అయినది. పట్టుకంటె అపురూపమైనది.



విజ్ఞాన విజయం! ఫెయిర్ అండ్ లవ్లీ సహజంగా మృదువుగా తన పనిచేస్తుంది.


ఫెయిర్ అండ్ లవ్లీలో గల ఒక విటమిను, దానిని మీరు రాసుకొన్నపుడు, మీ చర్మంలో ప్రవేశించి, సహజంగా, మృదువుగా, సురక్షితంగా, మెలానిన్ వ్యాప్తిని వెనక్కు నెట్టుతుంది. దాంతో మీ చర్మం చూస్తుండగానే ఎర్రపడుతుంది. అంతేకాక, ఫెయిర్ అండ్ లవ్లీ మీ చర్మాన్ని బయట నుంచి కూడా సంరక్షిస్తుంది. దీనిలోని ఒక పదార్థం ఎండలోని అల్ట్రావయిలెట్ కిరణాలను వడబోసి, వాటి మూలంగా మీ చర్మం మరింత నల్లబడకుండా ఆపుతుంది.

6 వారాలకు మీకే తేడా కనపడుతుంది!

ఫెయిర్ అండ్ లవ్లీని ఆరు వారాల పాటు నియమంగా వాడితే, మీతోపాటు ఇతర్లు కూడా మీ వంటి ఛాయలో మార్పును గుర్తిస్తారు.

ఫెయిర్ అండ్ లవ్లీ క్రీమ్ నల్ల చర్మాన్ని ఎర్రబరచడంతో పాటు ఇంకా చేస్తుంది.

ఫెయిర్ అండ్ లవ్లీ మీచర్మానికి కోమలత్వాన్ని సువాసనను చేకూరుస్తుంది. రోజుకు కనీసం ఒకసారి వాడండి. రెండుసార్లు వాడితే మరీ మంచిది. నియమంగా వాడితే, మీ వంటి ఛాయ పెంపొందుతుంది, అలాగే ఉంటుంది. సహజంగా, మృదువుగా ఎరుపెక్కుతుంది. ఫెయిర్ అండ్ లవ్లీ—నల్లని చర్మాన్ని ఎర్రబరచడం కోసం సున్నితమైన తీరు.





ఫెయిర్ అండ్ లవ్లీ నల్లని చర్మాన్ని ఎర్ర బరచడం కోసం సున్నితమైన తీరు

లింటాస్ – FALOV.8-2315 TL

సంక్షిప్త చిత్ర వార్తలు



'కటకటాల రుద్రయ్య'లో చిత్ర, సుధ

★ సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో టి. రాధామనోహరి నిర్మించే ఎస్. బి ఎస్. ఫిల్మ్స్ వారి చిత్రంలో కమల్ హాసన్, జయసుధ, రోజారమణి, జయ, ప్రభాకరరెడ్డి, కాంతారావు, రావి కొండలరావు, సారథి, రమాప్రభ తారాగణం. సంధ్యాల రచయిత. బాలుమహేంద్ర ఛాయాగ్రాహకుడు. కె. పి. కృష్ణయ్య సహకార దర్శకుడు. శిల్పం : తోట. నిర్వహణ : సంతానం.

★ పూర్ణోదయా ఆర్ట్ క్రియేషన్స్ "తాయారమ్మ – బంగారయ్య" వర్ణ చిత్రంలోని నాలుగు మృదుమధురమైన గీతాలను సెప్టెంబర్ 8 న సుభాషిణీ ప్రివ్యూ థియేటర్‌లో పాత్రికేయులకు చూపించారు నిర్మాతలు ఏడిద నాగేశ్వరరావు, ఆకాశం శ్రీరాములు. ఆత్రేయ రాసిన ఆ గీతాలకు చక్రవర్తి స్వరకల్పన చేశారు. ప్రతి పాట సందర్భాన్ని వివరించారు ఈ చిత్ర కథకుడు, దర్శకుడు కొమ్మినేని శేషగిరిరావు.

★ తళ తళుక్కు నవ్వే ఏముక్కు" అనే వేటూరి గీతం రాఘవులు స్వరకల్పనలో బాలసుబ్రహ్మణ్యం, సుశీల గానం చేయగా సురేంద్ర ఆర్ట్ పిక్చర్స్ "ఎవడబ్బ సొమ్ము" స్కోప్ కలర్ చిత్రానికి సెప్టెంబర్ 4 న ప్రారంభోత్సవం జరిగింది. నటవర్గం : కృష్ణ, శ్రీప్రియ, సత్యనారాయణ, ఈశ్వరరావు, ప్రసాద్ బాబు, చిట్టిబాబు, జానకి, జయమాలిని. త్రిపురనేని మహారధి రచయిత. పుష్పాల గోపీకృష్ణ ఛాయాగ్రాహకుడు. కొండపనేని రామలింగేశ్వరరావు శిల్ప దర్శకుడు. అక్టోబర్ 16 న షూటింగ్ ప్రారంభం. కె. ఎస్. ఆర్. దాస్ దర్శకుడు. సురేంద్ర, వాసిరెడ్డి నిర్మాతలు.

★ కె. ఎస్. ఆర్. దాస్ దర్శకత్వంలో డి. రాజశేఖరం నిర్మించే స్కోప్ కలర్ చిత్రంలో కృష్ణ, శ్రీదేవి నాయకా నాయికలు. ముళ్ళపూడి రచయిత. ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం సంగీత దర్శకుడు.

★ పరిషత్తులలో, పలుచోట్ల ప్రదర్శనలలో ప్రశంసలు, బహుమతులు అందుకున్న సాధనాల విరచిత "గాంధీనగరం" నాటకం ఆధారంగా బి. జి. తిలక్ ఆర్ట్ థియేటర్స్ సౌజన్యంతో శ్రీ లక్ష్మి జోగమాంబా పిక్చర్స్‌వారు "సహనం తిరగబడింది" చిత్రాన్ని నిర్మిస్తారు. కథ, మాటలు : భీశెట్టి, నాగశ్రీ. సంగీతం : చక్రవర్తి. నిర్వహణ : కె. గంగాధరరావు. ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ : జి. ఎస్ ఎస్. రెడ్డి. నిర్మాతలు : ఆర్. వి. ఎస్. ప్రసాద్, ఫం. కె. బేగ్, బి. ఇ., స్క్రీన్‌ప్లే, దర్శకత్వం : పి. చంద్రశేఖర రెడ్డి, బి. యె.

★ "నామాల తాతయ్య" అనే వర్ణ చిత్రాన్ని స్పైష్ ఎంటర్‌ప్రైసెస్ పతాకంలో ఎస్. రియాజ్ భాషా నిర్మిస్తున్నారు. కె. హేమాంబరధరరావు దర్శకుడు. నటవర్గం : రంగనాథ్, మాధవి, రాజ్‌బాబు, కె. విజయ, రమాప్రభ, బేబీ గౌరి. కథ, నిర్వహణ : నరసింహారావు. రాజాశివానంద్ సంభాషణలకర్త. ఎస్. రాజేశ్వరరావు సంగీత దర్శకత్వంలో దేవులపల్లి, గోపి గీతాలు రాశారు. తిరుపతి ప్రాంతంలో ఒకే షెడ్యూల్‌లో పూర్తయ్యే ఈ చిత్రానికి ఛాయ : పాచ్చూ. శిల్పం : రంగారావు,


★ సత్యనారాయణ, శ్రీవిద్య, జయంతి, నరసింహరాజు, మాధవి వగైరా తారాగణంతో ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్ కె. రాఘవ నిర్మించే "అంతులేని వింత కథ" చిత్రానికి ఇటీవల విజయా గార్డన్స్‌లో ఆనంద్‌తో పాటు ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం చెల్లెళ్ళు శైలజ, బేబీ వసంత పాడిన సి. నా. రె. గీతాలు ధ్వనిముద్రికలు చేయబడ్డాయి. సంగీతం : రమేష్‌నాయుడు. ఛాయ : రామకృష్ణారావు. కూర్పు : బాలు. సెప్టెంబర్ 26 నుంచి హైదరాబాద్‌లో షూటింగ్ ప్రారంభం. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం : ఇ. మోహన్‌దాస్.

★ చంద్రమోహన్, నరసింహరాజు, అల్లురామలింగయ్య, మోహన్‌రావు, కె. వి. చలం. శివరామరెడ్డి, సుమిత్ర, మాధవి, నిర్మల నటించే జయ ఆర్ట్స్ తొలి చిత్రానికి సెప్టెంబర్ 5 న విజయా గార్డెన్స్‌లో పాటల రికార్డింగ్‌తో అంకురార్పణ జరిగింది. మహర్షి కథకు సత్యానంద్ సంభాషణలకర్త. ఆత్రేయ, సి నారాయణరెడ్డి, వేటూరి గీతాలకు సత్యం బాణీలు కూర్చారు. లక్ష్మణ్ గోరే ఛాయాగ్రాహకుడు. కూర్పు : కోటగిరి గోపాలరావు. స్థిర చిత్రాలు : డి. రాధాకృష్ణమూర్తి. నిర్మాత : కె. నారాయణ మూర్తి. దర్శకత్వం : ఎం. మల్లికార్జునరావు.


★ విభిన్న మనస్తత్వాలు గల ముగ్గురు కన్నెల గాధలను "పొంగే వయసు" పేరున శ్రీనివాసమూర్తి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో కోగంటి నాగేశ్వరరావు విశ్వజ్యోతి ఆర్ట్స్ పతాకంలో తెరకెక్కిస్తున్నారు. కొత్త నటీనటులతో తెనాలి పరిసర ప్రాంతాలలో చిత్రీకరణ జరుగుతుంది. మాటలు, పాటలు : అత్తిలి రామకృష్ణ. ఛాయ : టి. వి. బాలు. నిర్వహణ : గోగినేని సాంబశివరావు.

ఛాంపియన్ డిటర్జెంట్ కేక్!

1అప్




మురికిపై విజయం!



అధిక శక్తి గల వన్-అప్ మురికిని నామరూపాలు లేకుండా తుదముట్టించి మురిపించే మెరిపించే శుభ్రత నిస్తుంది!

వన్-అప్ లోని అధిక శక్తివంతమైన పదార్థాలు, లోపలికి చొచ్చుకుపోగల, తీవ్రంగా పనిచేసే నురగనూ, అధికంగా తెలుపుచేసేవాటినీ సమకూరుస్తాయి. అందుకే వన్-అప్, లోపలదాగిన మురికిని అంతా తీసేసి, బట్టలని శుభ్రపరుస్తుంది—దాంతో తెల్లవాటికి మరింత తెలుపు, రంగువాటికి మరింత మెరుపూ వస్తుంది.


బట్టలకు సంరక్షణ!



సుతిమెత్తని వన్-అప్ మీ బట్టలను పూర్తిగా సంరక్షించి, వాటికి సుగంధాన్నిచ్చే ఓ తాజాదనాన్ని తెస్తుంది!


వన్-అప్, శక్తివంతమైనదైనా ఎంతో మృదువుగా పని చేస్తుంది. ఎందుకంటే దీనిలో హానికరమైన పదార్థాలేమీ లేవు గనక. చక్కని సుగంధం చిందించే వన్-అప్, మీ బట్టలపై మృదుత్వంతో పనిచేస్తుంది. దాంతో అవి సుగంధ తాజాదనంతో రూపొందుతాయి.

డబ్బు ఆదాతో ఉపకారం!



వన్-అప్‌లోని మన్నగల శక్తి. మరీ మరీ. ఉతికిన ప్రతిసారీ డబ్బును ఆదా చేస్తూనే ఉంటుంది!

వన్-అప్, మరే యితర డిటర్జెంట్ కేక్ కన్నా ఎక్కువ కాలం మన్నుతుంది. ఎందుకంటే, వాడగానే దబ్బున అరిగిపోదు గనక. అంటే వాడే ప్రతిసారీ మీరు డబ్బును ఆదా చేస్తున్నారన్నమాటే!



1అప్

శుభ్రతా, సువాసనా, మెరుపూ సమకూర్చే ఛాంపియన్!

ASP/WL-1 UP 1A

విట్కో లిమిటెడ్, కాలోల్ 389 330, గుజరాత్.

దీర్ఘ సుమంగళీ భవ

(17వ పేజీ తరువాయి)

అతో ధగ— ధగ మెరవనూ వచ్చు. అది సృష్టి రహస్యం. ఇదంతా మా ఘనకార్యమే అనే విర్రవీగు మానవుడ్ని చూసి— భగవంతుడు చిఱునవ్వు చిందిస్తాడట—వారి వెర్రితనానికి జాలిపడి కాబోలు!

శాస్త్రి అనారోగ్యానికి తోడు— అడపా, తడపా పెద్ద మొత్తాలు కొడుకు కాలేజీ చదువుకు ఖర్చవుతూండటంతో సేరీ వ్యవసాయం సాగించలేక తన భూమిని రత్తయ్యకే కవులుకిచ్చేడు. కొంత భూమి అప్పులుతీర్చడానికిఅమ్మక తప్పలేదు. (అప్పు చేయడం... దురద లాంటిది. గోకిన కొద్దీ ఇంకా గోకాలనే ఉంటుంది. మంటలుపుట్టి వ్రణం అయితేనే కాని అసలు బాధ తెలిసి రాదు.) మిగిలిన భూమివల్ల వచ్చే అర్ధ భాగంతో సంసారం ఒడిదుడుకులతోనే వడపవలసి వచ్చింది. తన కొడుకు ప్రయోజకుడైతేచాలు. ఈ ధనం శాశ్వతమా— అని ఆలోచించేడు శాస్త్రి.

ఏటా దేవీ నవరాత్రులు జరిపిస్తూనే ఉన్నాడు. ఏదో యథాశక్తి తప్ప— తొలి అట్టహాసం— ఆనాటి వైభవం తేగలడా? అన్న సంతర్పణ జరపాలంటే— అర్థలోపం రాక్షసిలా పెనవేసుకుంది. నవరాత్రులు వస్తున్నాయనే సరికి తొలి ఆనందం అంతరించి— భయం ఆవరించేది. తన తండ్రి పేరు నిలవలేక పోతున్నాననే దిగులుతో కుళ్లి కుళ్లి యేడ్చేవాడు. ఎన్నో రాత్రులు తొలి వైభవాలు జ్ఞాపకం రాగా— నిద్ర పట్టేది కాదు.

ఆరోగ్యం క్రమేణా క్షీణించ సాగింది. దీనికి తోడు కొడుకు వద్ద నుంచి వచ్చే జాబులకు లెక్కలేదు. ప్రతి జాబులోనూ తన అవసరాలూ వాటికయ్యేఖర్చులూ కావలసిన సొమ్ము పంపమనీ తప్ప తల్లిదండ్రుల యోగ క్షేమాలను గూర్చి ప్రసక్తే ఉండేది కాదు. ఆరోగ్యం బాగుంటే తిరిగి సేరీ వ్యవసాయం సాగించి ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచు కునేవాడు: కాని మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు భార్య పార్వతి కూడ రోగగ్రస్తురాలయింది.

పార్వతికి 'మశూచి' తగిలి భర్త సాన్నిధ్యం వదిలి భగవంతునిలో లీనమైంది. ఈ దెబ్బతో హతాశుడయేడు శాస్త్రి. అతని నవనాడులూ ఒక్కసారి కృంగినట్లయేయి. విజయదశమి నాటి తండ్రి మరణం తలపుకు వచ్చింది, ఘోరుమని విలపించేడు. కొడుకు పేర తంతి వార్త పంపేడు. వాడు రెండో రోజున వచ్చి తల్లి మరణానికి దుఃఖించేడు. కర్మకాండ పూర్తవగానే కాలేజీ పోతుందంటూ వెంటనే వెళ్లిపోయేడు.

ఆశని పాతాల్లా ... ఒకదాని వెంట మరొకటి వచ్చే కష్ట పరం పరలను ఎంత విజ్ఞుడైనా ఎదుర్కోటం సాధ్యమా? సంఘటనల ఒత్తిడి మానవుడ్ని బలహీనుడిగా చేస్తుంది. ఎంతో దృఢ చిత్తుడైతే తప్ప వెల్లువలా వచ్చిపడే అఘాతాలను తట్టుకోవటం సులభమా? దుఃఖ పరంపరలు మనిషిని నిస్సహాయునిగా చేస్తాయి. అయినా 'శరీర మాద్యం ఖలు ధర్మసాధనం' అని కదా పెద్దల సూక్తి. అందుచేత ఈ జీవుడున్నంత వరకూ ఈ కాయాన్ని పోషించక తప్పదు. అనుకుంటూ రోజులు భారంగా గడప సాగేడు శాస్త్రి. కొడుకు చదువు పూర్తి చేసుకుని ప్రయోజకుడైతే ఈ కష్టాలు కొంతైనా తగ్గుతాయి కదా అని పాపం ఆ కన్నతండ్రి ఆశ!

కాని-మనం తలచినదే దైవం సాగనిస్తే మరి ఆ జగన్నాటక సూత్రధారిని తలచే దెవరు? అన్ని కష్టాలొచ్చినా ఉన్న ఆ ఒక్క మొలకా పెద్దదై తన దక్కరకొస్తే ఆనందించాలను కున్న ఆ పితృ హృదయం పట్నం నుంచి వచ్చిన వార్త విని — బండరాతి మీద పగలగొట్టిన భాండంలా— వికావికలైంది. తన కొడుకు ఎవరో కాలేజీపిల్ల ప్రేమలోపడి— ఆమెతో జరిపిన ప్రేమ కలాపాల పర్యవసానంగా— ఆమె మతంలో చేరి దూర ప్రాంతాలకు వెళ్లిపోయినట్లు వచ్చింది ఆ వార్త!

ఉన్న ఆ ఒక్క ఆశా తునాతునకలై గాలికి కొట్టుకుపోతే ఏ తండ్రి హృదయం ఆక్రోశించదు? ఉన్న ఆ ఒక్క కొడుకూ తనకు కాకుండా పోతే ఆ తండ్రి ఆక్రందన కర్ణభేద్యం కాదా? అలాంటి తండ్రికి జీవితం మీద ఆశ ఎలా వుంటుంది? శాస్త్రికి పార్వతి పోయినప్పుడే వెన్ను విరిగినట్లయింది. ఇక ఈ కొడుకూ తనకు కాకుండా పోతే ఇక ఏం చూసుకు బ్రతకాలి?

చేసిన అప్పులు అప్పటికేతలమునిగి తాటి ప్రమాణం కావటంతో ఉన్న భూములు

13-10-1978 శుక్రవారం మొదలు 19-10-1978 గురువారంవరకు

వారఫలం

— మహేష్

మేషం :— మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. వృత్తిలో శ్రమ కలుగుతుంది. చికాకులు యేర్పడతాయి. వారం మధ్యలో వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం :— వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం మధ్యలో మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

మిధునం :— ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. మీ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరతాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

కర్కాటకం :—రావలసిన డబ్బు అందుతుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. మిత్రులకు సహాయం చేస్తారు. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు—సంతోషకరమైన వార్తలను వింటారు. పుణ్యకార్యాలు చేస్తారు.

సింహం :— సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఆందోళనకు గురికాగలరు. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. శుభ కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

కన్య :— భాగస్వాములతో కలిసిచేసే వ్యాపారాలు లాభిస్తాయి. సాటివారిలో గౌరవం బాగుంటుంది. మీ ఆలోచనలు ఫలిస్తాయి. వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారి పోవచ్చును. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అనవసరమైన వ్యయం జరుగుతుంది.

తుల :— సాటివారితో వాద ప్రతివాదాలు తగవు. మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. దైవ కార్యాలు నెరవేరతాయి.

వృశ్చికం :— వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. స్త్రీలకు—వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. సాటివారితో వాద ప్రతివాదాలు తగవు.

ధనుస్సు:— మీ కార్యక్రమాలు అడావుడిగా ఉంటాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. బంధువులకు సహాయం చేస్తారు.

మకరం:— వృత్తిలో సాటివారి పోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. మీ మంచి తనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు—అనుకూలమైన సమాచారం అందుతుంది. దైవ కార్యాలు నెరవేరతాయి.

కుంభం:— మీ శ్రమకు తగిన ఫలితంలభిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. నూతన విషయాలను తెలుసుకొంటారు.

మీనం :— వృత్తివ్యాపారాలు బాగుంటాయి. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. శుభ కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధు మిత్రులను కలుసుకొంటారు.

తెగనమ్మి చేతులు దులుపుకున్నాడు శాస్త్రి. మిగిలిన ఆ ఇల్లూ అమ్మి ఒక పాకలో కాపురం పెట్టేడు. ఏనాడో ఆత్మహత్య చేసుకునేవాడే! కాని— చదువుకున్న వాడు కావటంతో— తండ్రి పెంపకం వలనా— అలాంటి అజ్ఞానంలో పడలేకపోయేడు. అదీ కాక— ఎంతో వృద్ధురాలూ— కష్టాల తాకిడికి తట్టుకోలేక— అల్లల్లాడుతూన్న మేనత్త గతేం? ఆమె క్షుభిత హృదయానికి తాను కూడా లేకపోతే- ఇక ఏముంది? జీవచ్ఛవంలాంటి ఆమె బ్రతుక్కి ఈ మాత్రం అండకూడా లేకపోతే— ఆ పాపం తనది కాదూ? తన బొందిలో జీవం ఉండగా— ఆ మేనత్తకు సేవచెయ్యడంకన్న పరమార్థం ఏముంది? అదే తన కర్తవ్యం అని తన తండ్రి బోధిస్తున్నట్టుగా భావించి కళ్ళు తుడుచుకున్నాడు శాస్త్రి.

ఎక్కడో దూరాన— కొడుకు ఉద్యోగం చేస్తున్నట్టు కర్ణా— కర్ణిగా మాత్రమే విన్నాడు. ఆ వెళ్ళినవాడు మరి తిరిగిరాలేదు. అరుంధతి వంటి తల్లినీ, వశిష్ఠుని వంటి తండ్రినీ గోల్పోయి— ప్రాణ సమానమైన అర్ధాంగికి దూరమైన తర్వాత ఇక తను బ్రతికి ఉన్నా శవంతో సమానమే! అయినప్పటికీ ఇహలోకం విడే. సమయం తనకింకా రాలేదు. తన మేనత్తకోసమైనా జీవించక తప్పదు— ఆ పిలుపు వచ్చేదాకా! ఇలా ధైర్యం చిక్కబట్టుకుని ఉపనయనం నాడు నేర్పిన వ్యాపకం ; అనుసరించక తప్పలేదు శాస్త్రికి.

* * *

"శ్రీ సీతా రామాభ్యాన్నమః... అమ్మా !...ఏకాదశి-సోమవారం...మృగశిర నక్షత్రం...వర్జ్యం రాత్రి ఏడుగంటలకు... అమ్మా! యాయవార బ్రహ్మణ్ణి."— అంటూ ఆ ఊరికి సంపన్నమైన మరో గడప ఎక్కేడు భిక్షువు.

నాలుగు గింజలు చెంబులో పడేవరకూ ఎన్ని గడపలైనా ఎక్కవలసిందే !

"వచ్చేవూ తెల్లారగానే?... శనిగొట్టులా !...నీ మూటా ముల్లెందాచ లేదిక్కడ—రోజూ ఇదేవరసో ? దయచెయ్!" అని వరండాలో చుట్టకాల్చుకుంటూ వాలు కుర్చీలో కూర్చున్న వ్యక్తి ముఖం చిట్లించేడు.

"ఎవరదీ ?...శాస్త్రిగారా ! ఉండండి బాబూ వస్తున్నా"—అంటూ ఇంట్లో ఆ ఆసామీభార్య వీధిలోకి వచ్చింది.

చుర-చుర చూసేడు- రవ్వల ఉంగరాల వ్రేళ్ళతో కోరమీసం మెలివేస్తూ రత్నాల నాయుడు భార్యవంక.

"పట్టండి బాబూ !" అంటూగుమ్మం వద్ద మెట్లు దిగి చెంబులో ఉపాదానం వేసింది యజమాని భార్య వరహాలమ్మ !

"దీర్ఘ సుమంగళీ భవ !" అంటూ ఆశీస్సులిచ్చేడు భిక్షువు.



వంటలు

బిరాగో హల్వా

కావలసిన వస్తువులు: బియ్యం, రాగులు, గోధుమలు, నెయ్యి, పాలు అన్నీ ఒక్కొటి ఒక్కొక్కకప్పు, చక్కెర ఆరుకప్పులు, జీడిపప్పు సుమారు 100 గ్రాములు, యాలుకలు 6, టేబుల్‌సాల్ట్ అరచిటికెడు, మిఠాయిరంగు చిటికెడు.

తయారుచేయు విధానం : మొదట రాగులు బాగుగా దంచి, చెరిగి ఒక్కప్రక్కన పెట్టుకోవాలి. బియ్యం, గోధుమలు రాళ్ళు లేకుండా ఏరుకొని దంచి వుంచు కున్న రాగులతో కలిపి నీటిలో నానబెట్టాలి. మనకు సాయంకాలానికి హల్వా కావాలనుకుంటే ఉదయం నానబెడితే చాలు. ఇలా నానిన గింజల్ని రోటిలోవేసి బాగా మెత్తగా రుబ్బి, ఆ రుబ్బునుండి వచ్చిన రసాన్ని (తెల్లగా చిక్కగా వచ్చే గింజల సారం) పల్చని గుడ్డలో వడపోయాలి. ఇలా రుబ్బుతూ ఆ వచ్చిన ముద్దను వడపోసి పిండుతూ మూడు నాలుగుసార్లు రసాన్ని తీసుకొని పిప్పి పారవేయాలి! ఇలా వడపోసిన ఆ రసంలో చక్కెర, సాల్ట్ కలిపి మందముగా వున్న గిన్నెలోపోసి స్టవ్‌మీద వుంచి మధ్య రకంగా మంట తగిలేలా చూడాలి. అడుగంట కుండా చూస్తూ గరిటతో కలుపుతూండాలి. కొద్దిగా చిక్కబడుతున్నప్పుడు యాలుకుల పొడి, మిఠాయి రంగు పాలతో కలిపి తయారౌతున్న హల్వాలోపోసి బాగా కలపాలి. చిక్క



ఫలితం

నిప్పుతో కాల్చి చూడు
నీరౌతుంది కుండా

నిజాన్ని పేల్చి చూడు
దాచేయకుండ

జనించేది వేడే గాదు
వెలుగు కూడ

కబళించేది చలినే గాదు
చీకటిని కూడ.

— గరికపాటి కృష్ణమూర్తి.

బడిన తర్వాత నెయ్యివోసి మొత్తం హల్వాను కలియబెట్టాలి. మరి కొంచెంసేపు అంటే ఒకటి, రెండు నిముషాలుంచి గిన్నె దించేస్తే హల్వా ఘుమఘుమ లాడుతూ తయారౌతుంది. ఒక స్టీలు ప్లేటుకు నెయ్యిరాసి గిన్నెలోని హల్వాను దానిలోకి తిరగబోసి సమానంగా సర్ది జీడిపప్పు అందంగా అమర్చుకుని చల్లారిన తరువాత మనకు కావలసిన సైజులో ముక్కలు కోసుకుని తింటే మళ్ళీమళ్ళీ 'బిరాగో హల్వా'నే చేసుకోవాలనిపించే రుచిగా వుంటుంది.

— యల్. కృష్ణవేణి.

ఫాలాక్షుని డైరీ



ఇదేం బాగు !

గౌహతి మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న లెక్చరర్లలో వో యిద్దరు కాలేజీ ఆవరణలో తమ కార్లు నిలుపుకునే విషయంమీద గొంతు చించుకుని పోట్లాడుకున్నారట. ఆ మర్నాడు కూడా యిదే వరుసమీద పోట్లాట ఆరంభించి, అంతలో ఆగక స్వరుస చొక్కా చొక్కా పట్టుకుని ముష్టా ముష్టి లేకా కిక్కి, ఒకర్నొకరు బాదుకుంటున్నారట. అందులో వో లెక్చరరైన డాక్టరు గారికి ప్రమాదమైన గాయాలు తగిలి, ఆసుపత్రిలో చికిత్సలో వున్నారట. ఈ విధంగా తమ్మకోసం ఏవీ బాగులేదని కాలేజి ప్రిన్సిపాలు గారు స్టాఫందర్ని పిలిచి ఓ మీటింగు పెట్టిచెప్పారట— అసలా మరో విధంగా తప్పు దోవ చెప్పని చెప్పుంటారా....నో!

విద్యార్థినిపై పోలీసుల అత్యాచారం

రత్నగిరి యస్.కె. పాటిల్ హైస్కూలుకు చెందిన ఒక విద్యార్థిని కబాడీ పోటీలలో పాల్గొనడానికి మద్రాసు వెళ్ళే, ఆమెను వో యిద్దరు పోలీసులు బలాత్కారించి, చెఱచారట. ఈ యిద్దరు పోలీసులకు చట్టం చెరో మూడేళ్ళ కఠిన కారాగారవాసమూ, ఐదేసొందలు ఫైనూ విధించిందట.

ఇంటిలోని పోరు

ఓమలూరుకు చెందిన 25 ఏళ్ళ గోవిందరాజన్ అనే అతనికి పెళ్ళయి నాలుగేళ్ళయినా పిల్లలు పుట్టలేదట. అతని భార్య 20 ఏళ్ళ వసంత తన భర్తను యీ విషయమూ, అతనికి వుద్యోగమూ, వుద్యోగమూ లేని విషయమూ రోజూను మాటొక్కసారి దెప్పేదట. దాంతో గోవిందరాజన్ బెంగళూరు వెళ్ళి వో చిన్న వుద్యోగం చేస్తూ పెళ్ళాన్ని బెంగళూరు తీసుకు వెళ్ళాడట. అతని భార్య ఆ వుద్యోగాన్ని కోడి వుద్యోగమని, పిల్లలు పుట్టించలేని అతని మగతనాన్ని పేడితనంగానూ, అంటూ యీసడించేదట. ఓపిక పట్టినంత కాలం వోపిక పట్టి, యిహాది పట్టలేక కత్తితో ఆమె పొత్తికడుపులో పద్దెనిమిదిసార్లు కసితీరా పొడిచి, పోలీసులకు లొంగిపోయాడట. తన కొడుకును పోలీసులు అరెస్టు చేశారన్న వార్త విన్న అతని తల్లి నూతిలో దూకి, ఆత్మహత్య చేసుకున్నదట.

నూతిలో పడ్డ దొంగ !

కోయంబత్తూరులో వో చోరుడు రామ్‌నగర్ అనే ప్రాంతంలోని వో గొప్పవారింట్లో తన హస్తలాఘవాన్ని చూపించడానికి వో రాత్రి ఎన్నుకుని, కాంపౌండు గోడఎక్కి బజరంగబలిని తల్చుకుని ఎగిరిదూకాడట. ఆ దూకిన వేగంలో దురదృష్టవశాత్తు వో యాభై అడుగుల లోతున్న నూతిలో పడ్డాడట. స్వశక్తిమీద కొన్నిక్షణాలలో సమ్మక్కంపోయి ఎలుగెత్తి భగవంతుణ్ణీ, చుట్టుపక్కల వాళ్ళనూ పిలిచాడట. దాంతో అందరూ పోగై, ఎవరూ ఏమీచెయ్యలేక అగ్నిమాపకదళం వారిని పిలిస్తే, వారూ పోలీసులూ కలిసి చెరో పని చేశారట. దెబ్బలోమాదిరి ఎక్కువతగలడం వల్ల ఆసుపత్రిలో, అరెస్టులో ఆ చోరశేఖరుడు శిక్ష, చికిత్స అనుభవిస్తున్నాడట.

మహిళాభ్యుదయం !

గర్భంలోవున్న శిశువు తల్లిహృదయస్పందన, రక్తప్రసరణ మూలంగా వచ్చే శబ్దాలూ, వీటితో చక్కగా నిద్రపోతుందట. శిశువు పుట్టాక కూడా యీ రకమైన శబ్దాలు వింటే ఆ శిశువు ఎంచక్కా నిద్రపోతుందట. అందుకని క్రొత్తగా యీ మధ్యన అమెరికాలో యీ హృదయస్పందన, రక్తప్రసరణ మూలంగా వచ్చే శబ్దాలూ టేపులు తీసి అమ్ముతున్నారట. వీటిని జోలపాటలుగా వుపయోగిస్తున్నారటక్కడి మహిళలు.

ఇంటిమీద పిడుగు ఇద్దరి మరణం

అనంతపురం అనే వూరికి చెందిన 36ఏళ్ళ పచ్చయమ్మాళ్ అనే ఆమె యింటిమీద వో పిడుగు పడి యిల్లు భగ్గున అంటుకుని, అంతలో వానవల్లారిపోయిందట. ఆ పిడుగు పాటుకు పచ్చయ్యమ్మ, ఆమె మూడేళ్ళ కూతురూ కాలి, చచ్చిపోయారట. మిగిలిన ముగ్గురు కొడుకులు, ఓ కూతురూ మాత్రం ఆ పిడుగు పాటుకు బలి అవక, కొంచెం కొంచెం దెబ్బలతో బ్రతికి బయటపడ్డారట.

మంత్రగాడి మాటవిని మిత్రద్రోహం

బులాన్సార్ నుంచి 35 కిలోమీటర్ల దూరంలో వున్న ఛా హాన్ అనే గ్రామంలో ఒక వ్యవసాయదారుని కొడుక్కి జ్వరంవచ్చి అది విషమించే స్థితికి వచ్చిందట. ఆ పిల్లాడిని పరీక్షించిన వో మంత్రగాడు ఆ కుర్రాడికి గాలి సోకిందని, మరో కుర్రాడిని కాళికా దేవికి బలి యిస్తే తప్ప అతనికి సిశాచి వదలదని చెప్పాడట. దాంతో ఆ వ్యవసాయి బలికి కుర్రాడికోసం వెదికి, దొరకపోయేసరికి తన స్నేహితుని కుర్రాడిని ఎత్తుకొచ్చి తీసుకుపోయి బలి యిచ్చాడట.

చిలికి చిలికి గాలివాన

తిరుచ్చిలో వో సిటీబస్సులోకి దిగేదారిలోంచి ఎక్కిన వో ప్రయాణీకుడ్ని ఆ బస్సు డ్రైవరు తిట్టి, వెనకనుంచి ఎక్కు అన్నాడట. ఆ ప్రయాణీకుడామాటను లక్ష్యపెట్టక, ఎక్కేశాడట. బస్సులో ఆ యిద్దరికీవాదోపవాదమై, అది రగడై చిలికి పోట్లాటై, ఆ స్థితి దాటిందట. దాంతో ఆ ప్రయాణీకుడు తనవద్ద నున్న కత్తితో ఆ డ్రైవరును ఒకే ఒక్క పోటు డొక్కలో పొడిచాడట...అంతే!! తిరుచ్చినగర మంతా బస్సు సమ్మెతో కిటకిట లాడి పోయింది. అవోచిక, రికాధరలు (బాదుడు) ఆకాశాన్నంటి, అవీ దాటి పోయాయి, పాపరక్తి.

ఒక టిక్కెట్టుపై రెండు సినిమాలు !

పల్లిపాలయం అనే వూరిలోని ఒక టూరింగు సినిమా హాలులో "ది ప్లేయర్స్" అనే ఇంగ్లీషు సినిమా చూపుతామని పోస్టర్లు అంటించి, ఆ సినిమాతో పాటు "బ్లూఫిలిం" స్త్రీ పురుషుల లైంగిక కలయికలు కూడా ఎంచక్కా చూపించారట. అంతపని చేసినందుకు సినిమా హాలు సొంతదారుని పోలీసట్టుకుందట.

చేతా-చెవులకోతా !

ఘోరక్‌పూర్ జిల్లాలో పెప్పిగంజ్ పోలీసు స్టేషనుకు చెందిన మెన్హారియా అనే గ్రామంలో ఒక హరిజన యువతి పల్లీకు నూతిలోంచి నీళ్ళు తోడుకున్నందుగ్గాను ఆమె రెండు చెవులూ అక్కడికక్కడే స్థానిక న్యాయస్థానం తెగ్గోసిందట!


బిల్లా ఘాతుకాలు

ఢిల్లీకి చెందిన 17 ఏళ్ళ గీత అనే అమ్మాయిని, ఆమె తమ్ముడు 15 ఏళ్ళ సంజయ్ అనే అతనినీ హత్య చేసిన భయంకరుడు బిల్లా విచారణలో అతడు లోగడ చాలామంది అమ్మాయిలను చెరిచినట్టు తేలిందట.

సైన్సులో సరదాలు

గ్లాసును లేవనెత్తిన మంట!

— డాక్టర్. మహీధర నళినీమోహన్.



ఈ గారడీ చేయడానికి ఒకే సైజులో వుండే రెండు గ్లాసులు, అద్దుడు కాగితం, ఒక అగ్గిపుల్ల, పాత కాగితం ముక్క— ఇవి చాలు.


ఒకే సైజులోవున్న రెండు గ్లాసులు తీసుకో. ఆ గ్లాసుల మూతికన్న మరో అరంగుళం పెద్ద సైజులో అద్దుడు కాగితం నుంచి ఒక చక్రంలా కత్తిరించు. గ్లాసు మూతికన్న కాస్త చిన్నదిగా ఉండేలా ఆ చక్రం మధ్యలో చిల్లులాగ కత్తిరించు ఈ బొమ్మలో చూపించినట్లు.

ఒక గ్లాసును నేలమీద ఉంచు. అద్దుడు కాగితపు వలయాన్ని నీటితో తడిపి, ఆ గ్లాసు మూతి మీద ఉంచు. కాగితాన్ని వెలిగించి, మంటతో సహా ఆ గ్లాసులో పడవేసి, వెంటనే రెండో గ్లాసును మొదటి గ్లాసు మూతి మీద (అద్దుడు కాగితపు వలయంమీద) అంచులు సరిగ్గా ఆనుకునేలాగ బోర్లించు. ఆ కాగితం కాస్త సేపు మండి ఆరిపోతుంది. ఇప్పుడు పై గ్లాసును పట్టుకుని ఎత్తితే కిందనున్న గ్లాసు కూడా పైకి లేస్తుంది!

దీనికి కారణం ఏమిటో తెలుసా? మండడానికి ఆక్సిజన్ అవసరం. మన చుట్టూ ఉన్న గాలిలో నాలుగు వంతులు నైట్రోజన్ ఒకవంతు ఆక్సిజన్ ఉన్నాయి. గ్లాసులో ఉన్న ఐదోవంతు ఆక్సిజన్ పూర్తి అయిపోయేదాకా కాగితం మండి, తరువాత ఆరిపోతుంది. అంటే రెండు గ్లాసుల మధ్యనున్న చోటులో ఐదోవంతు ఖాళీ ఏర్పడింది. ఆ ఖాళీని ఆక్రమించుకోడానికి వత్తిడి ఎక్కువగా ఉన్న బయటి గాలి శతవిధాల ప్రయత్నిస్తుంది. కాని, చొరబడడానికి దారిలేదు. తడిసిన అద్దుడు కాగితం, రంధ్రాలనన్నీ చక్కగా మూసేసి, "సీలు" లాగ పనిచేస్తుంది. అన్ని వైపుల నుంచీ లోపలి వైపుగా గాలి నొక్కుతూ ఉండడం చేత రెండు గ్లాసులూ అతుక్కుని ఉండిపోతాయి. సీలు సరిగ్గా పనిచేస్తూ ఉన్నంతకాలమూ ఈ విధంగా గ్లాసులు అతుక్కునే ఉంటాయి.

బల్లి, ఉడుము వంటి జంతువులు గోడలని పట్టుకుని వేలాడుతూ ఉండగలగడానికి ఇదే కారణం. ఈ జంతువుల పాదాల కింద గాలిలేని శూన్య ప్రదేశం తయారు అయే ఏర్పాటు ఉంది. ఆ శూన్యప్రదేశంలో చొరబడడానికి ప్రయత్నించే బయటి గాలే వాటిని గోడలకి నొక్కి ఉంచుతుంది.

అయితే ఒక్క సందేహం. ఇంత బరువును ఈ గాలి వత్తిడి ఈ విధంగా ఎత్తగలుగుతుందీ? భూమిమీద గాలివత్తిడి చదరపు సెంటీమీటరుకి సుమారు ఒక కిలోగ్రాము. కాని గ్లాసులలోపల 1/5వ వంతు మాత్రమే ఖాళీ అయింది కనుక లోపలికి నొక్కే వత్తిడి చ. సెం. మీ. కి 1/5 కి. గ్రా. మాత్రమే. ఈ రెండు గ్లాసుల మొత్తం ఉపరితల వైశాల్యం 100 చ. సెం మీ. అనుకుంటే ఈ వత్తిడి సుమారు 20 కి. గ్రా. అన్నమాట!



రబ్బరు, ప్లాస్టిక్ వస్తువుల తయారీలో మొక్కల విస్తృత వినియోగం

రబ్బరు, ప్లాస్టిక్ వస్తువులు తయారు చేయటానికి చమురు దినుసులు, సహజ వాయువుకి బదులు మిల్క్‌వీడ్, క్వాక్ గ్రాస్, పాయిన్ సెట్టా, గ్వాయూల్ వంటి మొక్కలను వాడవచ్చునని అమెరికా ప్రభుత్వ లేబరేటరీ వారు యోచిస్తున్నారు. ఇందువల్ల దాదాపు 7 శాతం పెట్రోలు దినుసుల వాడకాన్ని తగ్గించవచ్చునని వీరు భావిస్తున్నారు.

ఈ అంశాన్నిగురించి పియోరియా (ఇలినాయ్ రాష్ట్రం)లోని వ్యవసాయ శాఖ పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ విలియమ్ టేలెంట్ విలేఖరులకు చెబుతూ, రబ్బరు, ప్లాస్టిక్ వస్తువుల తయారీలో గ్వాయూల్ మొక్కను వినియోగించే అవకాశాన్ని గురించి ఇజ్రాయేల్ కూడా పరిశోధనలు చేస్తున్నదని చెప్పారు. అయితే ఈ విషయంలో ఇందుకయ్యే అధిక వ్యయాన్ని కూడా దృష్టిలో పెట్టుకొనవలసి ఉంటుందని ఆయన చెప్పారు. "ప్రస్తుతం ఈ రంగంలో పరిశోధన జరుగుతున్నది. ఈ పరిశోధన ఫలితాలు ఆచరణలోకి రావటానికి 15-సంవత్సరాలైనా పట్టవచ్చు" అని అన్నారాయన.

"ఏమి టంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావ్? షాపులోంచి సరుకు పట్టుకుపోయినా పట్టించుకునే స్థితిలో లేవే!" కుర్చీలో కూర్చుంటూ అడిగాడు గిరి.

ఎడం చేతి వేళ్ళతో కనుబొమ్మల కింద రుద్దుకుంటూ తలెత్తి చూశాడు రఘురాం. ఒక నిముషం గడిచాక "అర్జంటుగా ఒక సేల్స్‌మెన్ కావాలి" అన్నాడు.

"ఇంతమంది నిరుద్యోగులున్న ఈ దేశంలో అఫ్ట్రాల్ ఒక కేండిడేట్ కోసం ఇంత ఆలోచించాలా! అనుభవం వున్నవాళ్ళు కావాలంటే, ఎక్కువ జీతం ఇస్తానను. పని చేస్తున్నషాపుని అర్థాంతరంగా వదలి అయిదు నిముషాల్లో వందమంది నీ ముందుంటారు" అన్నాడు గిరి కొత్తగా పెట్టిన మెడికల్ షాపును చూస్తూ.

"అది సరే, నమ్మకమైనవాడు కావాలి కదా."

"అవతలి వ్యక్తి వ్యక్తిత్వం దెబ్బతినకుండా అతడి అవసరాలు ఆదుకుంటూ వుంటే అతనే నమ్మకస్థుడవుతాడు. అంతే కాని 'నేను నమ్మకస్తుడ్ని' అని పచ్చబొట్టు పొడిపించుకుని నీకు చూపించరు. పోనీ ఒక పని చెయ్. నీకు తెలిసిన షాపులో ఎవరికైనా ఆశపెట్టు. వెంటనే వచ్చేస్తాడు."

"జనార్దనం షాపులో పని చేస్తున్న వెంకటేశును రమ్మంటే మిత్రద్రోహం చేసినట్టవుతుందేమో? వస్తాడో? రాడో?"

"మొహమాటానికి పోతే వ్యాపారం చేయలేవు. మిత్రద్రోహం, భాతృద్రోహం అనుకుంటూ కూర్చుంటే వ్యాపారం సాగదు. ఏమీ సాధించలేవు. ఎవరి లాభం వాళ్ళు చూసుకోపోతే ఈరోజుల్లో పైకి రాలేరు!"

"సరేపద" అని షాపు కట్టేశాడు రఘురాం.

ఇద్దరూ కలసి జనార్దనం షాపుకు కాస్త దూరంలో నిలబడి వెంకటేశుకు కబురు పంపారు. విషయం తెలిశాక తనకు వచ్చే జీతానికి మరో ఏభై ఎక్కువచేర్చి చెప్పాడు వెంకటేశు. "మాకు బోనస్ కూడా ఇస్తారు సార్" అన్నాడు.

"అలాగే. నేను ఇంకో పాతిక ఎక్కువిస్తాను. నా దగ్గర చేరు" అన్నాడు రఘురాం.

సేల్స్‌మేన్



"కుదరదు సార్! పాతిక కోసం ఆ సర్వీసంతా వదులుకోమంటారా?"

"ఆఖరు మాట. యాభై ఇస్తాను. ఇంక బేరం లేదు. కొత్తగా పెట్టిన షాపు కాబట్టి నువ్వు సీనియర్‌వు అవుతావు" ఆశ పెట్టాడు.

అకస్మాత్తుగా వందరూపాయలు పెరిగేసరికి లొంగిపోయాడు. నాలుగైదురోజుల్లో చేరతానని చెప్పాడు.

గడువు ప్రకారం కాకుండా ముర్నాడే చేరిపోయినందుకు రఘురాం ఆనందించాడు. వెంకటేశు పనితనం, ఉత్సాహం బాగా నచ్చాయి. స్నేహం దెబ్బతినకుండా జనార్దనాన్ని కలిసి "ఈ రోజుల్లో వర్కర్స్‌ని నమ్మడానికి వీల్లేదు. నాకో సేల్స్‌మన్ కావాలని తెలిపి తనే వచ్చి అడిగాడు. 'అక్కడ చేస్తున్నావు కదా!' అన్నాను. 'మీ దగ్గర చేయాలని వుంది సార్!' అని ప్రాధేయపడ్డాడు అని చెప్పాడు.

జనార్దనం వూ కొట్టి వూరుకున్నాడు.

సంవత్సరం గడిచిపోయింది. బోనస్ గురించి వెంకటేశు అడిగితే "లాభాలు రాలేదు. వస్తే ఇద్దును. నేను నీకు ప్రామిస్ చేయలేదు" అన్నాడు రఘురాం.

వెంకటేశుకు ఏం మాట్లాడాలో పాలుపోలేదు. గొడవ పెట్టుకుంటే వుద్యోగం లోంచి తీసేస్తాడేమో? జీతంలో ఏభై రూపాయలు అబద్ధమాడానని తెలుస్తుందేమో? నని భయపడ్డాడు.

లాభాలు రాకపోడమేమిటి. వున్నవాళ్లు లేనివాళ్లు డబ్బు దగ్గర ఎన్ని అబద్ధాలాడతారో ఆ గిరిగారు వస్తారుగా అప్పుడే అడగొచ్చు అనుకున్నాడు.

నెల గడిచినా గిరి రాలేదు. నాలుగైదుసార్లు యజమానిని అడిగినా ప్రయోజనం లేకపోయింది. గిరి ఇంటిచుట్టూ తిరిగి తన గోడు చెప్పుకున్నాడు. "నేను మాట్లాడుతాములే" అని గిరి పంపేశాడు.

గిరి ఎదురుగా బోనస్ విషయం కదిపినపుడు "లాభాలు రాలేదని చెప్తే వినిపించడంలేదా! ఏమిటీ న్యూసెన్స్" అని కోపగించుకున్నాడు రఘురాం.

"లాభాలు రాకపోడమేమిటి సార్! పని చేస్తున్నవాడ్ని నాకు తెలీదా. మీరు చెప్పండి సార్. అప్పుడు బోనస్ ఇస్తానన్నారుగదండీ" అన్నాడు గిరివేపు తిరిగి.

"ఏమో! నాకు గుర్తులేదు" అన్నాడుగిరి.

"అయిందా. నేనేదో అబద్ధమాడుతున్నట్టు నువ్వు సత్యహరిశ్చంద్రుడిలా మాట్లాడావుగా" రఘురాం అసహ్యించుకుంటున్నట్టుగా చూశాడు.

ఎవరో రావడంతో పనిలో లీనమయ్యాడు వెంకటేశు.

"నువ్వు చేర్పిన ఆ వర్కర్ ఓవర్‌టైం అడుగుతున్నాడు. శలవు రోజున పనిచేస్తే కాంపన్సేటరీ హాలిడే అంటున్నాడు. బోనస్ ఎంతిస్తారు సార్ అంటున్నాడు" ఫిర్యాదు చేస్తున్నట్టుగా చెప్పాడు అపరిచిత వ్యక్తి.

"మన దగ్గర పనిచేసే వాళ్లని మనం కనిపెట్టకపోతే ఎలా. ప్రతి చిన్న విషయం పట్టించుకోకూడదు. మనకు వచ్చేదాంట్లో కొంత వాళ్లకి ఇస్తే ఇంకా కష్టపడి పని చేస్తారు" అన్నాడు రఘురాం.

సేల్స్ మేన్

"అంతే నంటావా! ఏం చేస్తాం. చట్టాలన్నీ లేబర్‌కి ఫర్‌గా వున్నాయి." అని వెళ్లిపోయాడు ఆ వ్యక్తి.

ఈ సంభాషణ విన్న వెంకటేశుకి యజమానిపై సదభిప్రాయం ఏర్పడింది. నిజంగా లాభాలు రాలేదేమో అని బాధ పడ్డాడు.

రెండో ఏడు కూడా లాభాలు రాలేదని, నష్టంమీద వ్యాపారం సాగుతోందనిచెప్పాడు రఘురాం. ఇష్టం లేకపోతే మానెయ్య మన్నాడు.

"మానేస్తాను. రేపట్నుంచేమానేస్తాను. ఒకనెల జీతం, సర్వీసు పైసలు, రెండు సంవత్సరాలకి బోనస్ ఇప్పించండి. వెళ్లిపోతాను."

"ఇవన్నీ ఏమిటి" ఆశ్చర్యంగా అడిగాడు.

మానెయ్యమని ముందు నోటీసు యివ్వలేదు కాబట్టి ఒక నెల జీతం ఇస్తారండి. ఏడాదికి ఒక నెల జీతం చొప్పున ఎన్నేళ్ళు చేస్తే అన్ని నెలల జీతాన్ని సర్వీసు పైసలుగా ఇస్తారు కదండీ అని వివరించాడు.

"రూల్స్ మాట్లాడుతున్నావు. జనార్దనం దగ్గిర చెప్పకుండా మానేశావు. అప్పుడు ఈ రూల్స్ లేవా ?"

"అన్నిచోట్లా వున్నాయండి, అయన అన్నిరూల్ ప్రకారమే ఇచ్చారండి. లాభాలు వచ్చాయని అందరికీ తెలుసు. మాకిచ్చే డబ్బులు దగ్గర వెనక్కి లాక్కుంటే ఎలాగండి."

"మీరు చెప్పినట్లు చేస్తే నెత్తిమీద చెంగేసుకోవాలి. సర్లే రేపు చూద్దాం."

ఆ రాత్రి జనార్దనాన్ని మరో ఇద్దర్నీ కలిసి వెంకటేశు విషయం చెప్పాడు. వెంకటేశు అడిగినవన్నీ ఇవ్వాలని వాళ్ళు చెప్పినపుడు అనవసరంగా మంచి వర్కర్ని పోగొట్టుకున్నానని బాధ పడ్డాడు. బోనస్ ఇచ్చేసి వుద్యోగం మానవద్దని చెబితే మెకై కూర్చుంటాడేమోనని భయపడ్డాడు. కొత్తగా చేరేవాళ్ళతో జాగ్రత్తగా వుండాలని నిశ్చయించుకున్నాడు. ఇద్దరి పని ఒక్కడే చేసేవాడు. ఇప్పుడు ఇద్దర్ని వెతుక్కోవాలేమోననే ఆలోచనలో పడ్డాడు.

తెల్లవారింది.

మానెయ్యబోతున్నట్టుగా నెల రోజుల ముందు జనార్దనాని కిచ్చిన నోటీసు చూపించాడు వెంకటేశు.

అది చూసి విస్తుపోయి, జనం తెలివి మీరుతున్నారని విసుక్కున్నాడు.

నెల జీతం అదనంగా యివ్వకుండా, వచ్చేనెల పని చేయించుకుని ఆ తర్వాత మానెయ్యమంటే? అనొచ్చు కానీ బెడిసి కొట్టిన వ్యవహారం కనుక వీడు ఖరీదైన మందులు పట్టుకు పోతాడేమో? ఎందుకొచ్చిన గొడవ. సెటిల్ చేసి పంపేద్దాం అనుకున్నాడు.

డబ్బులెక్కపెట్టుకొని "వస్తాను సార్" అని షాపులోంచి బయటకు వచ్చాడు.

ఆనాడు అపరిచిత వ్యక్తితో రఘురాం అన్నమాటలు గుర్తు తెచ్చుకుని 'మనిషికో న్యాయం' నవ్వుకున్నాడు వెంకటేశు.

శ్రామికుడి రక్త మాంసాల్ని పీల్చి పిప్పి చేసి, ఇచ్చే జీతానికి నాల్గురెట్లు పని తీసుకునే పెట్టుబడి వర్గాల మనస్తత్వం తెలిసిన వెంకటేశు రఘురాం విషయంలో బాధపడలేదు.

జీతం చాలటం లేదని జనార్దనం దగ్గిర మానివేసే తలపుతో వున్న వెంకటేశుకు రఘురాం నుంచి ఆఫర్ రావడం శుభ సూచకం అనిపించింది. వందరూపాయల జీతం పెరగడానికి సాయపడిన రఘురాంకి మనసులో కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

ఇదివరకు వుద్యోగంలో వున్నాను కాబట్టి ఆఫర్ వచ్చింది. ఇప్పుడు నిరుద్యోగిని. పిలిచి వుద్యోగం యిస్తారా! వెళ్ళి అడిగితే అక్కడెందుకు మానేసావు అని అడగరా ? విషయం చెబితే వుద్యోగంలోకి తీసుకుంటారా ? అన్న అనుమానాలు వెంకటేశు మనసులో వుదయించక పోలేదు.

కష్టపడి పని చేసేవాడికి ఎక్కడో ఒకచోట వుద్యోగం దొరక్కపోదు అన్న ధీమాతో ముందడుగు వేశాడు.

గ మ ని క

గేయాలు పంపేవారు వాటితో తపాలా కార్డు జత పరచవలసి వుంటుంది. గేయాలు త్రిప్పి పంపబడవు. గేయాలు, కవితలు సాధ్యమైనంత క్లుప్తంగా వుండటం మంచిది —సం.

ఈయన బోనస్ అందుకున్నారు.
ఐదుగురుగల తన కుటుంబానికి
యీయన గుడ్డలను కొనవలసివుంది.

ఏ మిల్లు యీయనకు చేయూత నీయగలదు?

లక్ష్మి. ఎందువల్లనంటే, తనకు, తన అర్ధాంగికి, పిల్లలకు ఒకే పర్యాయం యీయన గుడ్డలను కొంటారని లక్ష్మికి విదితం. అందువల్లనే కుటుంబీకులందరకూ అవశ్యమైన గుడ్డలను లక్ష్మి తయారుచేసి అందజేస్తోంది.

ప్రత్యేకమైన నూలు చీరెలు, ఫుల్ వాయిల్, అఫ్ వాయిల్, క్రేప్ మొదలైన అందచందాల చీరెలు; పాలియెస్టర్ బ్లెండ్‌తో కూడిన షర్టింగులు, సూటింగులు; నూలు షర్టింగులు, సూటింగులు లక్ష్మి విశిష్టమైన తయారీల అన్నీ సరసమైన ధరలలో లభ్యంకాగలవు.

మరో పర్యాయం మీ కుటుంబీకులకు గుడ్డలను కొనే సందర్భంలో లక్ష్మి తయారీలను అడిగి కొనండి. లేకపోతే లక్ష్మి షోరూముకు విచ్చేయండి.

మీ అభిరుచికి అనువైన వివిధరకాల బట్టలను లక్ష్మి అందజేస్తోంది.



లక్ష్మి
చీరలు
షర్టింగులు
సూటింగులు

ది
లక్ష్మి
మిల్స్
కంపెనీ లిమిటెడ్
కోయంబత్తూరు

దీటైన బట్టలకు
పోటీలేని చిహ్నం

FDS LM 2609 TEL

హైదరాబాద్ నోట్‌బుక్

—తిరుమల రామచంద్ర

నగరంలో కర్ఫ్యూ :

అల్పసంఖ్యాకులకు మనరాష్ట్రంలో వున్నన్ని సౌకర్యాలు మరొక రాష్ట్రంలో లేదు. అల్ప సంఖ్యాకుల భాషకు తొలిసారిగా అధికార ప్రతిపత్తి కలిగింది మన రాష్ట్రంలోనే. ఉద్యోగాలలోనూ, విధాన సభలలోనూ, మంత్రివర్గంలోను ఇతర రాష్ట్రాలలో లేని ప్రాతినిధ్యం వారికున్నది. అయినా ఇటీవల హైదరాబాద్ పాత బస్తీలో ఉభయ వర్గాలమధ్య కలహాలు చెలరేగాయంటే, ఎవరికన్నా ఆశ్చర్యమవుతుంది. ఈ కలహాలు కల్లోల ప్రాంతంలో నిరవధికంగా కర్ఫ్యూ విధింపునకు కూడా కారణమయ్యాయి. మంగల్‌హాట్, మున్నగు ప్రాంతాలలో కర్ఫ్యూ చాలాకాలం వుంది. ఆగస్టు 8 వ తేదీ వరకు 400 మందిని అరెస్టుచేశారు. ముఖ్యమంత్రి డాక్టర్ ఎం. చెన్నారెడ్డి ఎప్పటికప్పుడు ప్రతిపక్షాలతోను, నగర విధానసభ్యులతోను చర్చలు జరుపుతూ, ప్రశాంతత నెలకొల్పడానికి తగు చర్యలు తీసుకొన్నారు. విధాన సభలోను, విధాన పరిషత్తులోను నగరంలోని కల్లోలం గురించి విమర్శలు, ప్రతివిమర్శలు జరిగాయి. శాంతి భద్రతల రక్షణలో ప్రభుత్వం విఫలమయిందని విధాన పరిషత్తులో తీవ్రంగా విమర్శించారు. ఉద్రిక్తత మాత్రం పాతనగరంలోని డబీర్‌పురా, యాకూత్‌పురా, చాదర్‌ఘాట్, రెయిన్‌బజారు, మీర్‌చౌక్ ప్రాంతాలలో ఉద్రిక్తత సెప్టెంబర్ 3 న మరల పొడసూపడంవల్ల కర్ఫ్యూ విధించారు. డబీర్‌పురాలోని మైసమ్మగుడిలోని విగ్రహాలను, ఫొటోలను ఎవరో బయటికి విసిరారు. దానితో గొడవ ప్రారంభమయింది. ఉభయ వర్గాలవారు రాళ్లు రువ్వుకోడం, కొట్టుకోడం ప్రారంభమయింది. ఇంతకూ నార్లగారన్నట్టు "మతమనిగిత మని మాయలు చేసే పతితులను" దేవుడు ఏమనడెందుకో !

మేలయిన ఉత్తర్వు :

పరిశ్రమలలో 500 రూపాయలు అంతకు తక్కువ ఉద్యోగాలలో 50 శాతం వరకు పది కిలోమీటర్ల పరిధిలోవున్న స్థానికులకే ఇవ్వాలని ప్రభుత్వం లోగడ చేసిన వుత్తరువును ఉపసంహరించుకొన్నదని ముఖ్యమంత్రి ఆగస్టు 31వ తేదీన చేసిన ప్రకటన ప్రశంసనీయం. రాష్ట్రమంతా ఒక్కటేనని ఒకవైపు అంటూ, మరొకవైపు ఇలాటి వుత్తరువులు చేయడం విడ్డూరమేకాక, రాష్ట్రంలో ప్రాంతీయ విభేదాలకూ దారితీయగలదని ముఖ్యమంత్రి అన్నారు. ఈ వుత్తరువు లక్ష్యం పరిశ్రమల స్థాపనవల్ల భూములు కోల్పోయిన వారికి. ఇతరత్రా నష్టపడినవారికి ఉద్యోగాలలో ప్రాముఖ్యమివ్వాలన్నదేనని ఆయన స్పష్టపరిచారు. "స్థానిక" అనే పదనిర్వచనకు మంత్రి వర్గం ఉపసంఘం నియమించారు.

బాల బాలికల అద్భుత ప్రతిభ :-


నవీన బాలానంద సంఘం 9వ వార్షికోత్సవం సెప్టెంబర్ 10వ తేదీన బాలబాలికలు అద్భుతంగా ప్రదర్శించిన నాట్య నాటక ప్రదర్శనాలతో కన్నులపండువుగా జరిగింది. "చిత్తచిత్త వాన" నృత్యం, "పరమానందయ్య శిష్యులు" నాటకం, "కురిసిందిరా వాన, తడిసిందిరా నేల" జానపద నృత్యం చాల సహజంగా వున్నాయి. "మంచి రోజులు వచ్చాయి" నాటకం అకతాయి పిల్లలు పరిస్థితులనుబట్టి మారే అపూర్వ మన స్తత్వాన్ని తెలియజేస్తూ రంజకంగావుంది. సమావేశానికి అధ్యక్షత వహించిన శ్రీ తిరుమల రామచంద్ర, ముఖ్య అతిథిగా విచ్చేసి బహుమతులు పంచిన ఆంధ్రబ్యాంకి ప్రజాసంబంధాధికారి శ్రీ భాస్కర రావు, ప్రధాన వక్త, రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ ప్రధానాధికారి డాక్టర్ అంతటి నరసింహం బాలబాలికల ప్రతిభను ప్రశంసిస్తూ, నవీన బాలానంద సంఘాన్ని అభినందించారు.

బస్సు సౌకర్యం పథకం :-

గాంధీ జయంతి నాటికి రాష్ట్రంలోని ప్రతి గ్రామానికీ, ఏదో విధంగా బస్సు సౌకర్యం కలిగించదలచిందనీ, ఈ ఏడు ప్రయాణీకుల సౌకర్యంకోసం రెండున్నరకోట్లు రూపాయలు వెచ్చించ దలచిందని, వచ్చే సంవత్సరానికి దాదాపు 22 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పథకం రూపొందించామని రాష్ట్ర రవాణా శాఖామంత్రి శ్రీ ఎ. వెంగళరెడ్డి విధానసభలో ప్రకటించడం ప్రశంసనీయమే. కాని, రోడ్డు రవాణా సంస్థ పద్ధతులు మారనంతవరకు—బస్సులను స్టాపులలో ఆపకుండా ఎక్కడో ఆపడం, సకాలంలో రాకపోకలుజరుగకపోవడం, పేరుకు ఎక్స్‌ప్రెస్సులు, సూపర్ ఎక్స్‌ప్రెస్సులుగా వుంటూ ప్యాసింజరు బస్సులకన్నా నికృష్టంగా నడవడం, సరైన స్టాండులు, షెల్టర్లు లేకపోవడం వంటి కనీసపు సౌకర్యాలు, ప్రాథమిక సౌకర్యాలు లేనంతవరకు—ఎన్నికోట్లు ఖర్చుపెట్టినా ప్రయోజనం వుండదు.

నటుడు దుర్గానాగేశ్వరరావుకు సన్మానం :-

దాదాపు 30 సంవత్సరాలుగా రంగస్థల నటుడుగానూ, అప్పుడప్పుడు చలనచిత్ర నటుడుగాను వుంటూ, 9వ ఏటనే వేషం కట్టడం ప్రారంభించి, వివిధ చారిత్రక, పౌరాణిక నాటకాలలో లోహితాస్యుడు మొదలు భీముని వరకు, దాసీ పాత్ర మొదలు నాయిక వరకు వివిధ పాత్రలు నిర్వహించి ప్రేక్షకులకు గిలిగింతలు పెట్టిన ప్రముఖ నటుడు శ్రీ నిమ్మగడ్డ దుర్గానాగేశ్వరరావును "నట సమ్రాట్" ఆగస్టు చివరివారంలో రవీంద్రభారతిలో



సన్మానించింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయశాఖా మంత్రి శ్రీ నాదెళ్ల భాస్కరరావు శ్రీ దుర్గానాగేశ్వరరావును కాశ్మీర్ శాలువతోను, బెయిన్నూటపదార్లతోను నటనధురీణ బిరుదం తోను సత్కరించారు. సుప్రసిద్ధ నాటకకర్త శ్రీ రంచనాదం సన్మానపత్రం చదివారు. సన్మాన సభకు అధ్యక్షత వహించిన ప్రముఖన్యాయవాది శ్రీ పి బాబుల్‌రెడ్డి ప్రసంగిస్తూ, మానవునికి తిండి బట్ట మాత్రమే చాలదని, మనసును ఉల్లాస పరచి సంస్కరించే సాంస్కృతిక సంస్థలు అవసరమని, అన్నారు. "నటసమాఖ్య" అధ్యక్షులు శ్రీ కోకా రాఘవరావు బృందం "శ్రీకృష్ణతులాభారం" నాటకం ప్రదర్శించింది.

జనతానాయకుల ప్రచార యాత్ర :—

ప్రజాసమస్యలపై అక్టోబర్ 16వ తేదీనుంచి రాష్ట్రవ్యాప్తంగా జనతాపార్టీ జరుపనున్న ఆందోళన ఏర్పాట్ల ప్రచారంకోసం జనతానాయకులు జి.సి. కొండయ్య, కె.బి. సిద్ధయ్యనాయుడు పశ్చిమాంధ్రలోను, జనతాపార్టీ అధ్యక్షులు సుబ్బరాజు, విధానసభలో ప్రతిపక్షనాయకుడు గౌతులచ్చన్న, ప్రధానకార్యదర్శి సుంకర సత్యనారాయణ జయలుదేరారు. వారు పూర్వపు సత్యాగ్రహ పద్ధతులను, ఆందోళన సంప్రదాయాలను తమ కార్యకర్తలకు వివరిస్తారు.

బాల విజ్ఞాన సర్వస్వం :—

బాలబాలికలను విజ్ఞానవంతులను చేయడం దేశాభ్యుదయానికి తొలిమెట్టు గనుక, వారికి, ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా వుండగల విజ్ఞానసర్వస్వాన్ని ప్రచురించాలని రాష్ట్రప్రభుత్వం తలపెట్టింది. ఈ పథకాన్ని బాలల అకాడెమి కార్యదర్శి శ్రీ తిరుమల రామచంద్ర, సంయుక్త కార్యదర్శి శ్రీ బుడ్డిగ సుబ్బరాయన్ రూపొందించారు. ఈ పథకం రాష్ట్రప్రభుత్వపరిశీలనలో వుంది. ఈ విషయాలను సాంకేతిక విద్యాశాఖ మంత్రి శ్రీ టి. హయగ్రీవాచార్యులు సెప్టెంబరు 11వ తేదీన శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో "షోర్‌ఫ్రంట్" సంస్థ ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో గెలుపొందిన బాలబాలికలకు బహుమతి ఇవ్వడానికి ఈ సమావేశం ఏర్పాటయింది. ప్రముఖ చిత్రకారుడు, రాష్ట్ర లలిత్‌కళా అకాడెమీ కార్యదర్శి శ్రీ పి.టి. రెడ్డి అధ్యక్షత వహించి బహుమతి ప్రదానంచేశారు. ఈ సందర్భంలో బాలల అకాడెమీ గౌరవ కార్యదర్శిగా నియమితులైన శ్రీ తిరుమల రామచంద్రను "షోర్ ఫ్రంట్" సంస్థ శాలువతో సత్కరించింది.

ఉపశ్రుతి :—

"ఇదేమిటండీ! కాలధర్మం చెందినవారు విధానసభమాజీఉపసభాపతి శ్రీ వాసుదేవకృష్ణాజీ నాయక్ కదా, శ్రీధరవాసుదేవనాయక్ అని ఘోరమైన ముద్రారాక్షసం దొర్లిందారే!" అని ప్రశ్నించారు ఒక రాజకీయవేత్తనన్ను. రాక్షసులు ఘోరంగా వుండక మరెలా వుంటారు?—అని ఎదురు ప్రశ్న వేశారు ఒక పత్రికాధిపతి. ●

ఆశల రేపు

తోయి వసంతాల రూపు.
కోటి గులాబీల కైపు.
నింపుకున్న "ఆ" రేపు
పరుగెడుతోంది నా వైపు.
కానీ నాదాకా రాకండానె
రేపులెన్నో నేడులై
నేడులెన్నో నిన్నలై
నిన్నలెన్నో మొన్నలై
మొన్నలన్నీ సున్నలై
ఎన్నిసార్లు శూన్యంలోకి జారిపోలేదు
నన్ను దైన్యంలో ముంచి పారిపోలేదు
అన్నిసార్లూ నేనేడ్చాను
అయినా ఆ "రేపు"
ఎన్నెన్నో ఆశల్ని రేపుతూ
నా ఎద నుయ్యాలలూపు
అందుకే ఎప్పుడూ నా చూపు
రేపు వేపునే ఉండు.


— వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్



డా॥ కోవూరు కాలధర్మం

డా॥ అబ్రహాం కోవూరు [82] ని ఆంధ్రదేశంలో సత్యసాయి బాబాని సవాలు చేసిన హేతువాదిగా; గారడీ సభలలో విబూది సృష్టించి పంచిన శాస్త్రవేత్తగా చాలా మందికి తెలుసు. శ్రీలంక హేతువాద సంఘం అధ్యక్షుడైన డా॥ కోవూరు సెప్టెంబర్ 18వ తేదీ రాత్రి గుండెపోటుతో కాలధర్మం చెందారు. పునర్జన్మ మీద, దేవుడి మీద నమ్మకంలేని శ్రీ కోవూరు తమ భౌతిక కాయాన్ని వైద్య విద్యార్థుల వినియోగార్థం ఆసుపత్రికి యివ్వమని కోరారు. డా॥ అబ్రహాంకి భారతదేశంలో చాలా మంది అనుయాయులున్నారు.

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna





ఉత్తరాలు

(6 వ పేజీ తరువాయి)

'సినిమా'

మీ వినాయకచవితి సంచిక (15-9-78) లో నేను సినిమా జోకాయణం చదివాను. దానిలో రాజ్‌బాబుగారు "దేవతలందరికీ వాహనాలున్నాయి. మనిషిని మాత్రం ఎవరూ వాహనంగా పెట్టుకోలేదని" వ్రాసారు. అది తప్పు. కుబేరుని వాహనము మనిషి. ఈ విషయమును వారికి తెలియచేయండి.

సిహెచ్. పద్మజ [పాలకొల్లు]

సీరియల్'

"రాగద్వేషాలు" అన్న సీరియల్ మమ్మలను ఎంతగానో ఆకర్షించినది. మాదిరెడ్డి సులోచన గారి "మోహనరూప" సీరియల్ వారం వారం క్రొత్త క్రొత్త మలుపులతో పాఠకుల మనస్సులను ఆకట్టుకొంటున్నది. ఇకపోతే ఈ వారం కథలలో నాకు "స్లిప్" అన్న కథ నచ్చింది.

మల్లాది రమేష్‌బాబు, నల్లపరెడ్డి విజయలక్ష్మి.
(నెల్లూరు-1)

* * *

1-9-78 ఆంధ్రపత్రిక చాలా ఆసక్తిదాయకంగా వుంది. మీరు ప్రచురించే సీరియల్స్ మోహనరూప, రాగద్వేషాలు మమ్మలను ఆనంద పరచాయి. ముఖ్యంగా రాగద్వేషాలు సీరియల్‌లో పల్లెటూరి వాతావరణం, కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. తల్లిలేనికూతురు ఇందిరను లక్షాధికారి హనుమంతరావు ఎదబాయలేని స్థితి చాలా చక్కగా వర్ణించారు. సినిమా విశేషాలు ఆసక్తిదాయకంగావున్నవి. ఇంకను ఈవిధంగానే మంచి సీరియల్స్‌ను ప్రచురించుతారని ఆశిస్తున్నాను. కార్టూనులు చాలా బాగున్నవి. మొత్తంమీద పత్రిక చాలా ఆసక్తిదాయకంగ వుంది.

శివరాజు రామచంద్రరావు. [ఒంగోలు.]




దాసరి నారాయణరావు
విజయ మాధవి పిక్చర్స్
కటకటాల
రుద్రయ్య
స్కోప్ ఈస్ట్‌మన్‌కలర్
నిర్మాత: వడ్డే శోభనాద్రి నిర్వహణ: వడ్డే రమేష్
అన్నపూర్ణ
ANNAPURNA
Nandi